www.trinetnews.com

# ట్రైనెట్ తెలంగాణ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

సంపుటి 01 | సంచిక 86 | ఎడిటర్ :వెంకటేశ్వర్లు రాపోలు | గురువారం అక్టోబర్ 29, 2026 | పేజీలు:12 | వెల.10/-

### మూడో అంతస్తులో అగ్నిప్రమాదం.. భయంతో పరుగులు తీసిన అపార్ట్‌మెంట్‌వాసులు

హైదరాబాద్: సికింద్రాబాద్ అల్వాల్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో బుధవారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. అల్వాల్ పరిధి మచ్చ బొల్లారం గంగా ఎన్‌క్లేవ్‌లోని ఎస్టిలో డివైన్ అపార్ట్‌మెంట్ మూడో అంతస్తులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అపార్ట్‌మెంట్‌లో మంటలు వ్యాపించడాన్ని గమనించిన నివాసితులు భయాందోళనకు గురై బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని రెండు ఫైర్ ఇంజన్లతో మంటలను అదుపులోకి తెచ్చారు. అగ్నిప్రమాదం జరిగిన సమయంలో ఆ ఫ్లాట్‌లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.



# హైదరాబాద్‌లో తాగునీటి సమస్య రావొద్దు..

- తాగునీటి కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి
- రిజర్వాయర్లలో నీటి నిల్వలపై నిరంతర నిఘా
- ఎస్టీపీలను 100% సామర్థ్యంతో పనిచేయించాలి
- పార్కులు, రోడ్లు, నిర్మాణాలకు శుద్ధి చేసిన నీరు వాడాలి
- డేటా సెంటర్లకూ ట్రీటెడ్ వాటర్ సరఫరా చేయాలి
- ట్యాంకర్ల ట్రాకింగ్, నీటి నాణ్యతపై పర్యవేక్షణ
- శుద్ధి చేసిన నీటి కోసం ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్
- నవంబర్ 1 నుంచి ఆదేశాలు అమలు

రానున్న రోజుల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా తెలంగాణ సర్కార్ ముందస్తు చర్యలకు రెడీ అవుతోంది. ఎల్‌నినో, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రిజర్వాయర్లలో నీటి నిల్వలపై నిరంతర నిఘా ఉంచాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎస్టీపీలను పూర్తిస్థాయిలో పనిచేయించి.. శుద్ధి చేసిన నీటిని ప్రభుత్వ కార్యాలయాలు, పార్కులు, రోడ్ల శుభ్రత, నిర్మాణ పనులు, డేటా సెంటర్ల అవసరాలకు వినియోగించాలని ఆదేశించారు. ట్యాంకర్ల సరఫరాను ట్రాక్ చేయడం, నాణ్యతను పర్యవేక్షించడం, ప్రజలకు ప్రత్యేక టోల్‌ఫ్రీ సేవ అందించడం వంటి చర్యల ద్వారా ట్రీటెడ్ వాటర్ వినియోగాన్ని పెంచాలని పేర్కొన్నారు.

హైదరాబాద్ నగరంలో ఎట్టి పరిస్థితుల్లోనూ తాగునీటి కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. సంబంధిత శాఖ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో నీటి అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అదే సమయంలో తాగునీటిని పొదుపుగా వినియోగిస్తూ.. ఇతర అవసరాలకు శుద్ధి చేసిన మురుగునీటిని ఉపయోగించే విధానాన్ని విస్తృతంగా అమలు చేయాలని సీఎం రేవంత్ స్పష్టం చేశారు.

ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి.. హైదరాబాద్‌లో తాగునీటి సరఫరా , మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్‌టీపీలు), శుద్ధి చేసిన నీటి వినియోగంపై అధికారులతో చర్చించారు. హైదరాబాద్ మహా నగర అవసరాలను దృష్టిలో ఉంచుకుని రిజర్వాయర్లలో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని.. తాగునీటి సరఫరా వ్యవస్థపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

మిగతాద్ది 2 లో

# కాంగ్రెస్‌కు మోదీ 'బ్యాలెట్' చురక!

- నాలుగు రాష్ట్రాల ఎమ్మెల్సీ ఎన్నికలపై మోదీ వ్యంగ్యాస్త్రాలు
- బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ ప్రదర్శన పేలవం
- కర్ణాటకలో నాలుగు స్థానాల్లోనూ కాంగ్రెస్ ఓటమి
- మూడు స్థానాల్లో భాజపా విజయం.. ఒక స్థానంలో జేడీఎస్ గెలుపు
- యూపీలో భాజపా ఐదు, ఎస్పీ మూడు స్థానాల్లో విజయం
- మహారాష్ట్రలో మహాయుతి మూడు స్థానాల్లో ఆధిక్యం
- బిహార్‌లో కాంగ్రెస్ సిట్టింగ్ స్థానాన్ని కైవసం చేసుకున్న జన్‌సురాజ్ పార్టీ
- కొన్ని స్థానాల్లో ఓట్ల లెక్కింపు కొనసాగుతుండటంతో పూర్తి ఫలితాలు రావాల్సి ఉంది.

నాలుగు రాష్ట్రాల్లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పేలవ ప్రదర్శనపై ప్రధాని నరేంద్ర మోదీ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. "ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, కర్ణాటక.. ఈ నాలుగు పెద్ద రాష్ట్రాల్లోని 28 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. బ్యాలెట్ పత్రాలతోనే పోలింగ్ ప్రక్రియ నిర్వహించారు. మరి కాంగ్రెస్ ఎన్ని సీట్లు గెలిచిందో తెలుసా?" అంటూ 'ఎక్స్' వేదికగా చురకలంటించారు. ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాలు ఉపయోగించాలంటూ కాంగ్రెస్ డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో మోదీ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

**కర్ణాటకలో అధికార పార్టీకి షాక్**

ఉత్తర్‌ప్రదేశ్‌లో ఆరు ఉపాధ్యాయ, అయిదు



పట్టభద్రుల, బిహార్‌లో నాలుగు ఉపాధ్యాయ, నాలుగు పట్టభద్రుల, కర్ణాటకలో రెండు ఉపాధ్యాయ, రెండు పట్టభద్రుల, మహారాష్ట్రలో రెండు ఉపాధ్యాయ, మూడు పట్టభద్రుల నియోజకవర్గాలకు ఈ నెల 23న ఎన్నికలు జరిగాయి.

# ఎమర్జెన్సీ మెడిసిన్‌లో ఎండీ చేసిన తొలి ట్రాన్స్‌మహిళకు సజ్జనార్ సత్కారం



- ఎమర్జెన్సీ మెడిసిన్‌లో ఎండీ పూర్తి చేసిన డా. కొయ్యల రూత్ జాన్ పాల్
- ఈ ఘనత సాధించిన తొలి ట్రాన్స్‌జెండర్‌గా గుర్తింపు
- వ్యవసాయ కూలీగా పనిచేస్తూ ఎన్నో కష్టాలను ఎదుర్కొన్న రూత్
- వివక్షను అధిగమించి వైద్యరంగంలో ఉన్నత స్థాయికి చేరిక

హైదరాబాద్: ఆత్మవిశ్వాసం, పట్టుదల ఉంటే ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించవచ్చు. ఈ విషయాన్ని తెలంగాణాకుచెందిన డా. కొయ్యల రూత్ మరోసారి నిరూపించారు. వ్యవసాయ కూలీగా పనిచేస్తూ ఎన్నో కష్టాలు, వివక్షను ఎదుర్కొన్నప్పటికీ ఇపుడు డాక్టర్ కొయ్యల రూత్ జాన్ పాల్ నిరూపించారు. ఎమర్జెన్సీ మెడిసిన్‌లో ఎండీ పూర్తిచేసి, దేశంలోనే ఈ ఘనత సాధించిన ట్రాన్స్‌జెండర్‌గా నిలిచిన రూత్‌జాన్ పాల్ ను హైదరాబాద్ పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ ప్రత్యేకంగా అభినందించారు. ఆమె ప్రయాణం ఎందరికో స్ఫూర్తిదాయకం అంటూ ఆమెను సత్కరించినఫోటోలను ట్విటర్‌లో షేర్ చేశారు.



## నారాయణపూర్ లో ఉద్రిక్తత.. సర్వే కోసం వచ్చిన అధికారులను అడ్డుకున్న గ్రామస్తులు

కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలో నారాయణపూర్ గ్రామంలో భూసేకరణ సర్వే ఉద్రిక్తతకు దారి తీసింది . గంగాధర మండలంలోని నారాయణపూర్ గ్రామంలో సర్వే కోసం వచ్చిన వాణిజ అధికారులను అడ్డుకున్నారు గ్రామస్తులు. గ్రామం మొత్తాన్ని ముంపుగా ప్రకటించేవరకు సర్వే వద్దంటూ నినాదాలు చేశారు

2 లో

# తెలంగాణలో 12 మంది ఐఏఎస్‌ల బదిలీ

» 12 మంది సీనియర్ ఐఏఎస్‌లకు స్థానచలనం » అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా జయేష్ రంజన్ » విద్యుత్తుశాఖకు వికాస్‌రాజ్ » క్రీడాశాఖకు వాణీ ప్రసాద్ » పంచాయతీరాజ్ శాఖకు నవీన్‌మిత్తల్ » రెవెన్యూ ముఖ్య కార్యదర్శిగా శైలజా రామయ్యర్ » గిరిజన సంక్షేమశాఖకు రాహుల్ బొజ్జా » రవాణా, ఆర్ అండ్ బీ కార్యదర్శిగా కె.ఇలంబర్తి » మహిళా, ఎస్సీ సంక్షేమ శాఖకు శ్రుతి ఓజా » వైద్యారోగ్యశాఖ డైరెక్టర్‌గా ముషారఫ్ అలీ » కోర్ అర్బన్ రీజియన్ ప్రత్యేక అధికారిగా సర్ఫరాజ్ అహ్మద్ » దానకిశోర్ పదవీకాలం పొడిగింపు » జితేష్ పాటిల్‌కు టీజీ రెడ్కో వీసీగా అదనపు బాధ్యతలు




# వీడియో కాల్స్‌తో నేరాలు.. డిజిటల్ అరెస్టులపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



2లో..

- డిజిటల్ అరెస్టులంటే డిజిటల్ దోపిడీనే: సుప్రీంకోర్టు
- సైబర్ నేరగాళ్లపై ఉక్కుపాదం మోపాలని ఆదేశం
- నేరస్థులకు కఠిన శిక్షలు పడాల్సిందేనని స్పష్టీకరణ
- విచారణకు ముందే శిక్షించే అవకాశం ఉంటే ఉపయోగించాలని వ్యాఖ్య
- నిందితుల సౌలభ్యం కోసం బాధితులను ఇబ్బంది పెట్టలేమని వెల్లడి
- దేశవ్యాప్తంగా నమోదైన కేసులన్నింటినీ ఒకేచోట విచారించాలన్న పిటిషన్ కొట్టివేత
- 12 రాష్ట్రాల్లో 30కి పైగా కేసులు నమోదైనట్లు వెల్లడి
- సైబర్ నేరాల సొమ్మును దాచేందుకు మ్యూల్ బ్యాంకు ఖాతాల వినియోగం
- బాధితుల హక్కులే ప్రాధాన్యమని స్పష్టం చేసిన ధర్మాసనం




## ఏసీబీకి చిక్కిన బంజారాహిల్స్ ఎస్సై

హైదరాబాద్: నగరంలోని బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఏసీబీ అధికారులు బుధవారం సోదాలు చేపట్టారు. రూ.లక్ష లంచం తీసుకుంటూ బంజారాహిల్స్ పీఎస్ ఎస్సై విజయ్ పట్టుబడ్డారు. బాధితుడి నుంచి రూ.10లక్షలు లంచం డిమాండ్ చేసిన ఎస్సై.. అందులోని రూ.లక్ష తీసుకుంటుండగా అధికారులు పట్టుకున్నారు. దీంతో విజయ్‌ను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు

# రైల్వే నిలయం ఎదుట కాంగ్రెస్ మెరుపు ధర్నా

- సికింద్రాబాద్ రైల్వే నిలయం ఎదుట కాంగ్రెస్ ఆందోళన
- ధర్నాలో మహేష్‌కుమార్, పొన్నం ప్రభాకర్ పాల్గొనడం
- ఢిల్లీకి ప్రత్యేక రైళ్లు నిరాకరించడంపై నిరసన
- జీఎం కార్యాలయం మెట్లపై బైఠాయింపు
- కాంగ్రెస్ నేతలను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలింపు



2లో..

# ఇందిరమ్మ పాలన అంటే ఎమర్జెన్సీనా?: కేటీఆర్



2 లో

- బీఆర్ఎస్ నేతల హౌస్ అరెస్ట్‌లపై ఆగ్రహం
- మూసీ ప్రజాభిప్రాయ సేకరణకు అడ్డంకులని ఆరోపణ
- మూసీ పేరుతో రూ.1.5 లక్షల కోట్ల దోపిడీని ఆపాలని డిమాండ్
- రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్
- సబిత, కార్తీక్‌రెడ్డిని విడుదల చేయాలని డిమాండ్
- మూసీపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం



2 లో

## చందానగర్ లో బైక్ దొంగల ముఠా అరెస్ట్.. మొత్తం ఐదుగురు, 2025 నుంచి ఇదే పని..!

చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వరుస బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ఐదుగురు సభ్యుల ముఠాను అరెస్ట్ చేశారు పోలీసులు. 2025 డిసెంబర్ నుంచి బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న వీరిని బుధవారం ( అక్టోబర్ 28 ) అరెస్ట్ చేశారు పోలీసులు. వీరి దగ్గర నుంచి చోరీకి గురైన రాయల్ ఎన్ఫీల్డ్, కేటీఎం బైకులతో పాటు నకిలీ నంబర్ ప్లేట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు పోలీసులు.చందానగర్ హుడా కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అడేపు అజయ్ ఇంటి ముందు పార్క్ చేసిన రాయల్ ఎన్‌ఫీల్డ్ క్లాసిక్ 350 బైక్ అక్టోబర్ 25 అర్ధరాత్రి చోరీకి గురైందని.. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు



## కోరుట్ల యువకుడిని రష్యాలో క్లీనింగ్ జాబ్ అని తీసుకెళ్లి.. ఉక్రెయిన్ సరిహద్దులకు పంపారు..

రష్యాలో క్లీనింగ్ జాబ్ ఇప్పిస్తామని చెప్పి లక్షల రూపాయలు వసూలు చేసి ఓ యువకుడిని మోసం చేశారు ఏజెంట్లు. కోరుట్లకు చెందిన ముక్కెర రాజ్ కుమార్ అనే యువకుడిని క్లీనింగ్ జాబ్ ఇప్పిస్తామని చెప్పి రష్యాకు తీసుకెళ్లి ఉక్రెయిన్ సరిహద్దులు పంపించారు ఏజెంట్లు. రాజ్ కుమార్ రష్యాలో చిక్కుకున్నాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు కుటుంబసభ్యులు.

త్రినేత్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
గురువారం అక్టోబర్ 29, 2026
www.trinetnews.com

# ఆర్నాబ్ తుఫానుతో రైతులకు తీవ్ర నష్టం.. ఆదుకోవాలని కేంద్రానికి మంత్రి అచ్చెన్నాయుడు లేఖ

**- రాష్ట్రంలో 2.24 లక్షల హెక్టార్లలో నీటమునిగిన, దెబ్బతిన్న పంటలు**
**- 14 జిల్లాల్లో సుమారు 3.45 లక్షల మంది రైతులపై తుఫాను ప్రభావం**
**- ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ నిబంధనల మేరకు పెట్టుబడి రాయితీ అందించాలని విజ్ఞప్తి**
**- సమగ్ర నష్ట నివేదిక అందేలోపే ముందస్తుగా కేంద్ర నిధులు విడుదల చేయాలని అభ్యర్థన**

**అమరావతి, త్రినేత్ న్యూస్,**
అక్టోబర్ 28: ఆర్నాబ్ అత్యంత తీవ్ర తుఫాను కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ, ఉద్యాన పంటలకు భారీ నష్టం వాటిల్లే పరిస్థితులు ఏర్పడ్డాయని, కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణ ఆర్థిక సహాయం అందించాలని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు బుధవారం లేఖ రాశారు. తుఫాను ప్రభావంతో రాష్ట్రంలోని 14 జిల్లాల్లో 2,24,489 హెక్టార్లలో పంటలు నీటమునగడం లేదా దెబ్బతినడంతో సుమారు 3.45 లక్షల మంది రైతులు ప్రభావితమైనట్లు ప్రాథమిక నివేదికల ద్వారా వెల్లడైందని తెలిపారు. పంటలు చేతికందే కీలక సమయంలో ప్రకృతి విపత్తు సంభవించడం రైతాంగానికి తీవ్ర ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. అక్టోబర్ 28 తెల్లవారుజామున యానాంకు దక్షిణంగా ఆంధ్రప్రదేశ్--యానాం తీరాన్ని దాటిన ఆర్నాబ్ తుఫాను గంటకు 125 నుంచి 135 కిలోమీటర్ల వేగంతో గాలులు, గరిష్ఠంగా 150 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులకు కారణమైందని మంత్రి వివరించారు. తీరం దాటే సమయంలో తుఫాను దాదాపు స్థిరంగా కొనసాగడంతో కృష్ణా నుంచి శ్రీకాకుళం వరకు పలు తీరప్రాంత జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిశాయన్నారు. రాష్ట్రంలోని 688 మండలాలకు గాను 317 మండలాల్లో 10 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైందని, శ్రీకాకుళం నుంచి బాపట్ల వరకు విస్తరించిన 16 జిల్లాల్లోని 325 మండలాల్లో 315 మండలాలు ఈ పరిధిలో ఉన్నాయని తెలిపారు. విశాఖపట్నం జిల్లాలో సగటున 236.7 మి.మీ., విజయనగరంలో 212.1 మి.మీ., అనకాపల్లిలో 209.2 మి.మీ. వర్షపాతం నమోదు కాగా, విశాఖ జిల్లా గోపాలపట్నంలో అత్యధికంగా 323.2 మి.మీ. వర్షం కురిసిందని పేర్కొన్నారు. గోదావరి, కృష్ణా డెల్టా ప్రాంతాల్లోనూ భారీ వర్షాల కారణంగా పంటలు నీటమునిగాయని వివరించారు.

### వరి పంటకే అత్యధిక ప్రభావం.. డెల్టా రైతులకు తీవ్ర నష్టంలి

ప్రాథమిక అంచనాల ప్రకారం 154 మండలాల్లో 2,11,726 హెక్టార్ల వ్యవసాయ పంటలు నీటమునగడం లేదా దెబ్బతినగా, ఇందులో వరి విస్తీర్ణమే 2,09,460 హెక్టార్లు ఉందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. వ్యవసాయ పంటలకు సంబంధించి

To:
Shri Shivraj Singh Chouhan,
Hon'bleUnion Minister for Agriculture & Farmers Welfare and Rural Development,
Lr No: AGC02-26026/23/2026-NC CELL - AGRHOD Dt:28-10-2026

Sub: NATURAL CALAMITIES – Very Severe Cyclonic Storm "Arnab" (October 2026) – Preliminary assessment of rainfall and damage to agriculture and horticulture crops in Andhra Pradesh – Request for Central assistance – Reg

Ref: Preliminary field reports received from District Agriculture Officers dated 28-10-2026

****

I wish to draw your kind attention to the impact of the Very Severe Cyclonic Storm "Arnab", which crossed the Andhra Pradesh–Yanam coast near the south of Yanam during the early hours of 28 October 2026. The system brought sustained wind speeds of 125–135 kmph, with gusts reaching 150 kmph, and remained nearly stationary along the coast during landfall, causing heavy to extremely heavy rainfall across the coastal districts from Krishna to Srikakulam.

The rainfall was widespread and intense. On 28 October 2026, 317 of the State's 688 mandals recorded more than 10 mm of rainfall, including 315 of the 325 mandals across the 16 districts from Srikakulam to Bapatla. The north coastal districts were particularly affected, with district-average rainfall of 236.7 mm in Visakhapatnam, 212.1 mm in Vizianagaram and 209.2 mm in Anakapalli. Heavy rainfall also affected the Godavari and Krishna delta districts, where a substantial share of the reported crop damage is concentrated. The highest recorded rainfall was 323.2 mm at Gopalapatnam in Visakhapatnam district, while heavy rainfall continued in several parts of the State.

The storm has affected the farming community at a particularly sensitive stage of the Kharif season. In the State's major paddy-growing areas, the crop had reached the grain-filling to harvesting stage, and harvesting had commenced in several districts.

Based on preliminary reports received from the field, agricultural and horticultural crops over 2.24 lakh hectares, belonging to 345 lakh farmers across 14 districts, have been inundated or damaged. The district-wise details reported so far are presented below:

| Sl. | District | Agriculture (area inundated) | | | | Horticulture | | Total area (ha) |
|---|---|---|---|---|---|---|---|---|
| | | Mandals | Area inundated / damaged (ha) | of which Paddy (ha) | Farmers | Area (ha) | Farmers | |

3,18,704 మంది రైతులు, ఉద్యాన పంటలకు సంబంధించి మరో 25,914 మంది ప్రభావితమయ్యారని పేర్కొన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 76,176 హెక్టార్లు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమలో 44,232, కాకినాడలో 42,222, తూర్పుగోదావరిలో 29,866, కృష్ణాలో 22,339, బాపట్లలో 4,032 హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యాన పంటలు ప్రభావితమైనట్లు వివరించారు. అలాగే విజయనగరంలో 1,967 హెక్టార్లు, అనకాపల్లిలో 1,624, గుంటూరులో 570, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 422, శ్రీకాకుళంలో 374, పోలవరంలో 310, ఏలూరులో 274, విశాఖపట్నంలో 81 హెక్టార్లలో పంటలు నీటమునగడం లేదా దెబ్బతిన్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా పశ్చిమ గోదావరి జిల్లాలో సుమారు 82 శాతం, కోనసీమలో 75 శాతం, కాకినాడలో 48 శాతం వరి విస్తీర్ణం నీటమునిగినట్లు నివేదికలు సూచిస్తున్నాయని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో వరి గింజ దశ నుంచి కోత దశకు చేరుకున్న తరుణంలో తుఫాను సంభవించడంతో పంటలు నేలకొరగడం, ధాన్యం మొలకెత్తడం, రంగు మారడం వంటి సమస్యలు తలెత్తే ప్రమాదముందన్నారు. ఇప్పటికే కోసిన ధాన్యానికి సైతం నష్టం వాటిల్లే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు.

### అరటి, కొబ్బరి, కూరగాయల పంటలకూ తీవ్ర దెబ్బ

రాష్ట్రవ్యాప్తంగా 12,763 హెక్టార్లలో ఉద్యాన పంటలు ప్రభావితమయ్యాయని మంత్రి పేర్కొన్నారు. బలమైన గాలులకు అరటి తోటలు నేలకొరిగాయని, ముఖ్యంగా గెలలు వేసి కోతకు సిద్ధంగా ఉన్న మొక్కలు విరిగిపోవడం లేదా వేళ్లతో సహా కూలిపోవడంతో రైతులకు గణనీయమైన నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడిందన్నారు. కూరగాయల తోటల్లో నీరు నిలిచిపోవడం వల్ల మొక్కలు వాడిపోవడం, వేర్లు కుళ్లిపోవడం వంటి సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదముందని తెలిపారు. పశ్చిమ గోదావరి, కోనసీమ జిల్లాల్లో కొబ్బరి తోటల్లో మట్టలు విరిగిపోవడం, పిందెలు, కాయలు రాలిపోవడంతో పాటు కొన్ని ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయని వివరించారు. బొప్పాయి, పూలు, తమలపాకు తోటలకు కూడా నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక సమాచారం అందిందన్నారు.

### వర్షాలు తగ్గిన వెంటనే సంయుక్త క్షేత్రస్థాయి పరిశీలన

ప్రస్తుతం అందుబాటులో ఉన్న గణాంకాలు ప్రాథమికమైనవేనని, వర్షాలు తగ్గి వరద నీరు పూర్తిగా తొలగిన తర్వాతే వాస్తవ పంట నష్టాన్ని నిర్ధారించగలమని మంత్రి స్పష్టం చేశారు. వ్యవసాయ, ఉద్యానవన, రెవెన్యూ శాఖల అధికారులు ప్రభావిత గ్రామాల్లో సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించి నష్టాన్ని అంచనా వేస్తారని తెలిపారు. ఆ వివరాలతో సమగ్ర నివేదికను కేంద్రానికి సమర్పిస్తామన్నారు. వర్షాలు, బలమైన గాలులు కొనసాగుతున్న నేపథ్యంలో నష్టం మరింత పెరిగే అవకాశముందని పేర్కొన్నారు. తుఫాను ముప్పును ముందుగానే గుర్తించి రైతులను అప్రమత్తం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పంటల వారీగా 1.05 కోట్లకు పైగా ముందస్తు సూచనలు జారీ చేసిందని మంత్రి అచ్చెన్నాయుడు వివరించారు. రైతు సేవా కేంద్రాల సిబ్బందిని క్షేత్రస్థాయిలో అప్రమత్తం చేసి, పంటల సంరక్షణకు అవసరమైన జాగ్రత్తలను తెలియజేయడంతో పాటు రైతులకు సహాయ సహకారాలు అందించేలా చర్యలు చేపట్టామన్నారు. ప్రకృతి విపత్తుల సమయంలో పంట నష్టాన్ని తగ్గించడం, రైతుల జీవనోపాధిని కాపాడటమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని తెలిపారు.

### కేంద్రం తక్షణమే స్పందించాలి.. ముందస్తు నిధులు విడుదల చేయాలి

తుఫాను కారణంగా రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని మంత్రి అచ్చెన్నాయుడు కోరారు. జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి (చీణ=ఖీ), రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి (ూణ=ఖీ) నిబంధనల మేరకు నష్టపోయిన రైతులకు పెట్టుబడి రాయితీ అందించేందుకు కేంద్ర సహాయం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమగ్ర నష్ట నివేదిక సమర్పణకు ముందే అత్యవసర సహాయక చర్యల కోసం ముందస్తుగా నిధులు విడుదల చేయాలని అభ్యర్థించారు. సకాలంలో ఆర్థిక సహాయం అందితే రైతుల కష్టాలను కొంతవరకు తగ్గించడంతో పాటు వారి జీవనోపాధిని పరిరక్షించేందుకు, రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన సహాయక, పునరుద్ధరణ చర్యలను వేగవంతం చేసేందుకు వీలవుతుందని వివరించారు. ఈ విషయంలో కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ వ్యక్తిగతంగా చొరవ తీసుకుని ఆంధ్రప్రదేశ్ రైతాంగానికి అండగా నిలవాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తన లేఖలో కోరారు.

# అమెరికాలో పెట్టుబడిదారులను ఆకర్షిస్తున్న తెలంగాణ పర్యాటకం

**"భారతదేశంలో ఇంకా వెలుగులోకి రాని అద్భుత రత్నం," అని గ్లోబల్ టూరిజం కన్సల్టెంట్ వ్యాఖ్య**

**హైదరాబాద్, త్రినేత్ న్యూస్,**
అక్టోబర్ 28: డిసెంబరులో హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026కు ముందు, రాష్ట్రంలో విస్తారంగా ఉన్న, ఇంకా పూర్తిగా వినియోగంలోకి రాని పర్యాటక పెట్టుబడి అవకాశాలనుప్రదర్శించేందుకు తెలంగాణ పర్యాటక శాఖ అమెరికాలోని పెట్టుబడిదారులు, పరిశ్రమ ప్రముఖులు ప్రభావశీల భారతీయ ప్రవాసులతో చురుకుగా చర్చలు జరుపుతోంది. పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్, ఐఏఎస్, అమెరికాలోని ప్రముఖ వ్యాపారవేత్తలు, మీడియా ప్రముఖులు మరియు అధిక నికర విలువ కలిగిన పెట్టుబడిదారులతో చర్చలు జరిపి, తెలంగాణలో అందుబాటులో ఉన్న పెట్టుబడి అవకాశాలను, ముఖ్యంగా గుర్తించబడిన ఎనిమిది ప్రత్యేక పర్యాటక ప్రాంతాల్లో (సాూరం) ఉన్న అవకాశాలను వివరించారు.

ఈ సమావేశాల్లో న్యూయార్క్ మేయర్ కార్యాలయ డిప్యూటీ చీఫ్ బిజినెస్ డైవర్సిటీ ఆఫీసర్ దిలీప్ చౌహాన్; ఇండో–అమెరికన్ ఆర్ట్స్ కౌన్సిల్ ప్రచురణకర్త, సీఈఓ మరియు అధిపతి సునీల్ హాలి; ప్రముఖ సాంకేతిక పారిశ్రామికవేత్తలు మరియు పెట్టుబడిదారులు అత్లూరి రితేష్ పారిఖ్ పాల్గొన్నారు. రాష్ట్ర సామర్థ్యాన్ని వివరించిన శ్రీమతి వాణి ప్రసాద్, తెలంగాణలో ఆతిథ్య రంగం, పర్యాటక ఆకర్షణలు, మ్యూజియంలు, సాంకేతికత ఆధారిత సందర్శక సేవలు మరియు డేటా ఆధారిత పరిష్కారాల్లో గణనీయమైన తొలి పెట్టుబడిదారుల అవకాశాలు ఉన్నాయని తెలిపారు.







హైదరాబాద్‌కు అవతల ఉన్న పర్యాటక ప్రాంతాల్లో ప్రపంచ స్థాయి పర్యాటక మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంలో, సందర్శకుల అనుభవాలను మెరుగుపరచడంలో పెట్టుబడిదారులు కీలక పాత్ర పోషించగలరని ఆమె పేర్కొన్నారు. నేషనల్ జియోగ్రాఫిక్ మాజీ వైస్ ప్రెసిడెంట్ మరియు ప్రచురణకర్త శ్రీమతి డాన్ డ్రూ, తెలంగాణలో అభివృద్ధి చెందుతున్న పర్యాటక అవకాశాలను ప్రశంసిస్తూ, రాష్ట్రాన్ని భారతదేశంలో ఇంకా వెలుగులోకి రాని అద్భుత రత్నం గా అభివర్ణించారు.

అమెరికాలోని ప్రయాణికులు మరియు పెట్టుబడిదారులకు సందేశం తెలంగాణను కనుగొనండి" గా ఉండాలని సునీల్ హాలి అన్నారు. రెండు నగరాల మధ్య పెరుగుతున్న అనుబంధాన్ని ప్రస్తావిస్తూ, "న్యూయార్క్ హైదరాబాద్‌ను కలుస్తోంది" అనే సందేశాన్ని దిలీప్ చౌహాన్ వెల్లడించారు.

పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, అమెరికా పెట్టుబడిదారుల వర్గాల నుంచి లభించిన ప్రోత్సాహకర స్పందనను స్వాగతిస్తూ, పర్యాటకాన్ని రాష్ట్రంలోని ప్రధాన అభివృద్ధి రంగాల్లో ఒకటిగా నిలపడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

"తెలంగాణ పర్యాటక విధానం ద్వారా 1.7 బిలియన్ అమెరికన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించడం, సుమారు 3 లక్షల ఉద్యోగాలను సృష్టించడం లక్ష్యంగా పెట్టుకున్నాం. వయస్సు, లింగం, విద్యా నేపథ్యాలతో సంబంధం లేకుండా పర్యాటకం జీవనోపాధి అవకాశాలను సృష్టించగలదు. అదే సమయంలో పారిశ్రామికవేత్తలకు గణనీయమైన అవకాశాలను అందిస్తుంది. తెలంగాణను ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన పర్యాటక గమ్యస్థానంగా అభివృద్ధి చేయడానికి మేము కట్టుబడి ఉన్నాం," అని ఆయన అన్నారు.

పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్ మరియు పర్యాటక శాఖ డైరెక్టర్ రంజీత్ నాయక్ నేతృత్వంలోని తెలంగాణ పర్యాటక ప్రతినిధి బృందం మయామిలో జరుగుతున్న వరల్డ్ ట్రావెల్ ఎక్స్‌పో (ఔఙు) లో పాల్గొంటోంది. ఈ ప్రదర్శనలో 70 దేశాల నుంచి 400కు పైగా ప్రదర్శకులు, జాతీయ ప్రాంతీయ పర్యాటక బోర్డులు, కన్వెన్షన్ ఀ విజిటర్స్ బ్యూరోలు పాల్గొంటున్నాయి.

తెలంగాణను ప్రాధాన్య పర్యాటక మరియు పెట్టుబడి గమ్యస్థానంగా ప్రచారం చేసేందుకు ప్రతినిధి బృందం ట్రావెల్ ట్రేడ్ ప్రతినిధులు, మీడియా సంస్థలు మరియు పసిఫిక్ ఏషియా ట్రావెల్ అసోసియేషన్ (ూూూ) తో ముందుగా నిర్ణయించిన సమావేశాలు నిర్వహిస్తోంది.

మయామి-డేడ్ కౌంటీ మేయర్ డానియెల్లా లెవిన్ కావా మరియు మయామి బీచ్ మేయర్ స్టీవెన్ మీనర్ కూడా ఔఙు మయామిలోని తెలంగాణ పర్యాటక పావిలియన్‌ను సందర్శించి, రాష్ట్రంలోని పర్యాటక పెట్టుబడి అవకాశాలపై వివరాలు తెలుసుకున్నారు.

అమెరికాలో నిర్వహిస్తున్న ఈ ప్రచార కార్యక్రమం, తెలంగాణ పర్యాటక సామర్థ్యాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రదర్శించి, ఈ రంగంలో వ్యూహాత్మక పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్రం చేపడుతున్నది.

# తాండూరు కందులకు అంతర్జాతీయ గుర్తింపు: ఆస్ట్రేలియాకు తొలి ఎగుమతిలి

**జీఐ ట్యాగ్ పొందిన తాండూరు కందుల ఎగుమతికి అపెడా ఊతం**







**హైదరాబాద్, త్రినేత్ న్యూస్**
అక్టోబర్ 28: భౌగోళిక గుర్తింపు (జీఐ) పొందిన తాండూరు కందులు తొలిసారిగా ఆస్ట్రేలియాకు ఎగుమతి అవుతున్నాయి. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని వ్యవసాయ, ప్రాసెస్డ్ ఆహార ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి ప్రాధికార సంస్థ (అపెడా) సహకారంతో ఈ ఎగుమతి సాధ్యమైంది. తొలి సరుకును బుధవారం హైదరాబాద్ నుంచి హైబ్రిడ్ విధానంలో జెండా ఊపి ప్రారంభించారు.

రాష్ట్ర వ్యవసాయ ఉత్పత్తి కమిషనర్, వ్యవసాయ, సహకార శాఖ ప్రభుత్వ కార్యదర్శి సురేంద్ర మోహన్ (ఐఏఎస్), హైదరాబాద్ అపెడా అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఆర్.పి. నాయుడు వర్చువల్ విధానంలో సరుకును ప్రారంభించారు. హైదరాబాద్‌లోని ప్రాంతీయ అథారిటీ అదనపు విదేశీ వాణిజ్య డైరెక్టర్ జనరల్ డాక్టర్ సంపత్ కుమార్ (ఐటీఎస్), హైదరాబాద్‌కు చెందిన ఎం/ఎస్ దుర్గా ఎక్స్‌పోర్ట్స్ అండ్ ఇంపోర్ట్స్ ప్రతినిధి, ఎగుమతిదారు సుమంత్ ఆర్., ఇతర అపెడా అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సరుకులో 2.5 మెట్రిక్ టన్నుల జీఐ ట్యాగ్ తాండూరు కందులు ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన ఎం/ఎస్ దుర్గా ఎక్స్‌పోర్ట్స్ అండ్ ఇంపోర్ట్స్ సంస్థ 'అమ్మాస్' (అమ్మాస్ ) బ్రాండ్ పేరుతో వీటిని ఎగుమతి చేస్తోంది. సముద్ర మార్గంలో రవాణా అయ్యే ఈ సరుకును ఆస్ట్రేలియాలోని ఎం/ఎస్ భారతమ్మ పీటీవై లిమిటెడ్ సంస్థ దిగుమతి చేసుకుంటుంది. అపెడాలో నమోదైన ఈ సంస్థ తెలంగాణ నుంచి బియ్యం, పప్పుధాన్యాలు, సుగంధ ద్రవ్యాలు, కిరాణా సరుకులను ఎగుమతి చేస్తోంది. తెలంగాణకే ప్రత్యేకమైన వ్యవసాయ ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రోత్సహించడంలో ఈ ఎగుమతి ఒక ముఖ్యమైన ముందడుగని అధికారులు పేర్కొన్నారు.

### తెలంగాణ గర్వకారణం -- తాండూరు కందులు

తెలంగాణ నుంచి జీఐ గుర్తింపు పొందిన మొట్టమొదటి వ్యవసాయ ఉత్పత్తి తాండూరు కందులే. తాండూరు, బషీరాబాద్, పెద్దేముల్, యాలాల మండలాల్లోని వర్షాధార భూముల్లో ప్రధానంగా ఈ పంటను సాగు చేస్తున్నారు. ఈ ప్రాంతంలోని సారవంతమైన లోతైన నల్లరేగడి నేలలు, అటాపుల్గైట్ బంకమట్టి ఖనిజ నిక్షేపాలు, విస్తారమైన సున్నపురాయి నిక్షేపాల వల్లే తాండూరు కందులకు ప్రత్యేక లక్షణాలు వచ్చాయి. తాండూరు కందుల్లో 22 నుంచి 24 శాతం మాంసకృత్తులు (ప్రోటీన్) ఉంటాయి. ఇది ధాన్యాల్లోని ప్రోటీన్ కంటే దాదాపు మూడు రెట్లు ఎక్కువ. రుచి, వంటకు అనుకూలత, ఎక్కువ కాలం నిల్వ ఉండే గుణం వీటి ప్రత్యేకత. జీఐ గుర్తింపు వల్ల ఈ ఉత్పత్తికి మరింత ప్రాచుర్యం, మార్కెట్‌లో గుర్తింపు లభించడంతో పాటు దేశ, విదేశీ మార్కెట్లలో అధిక విలువ పొందే అవకాశం ఉంటుంది. ఆస్ట్రేలియాకు జరుగుతున్న ఈ ఎగుమతి, ఈ విశిష్ట వ్యవసాయ ఉత్పత్తికి కొత్త విదేశీ మార్కెట్లను అన్వేషించే దిశగా కీలక అడుగు. దీని ద్వారా రైతులకు, ఉత్పత్తిదారులకు, ఎగుమతిదారులకు మరిన్ని అవకాశాలు లభిస్తాయి.

### జీఐ ఉత్పత్తుల ప్రోత్సాహానికి అపెడా చేయూతలిలి

దేశంలోని జీఐ గుర్తింపు పొందిన వ్యవసాయ ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లో ప్రోత్సహించేందుకు అపెడా నిరంతరం కృషి చేస్తోంది. ఎగుమతి అనుసంధానాలు కల్పించడం, వాణిజ్య ప్రదర్శనల్లో ఎగుమతిదారులు పాల్గొనేలా ప్రోత్సహించడం, ఎగుమతి అవకాశాలు, మార్కెట్ ప్రవేశంపై మార్గదర్శనం చేయడం ద్వారా ఈ ఉత్పత్తులకు చేయూతనిస్తోంది. దేశంలోని ప్రత్యేక ప్రాంతీయ వ్యవసాయ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్త గుర్తింపు తేవడం, రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పీఓలు), రైతు ఉత్పత్తిదారుల కంపెనీలు (ఎఫ్‌పీసీలు), ఎగుమతిదారులకు స్థిరమైన మార్కెట్ అవకాశాలు కల్పించడం అపెడా లక్ష్యం.

ఈ చర్యతో తెలంగాణకు చెందిన జీఐ ఉత్పత్తులు, ఇతర ప్రత్యేక వ్యవసాయ ఉత్పత్తుల కోసం అంతర్జాతీయ మార్కెట్లను అన్వేషించే ప్రయత్నాలు మరింత ముమ్మరం అవుతాయని భావిస్తున్నారు. వ్యవసాయ విలువ గొలుసులోని రైతులు, ఎగుమతిదారులు, ఇతర భాగస్వాములకు ఎగుమతి అవకాశాలు బలపడతాయని ఆశిస్తున్నారు. ఎగుమతిదారులు, భాగస్వాములతో నిరంతర సంప్రదింపుల ద్వారా భారత వ్యవసాయ ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్‌లో స్థానం పెంచడానికి, కొత్త ఎగుమతి అవకాశాలు సృష్టించడానికి, భారతదేశ సుసంపన్న వ్యవసాయ వారసత్వాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడానికి అపెడా కట్టుబడి ఉందని అధికారులు తెలిపారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సదర్ ఉత్సవాల ఆహ్వానం

**హైదరాబాద్, త్రినేత్ న్యూస్, అక్టోబర్ 28:**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో శ్రీకృష్ణ సదర్ సమ్మేళనం ఉత్సవ కమిటీ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. వచ్చే నెల 4వ తేదీన హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించనున్న సదర్ ఉత్సవాలకు ముఖ్యమంత్రిని ఆహ్వానించారు. సదర్ ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించినందుకు కమిటీ ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సదర్ ఉత్సవాలకు రాష్ట్ర పండుగ హోదా కల్పించడం యాదవ సామాజిక వర్గానికి గర్వకారణమని, సంప్రదాయాలు, సంస్కృతిని పరిరక్షించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ సదర్ సమ్మేళనం ఉత్సవ కమిటీ ఛైర్మన్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, యాదాద్రి బోర్డు సభ్యురాలు ఈశ్వరమ్మ యాదవ్, మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.



# లక్షలాది నిరుద్యోగులకు మంత్రి పొంగులేటి జన్మదిన కానుక

**పీఎస్ఆర్ యువ నేస్తం పేరిట ఉచిత ఆన్‌లైన్ శిక్షణ ప్రారంభం**
**ఇప్పటివరకు లక్ష మందికి పైగా పేర్ల నమోదు-ఎంతమందికైనా శిక్షణ ఇస్తాం**
**ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ ఆధ్వర్యంలో యువతకు అండగా పీఎస్ఆర్ యువ నేస్తం**
**ఏడాది పాటు ఉచిత శిక్షణ.. అవసరమైతే గడువు పొడిగింపు**
**గతంలో 2,300 మందికి శిక్షణ.. 462 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు**
**రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ , సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 28:** రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ యువకులకు పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పీఎస్ఆర్ యువ నేస్తం పేరిట ఆన్‌లైన్‌లో ఎన్ని లక్షల మందికైనా ఉచిత శిక్షణ అందించనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ , సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. . ప్రతిష్ఠాత్మక ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఈరోజు నుంచి ఏడాది పాటు ఈ ఉచిత శిక్షణ ఉంటుందని అవసరమైతే ఈ శిక్షణా కాలాన్ని పొడిగిస్తామని తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన పుట్టినరోజు సందర్భంగా బుధవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

**నిరుద్యోగ యువతకు అండగా నిలవడమే లక్ష్యం**

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతీ యువకులకు నాణ్యమైన శిక్షణ అందించి, ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు అవసరమైన అవకాశాలను కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు.

గత 30 ఏళ్లుగా ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ ఎంతోమంది ప్రతిభావంతులను తీర్చిదిద్దిందని, ఐఏఎస్ వంటి ఉన్నతస్థాయి ఉద్యోగాలు సాధించేందుకు కూడా అభ్యర్థులకు మార్గనిర్దేశం చేసిందని తెలిపారు. ఈ సంస్థలో కరీం, కృష్ణారెడ్డి, మేముల సైదులు వంటి అనుభవజ్ఞులైన అధ్యాపకులు, ఫ్యాకల్టీ సభ్యులు ఈ శిక్షణ కార్యక్రమంలో భాగస్వాములుగా ఉండటం అభ్యర్థులకు ఎంతో ఉపయోగకరమని అన్నారు.

**గత అనుభవమే 'యువ నేస్తం'కు స్ఫూర్తి**

2013లో రాజకీయాల్లోకి ప్రవేశించి, 2014లో ఎంపీగా ఎన్నికైన అనంతరం 2016లో ఖమ్మం ప్రాంతంలో నిరుద్యోగ యువత కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మంత్రిగారు గుర్తుచేశారు. అప్పట్లో సుమారు 2,300 మంది నిరుద్యోగులకు ఆఫ్‌లైన్‌లో శిక్షణ అందించడంతో పాటు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించినట్లు చెప్పారు. ఆ శిక్షణ పొందిన వారిలో 462 మంది వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు సాధించారని వెల్లడించారు.

ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు తమ కృతజ్ఞతాభావాన్ని వ్యక్తం చేసిన సందర్భాలు తనను ఎంతగానో కదిలించాయని, వారి ఆనందాన్ని చూసి తన కళ్లలో నీళ్లు తిరిగాయని మంత్రి భావోద్వేగంగా పేర్కొన్నారు. ఆ అనుభవమే మరింతమంది నిరుద్యోగ యువతకు శిక్షణ అందించాలనే సంకల్పానికి ప్రేరణగా నిలిచిందన్నారు. గతంలో ఒక ప్రాంతానికి పరిమితమైన శిక్షణను ఇప్పుడు ఆన్‌లైన్ విధానం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు.

**ఇంటి వద్ద నుంచే నాణ్యమైన శిక్షణ**

ప్రస్తుత ఆన్‌లైన్ శిక్షణ విధానం వల్ల అభ్యర్థులు హైదరాబాద్‌కు రాకుండానే తమ ఇళ్ల వద్ద నుంచే శిక్షణ పొందవచ్చని మంత్రి తెలిపారు. దూర ప్రాంతాల్లో నివసించే యువతకు ప్రయాణ ఖర్చులు, వసతి తదితర ఇబ్బందులు లేకుండా ఈ విధానం ఉపయోగపడుతుందని చెప్పారు. నాణ్యమైన శిక్షణ అందరికీ అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.

ఒక్కో అభ్యర్థికి ఇలాంటి శిక్షణ అందించేందుకు సాధారణంగా కనీసం రూ.లక్ష వరకు ఖర్చవుతుందని, పుస్తకాలు, ఇతర శిక్షణా సామగ్రి కోసమే సుమారు రూ.14 వేల నుంచి రూ.30 వేల వరకు వ్యయం అవుతుందని మంత్రి పేర్కొన్నారు. ఈ ఖర్చులన్నింటినీ ట్రస్ట్ భరిస్తుందని, అభ్యర్థులకు శిక్షణతో పాటు అవసరమైన పుస్తకాలు, ఇతర సామగ్రిని ఉచితంగా అందిస్తామని స్పష్టం చేశారు.

**లక్ష మందికి పైగా నమోదు.. ఎంతమందికైనా శిక్షణ**

'పీఎస్ఆర్ యువ నేస్తం' కార్యక్రమంపై తొలుత కొందరు అనుమానాలు వ్యక్తం చేసినప్పటికీ, ఉచిత శిక్షణ నిజంగానే అందిస్తున్నట్లు తెలుసుకున్న తర్వాత పెద్ద సంఖ్యలో యువత పేర్లు నమోదు చేసుకుంటున్నారని మంత్రి తెలిపారు. ప్రకటన విడుదల చేసిన పది రోజుల్లోనే లక్ష మందికి పైగా అభ్యర్థులు పేర్లు నమోదు చేసుకోవడం ఈ కార్యక్రమంపై యువత చూపుతున్న ఆసక్తికి నిదర్శనమన్నారు.

ఈ కార్యక్రమానికి ఎలాంటి కటాఫ్ తేదీ విధించలేదని, లక్ష మందితోనే పరిమితం కాకుండా ఎంతమంది అభ్యర్థులు ముందుకొచ్చినా శిక్షణ అందించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది వరకు ఏడాది పాటు ఈ శిక్షణ కార్యక్రమం కొనసాగుతుందని, అవసరమైతే శిక్షణా కాలాన్ని మరింత పొడిగిస్తామని తెలిపారు. తెలంగాణలోని నిరుద్యోగ యువతీ యువకులందరికీ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

**త్వరలో మరో 15 వేల ఉద్యోగాల భర్తీ**

గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలో రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీకి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని మంత్రి గారు తెలిపారు. ఇప్పటికే రెండేళ్లలో 72 వేల ఉద్యోగాలను భర్తీ చేసినట్లు పేర్కొన్నారు. త్వరలో సుమారు మరో 15 వేల ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. రానున్న కాలంలో మరిన్ని ఉద్యోగాల భర్తీకి సంబంధించి నోటిఫికేషన్లు వెలువడనున్నాయని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులకు సరైన మార్గదర్శకత్వం, నాణ్యమైన శిక్షణ ఎంతో అవసరమని పేర్కొన్న మంత్రి.. ఆ దిశగా 'పీఎస్ఆర్ యువ నేస్తం' కార్యక్రమం ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆర్థిక పరిస్థితులు, శిక్షణ ఖర్చులు, దూరప్రాంతాల సమస్యలు యువత లక్ష్యసాధనకు అడ్డంకులు కాకూడదనే ఉద్దేశంతోనే ఉచిత ఆన్‌లైన్ శిక్షణకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో కృషి చేస్తున్న ప్రతి నిరుద్యోగ యువతీ యువకుడికి ఈ కార్యక్రమం ఒక అవకాశంగా నిలవాలని, యువత తమ ప్రతిభను నిరూపించుకొని ఉద్యోగాలు సాధించేలా ఈ వేదిక తోడ్పడాలని మంత్రి ఆకాంక్షించారు.

**దీపావళి లోగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలులి**

గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని ఈరోజు కలిసిన సందర్భంలో పాత్రికేయుల ఇళ్ల స్థలాల అంశం చర్చకు వచ్చిందని మంత్రి పొంగులేటి తెలిపారు. రానున్న దీపావళి లోగా జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి సమ్మతించారని తెలిపారు. దీనివలన దీర్ఘకాలిక సమస్య తీరుతుందన్నారు. దీనిపై పాత్రికేయుల స్పందిస్తూ మంత్రిగారి పుట్టినరోజున తమకు శుభవార్త వచ్చిందని హర్షం వ్యక్తం చేశారు.

# 'ఇండియాస్ మావోయిస్ట్స్' పుస్తకావిష్కరణ




**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 28:** ప్రముఖ అంతర్గత భద్రతా నిపుణులు డాక్టర్ పి.వి. రమణ రచించిన 'ఇండియాస్ మావోయిస్ట్స్: గ్లింప్సెస్ ఇన్‌టు రెడ్ ఇన్సర్జెన్సీ' పుస్తకావిష్కరణ సభ బుధవారం బంజారాహిల్స్‌లోని ఐసీసీసీ ఆడిటోరియంలో జరిగింది. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర భద్రతా సలహాదారు, పూర్వ డీజీపీ బి. శివధర్‌రెడ్డి, ఐపీఎస్(రిటైర్డ్) ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ ద్వారకా తిరుమలరావు, ఐపీఎస్(రిటైర్డ్), డీజీపీ (లా అండ్ ఆర్డర్) మహేష్ ఎం. భగవత్, ఐపీఎస్, డీజీపీ (ఆపరేషన్స్) అనిల్ కుమార్, ఐపీఎస్, హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్, ఐపీఎస్, తెలంగాణ టుడే ఎడిటర్ శ్రీ కె. శ్రీనివాస్‌రెడ్డి, పుస్తక రచయిత డాక్టర్ పి.వి. రమణ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా బి. శివధర్‌రెడ్డి మాట్లాడుతూ.. అన్ని ప్రభుత్వ విభాగాలు, పోలీసు బలగాల సమిష్టి కృషితోనే నక్సలిజం ప్రభావం తగ్గిందన్నారు. రాజ్యాంగ హక్కులు, సామాజిక న్యాయాన్ని చాటిచెప్పే అంబేద్కరిజం భావజాలం ప్రజల్లో విస్తృత చైతన్యాన్ని తెచ్చిందని, ఇది మావోయిస్టుల ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టిందని చెప్పారు. ప్రజాస్వామ్య విలువలు, సమ్మిళిత పాలన వైపు ప్రజలు మొగ్గు చూపడం వల్లే ప్రాంతాలు శాంతి, స్థిరమైన అభివృద్ధి దిశగా సాగాయని స్పష్టం చేశారు.

ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ ద్వారకా తిరుమలరావు 'భవిష్యత్ సవాళ్లు' అంశంపై మాట్లాడుతూ.. శాశ్వత శాంతి కోసం నిరంతర నిఘాతో పాటు అభివృద్ధికి పెద్దపీట వేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర బలగాల ఉపసంహరణ ఆచితూచి జరగాలని, కీలక అటవీ ప్రాంతాల్లో ఫార్వర్డ్ ఆపరేటింగ్ బేస్‌లను (ఎఫ్‌వోబీ) కొనసాగించాలని సూచించారు. గతంలో దోపిడీకి గురైన ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకోవాలని, నగరాల్లోని మావోయిస్టుల రహస్య నెట్‌వర్క్‌లను, అక్రమ నిధులను కట్టడి చేయాలని చెప్పారు. గతంలో నక్సల్స్ ప్రభావం ఉన్న 196 జిల్లాల్లో ఏ ఒక్క ప్రాంతం కూడా మళ్లీ తీవ్రవాదం వైపు వెళ్లకుండా అభివృద్ధి, ఉపాధి పనులను వేగవంతం చేయాలన్నారు.

రచయిత డాక్టర్ పి.వి. రమణ మాట్లాడుతూ.. మావోయిస్టు పార్టీ నిర్మాణం, ప్రజా సంఘాలు, అర్బన్ నెట్‌వర్క్‌లు, మహిళా కేడర్, ఈశాన్య రాష్ట్రాలతో సంబంధాలపై సమగ్ర పరిశోధనతో ఈ గ్రంథాన్ని తెచ్చినట్లు తెలిపారు. కేంద్ర హోంశాఖ గుర్తించిన 196 జిల్లాల సమగ్ర వివరాలను జీఐఎస్ మ్యాపులతో సహా పొందుపరిచామన్నారు. అడవులు, నగరాల్లో దాచిన కోట్ల రూపాయల నగదు, వందల సంఖ్యలోని బంగారు బిస్కెట్ల డంపుల వివరాలను, ప్రధాన ఆయుధ దాడులు, విఫలమైన శాంతి చర్చలు, లొంగుబాటు విధానాల్లోని లోపాలను ఇందులో విశ్లేషించినట్లు చెప్పారు. 2004 నుంచి నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి, భద్రతాధికారులు, పరిశోధకులు, లొంగిపోయిన కేడర్‌ను ఇంటర్వ్యూ చేసి దీనిని రాశానని, 2025-2026 నాటి తాజా పరిస్థితులను కూడా గ్రంథంలో చేర్చినట్లు పేర్కొన్నారు. నక్సలిజం శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వాలు, పరిశ్రమలు, ఎన్జీవోలు, ప్రజలు, లొంగిపోయిన వారిని భాగస్వాములను చేస్తూ 'పీపీపీపీ' (ప్రజా భాగస్వామ్యం) విధానాన్ని అమలు చేయాలని గ్రంథంలో సిఫార్సు చేశారు. లొంగిపోయిన వారికి పీఎం ఆవాస్ యోజన కింద ఇళ్లు, భూమి, ఆర్థిక నిర్వహణలో శిక్షణ ఇవ్వాలని, వారిపై ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) నేతృత్వంలో ఉన్నత స్థాయి కమిటీ ప్రతి మూడు నెలలకోసారి సమీక్షించాలని పేర్కొన్నారు. స్థానిక రోడ్లు, కలప కాంట్రాక్టులను పెద్ద గుత్తేదారులకు కాకుండా స్థానిక గ్రామాల సంఘాలకే ఇవ్వాలని, మైనింగ్, ఇతర పనుల్లో స్థానిక ఇంజనీరింగ్ యువతకు, మూలవాసులకు ఉద్యోగాలు కల్పించాలని సూచించారు. కంపెనీల సీఎస్ఆర్, డీఎంఎఫ్ నిధులను ప్రభావిత ప్రాంతాల్లోని విద్య, తాగునీరు, ఆరోగ్యానికే వాడాలన్నారు. తీవ్రమైన సెరిబ్రల్ మలేరియా బాధితులకు 24 గంటల్లోగా అత్యవసర చికిత్స అందించేందుకు 'బైక్-అంబులెన్సులు' అందుబాటులోకి తేవాలని, ఏకలవ్య పాఠశాలలను విస్తరించాలని స్పష్టం చేశారు.

రచయిత డాక్టర్ పి.వి. రమణ జేఎన్‌యూ నుంచి పీహెచ్‌డీ పూర్తి చేసి, ప్రస్తుతం వీఐఎఫ్‌లో పరిశోధకుడిగా పనిచేస్తున్నారు. గతంలో కేంద్ర హోంశాఖ ప్రాజెక్టుల్లో, జాతీయ పోలీస్ మిషన్ సబ్-గ్రూప్‌లో సేవలందించారు. పెంటగాన్, వుడ్రో విల్సన్ సెంటర్‌లలో పరిశోధనా పత్రాలు సమర్పించిన ఆయన, 'అండర్‌స్టాండింగ్ ఇండియాస్ మావోయిస్ట్స్', 'ది నక్సల్ ఛాలెంజ్' తదితర పుస్తకాలను వెలువరించారు.

# కోల్‌కతా పోర్టులో భారీగా ఈ--సిగరెట్లు పట్టివేత

**రెండు కంటైనర్లలో సుమారు 55 వేల ఈ--సిగరెట్లను స్వాధీనం చేసుకున్న డీఆర్ఐ**
**రూ.13.50 కోట్ల విలువ.. గ్లాసులు, సిరామిక్ మగ్గుల పేరిట అక్రమ రవాణా**




**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబరు 28:** అక్రమంగా తరలిస్తున్న సుమారు 55 వేల ఈ--సిగరెట్లను రెవెన్యూ ఇంటెలిజెన్స్ డైరెక్టరేట్ (డీఆర్ఐ) అధికారులు పట్టుకున్నారు. కోల్‌కతాలోని శ్యామా ప్రసాద్ ముఖర్జీ పోర్టులో అక్టోబరు 24న రెండు వేర్వేరు తనిఖీల్లో వీటిని గుర్తించారు. స్వాధీనం చేసుకున్న ఈ--సిగరెట్ల విలువ సుమారు రూ.13.50 కోట్లు ఉంటుందని డీఆర్ఐ వెల్లడించింది.

నిర్దిష్ట నిఘా సమాచారం ఆధారంగా నేపాల్‌కు ట్రాన్స్‌షిప్‌మెంట్ సరుకుగా వెళ్తున్న రెండు కంటైనర్లను అధికారులు అడ్డుకుని తనిఖీ చేశారు. ఒక కంటైనర్‌లో సరుకును 'నీటి గ్లాసులు'గా, మరో కంటైనర్‌లో 'సిరామిక్ మగ్గులు'గా పత్రాల్లో పేర్కొన్నట్లు గుర్తించారు. ప్రకటించిన సరుకు మధ్య ఈ--సిగరెట్లను దాచిపెట్టి తరలిస్తున్నట్లు తనిఖీల్లో బయటపడింది.

మొదటి కంటైనర్‌లో 40 వేల ఈ--సిగరెట్లు

మొదటి కంటైనర్‌ను క్షుణ్ణంగా పరిశీలించగా వివిధ ఫ్లేవర్లకు చెందిన ఐజెట్ బ్రాండ్ ఈ--సిగరెట్లు 40 వేల వరకు లభించాయి. రెండో కంటైనర్‌లో వీటీవీ, వోకో, బ్యాంగ్, ఈజాయ్ తదితర బ్రాండ్లకు చెందిన సుమారు 15 వేల ఈ--సిగరెట్లను గుర్తించారు.

మొత్తం సుమారు 55 వేల ఈ--సిగరెట్లతోపాటు వాటిని దాచేందుకు ఉపయోగించిన ఇతర సరుకును కూడా కస్టమ్స్ చట్టంలోని సంబంధిత నిబంధనల కింద స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.120 కోట్లకు పైగా పట్టివేతలు

ప్రస్తుత 2026--27 ఆర్థిక సంవత్సరంలో మహారాష్ట్ర, గుజరాత్, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్‌లోని వివిధ నౌకాశ్రయాలు, విమానాశ్రయాలు, ఇన్‌ల్యాండ్ కంటైనర్ డిపోల్లో ఇప్పటివరకు సుమారు 3 లక్షల ఈ--సిగరెట్లను స్వాధీనం చేసుకున్నట్లు డీఆర్ఐ వెల్లడించింది. వీటి విలువ రూ.120 కోట్లకు పైగా ఉంటుందని తెలిపింది.

ప్రజారోగ్య పరిరక్షణ కోసం తీసుకొచ్చిన ఎలక్ట్రానిక్ సిగరెట్ల నిషేధ చట్టం--2019 ప్రకారం ఈ--సిగరెట్లు, ఎలక్ట్రానిక్ నికోటిన్ డెలివరీ వ్యవస్థలకు సంబంధించిన ఉత్పత్తి, తయారీ, దిగుమతి, ఎగుమతి, రవాణా, విక్రయం, పంపిణీ, నిల్వ, ప్రకటనలను దేశంలో నిషేధించినట్లు డీఆర్ఐ తన ప్రకటనలో పేర్కొంది.

# తవాంగ్‌లో రేపటి నుంచి అంతర్జాతీయ టూరిజం మార్ట్

**అక్టోబరు 29 నుంచి 31 వరకు 14వ విడత పర్యాటక సమ్మేళనం**
**ఈశాన్య భారత పర్యాటక వైభవాన్ని చాటేలా ఏర్పాట్లు**
**22 దేశాల నుంచి 43 మంది అంతర్జాతీయ కొనుగోలుదారుల రాకకు అవకాశం**




**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబరు 28:** ఈశాన్య భారత పర్యాటక సామర్థ్యాన్ని దేశ, విదేశాలకు పరిచయం చేసేందుకు అరుణాచల్‌ప్రదేశ్‌లోని తవాంగ్ వేదిక కానుంది. కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అక్టోబరు 29 నుంచి 31 వరకు 14వ అంతర్జాతీయ టూరిజం మార్ట్ నిర్వహించనున్నారు. అరుణాచల్‌ప్రదేశ్ ప్రభుత్వం, ఇతర ఈశాన్య రాష్ట్రాల సహకారంతో తవాంగ్‌లోని హోటల్ వివాంతాలో మూడు రోజులపాటు ఈ కార్యక్రమం జరగనుంది. దేశీయ, అంతర్జాతీయ పర్యాటక రంగ భాగస్వాముల మధ్య వ్యాపార సంబంధాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

అక్టోబరు 29న జరిగే ప్రారంభ కార్యక్రమానికి కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, కేంద్ర పర్యాటక, పెట్రోలియం, సహజవాయువు శాఖల సహాయ మంత్రి సురేశ్ గోపీ, అరుణాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండూ హాజరుకానున్నారు. ఈ సందర్భంగా 'నార్త్ ఈస్ట్ బజార్'ను ప్రారంభించనున్నారు. ఈశాన్య రాష్ట్రాల సంప్రదాయాలను ప్రతిబింబించే సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించనున్నారు.

200 మందికిపైగా ప్రతినిధుల భాగస్వామ్యం

ఈ సమ్మేళనంలో దేశీయ, అంతర్జాతీయ కొనుగోలుదారులు, పర్యాటక సేవల విక్రేతలు సహా 200 మందికిపైగా పాల్గొనే అవకాశం ఉంది. మొత్తం 22 దేశాలకు చెందిన 43 మంది అంతర్జాతీయ కొనుగోలుదారులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. ఆస్ట్రేలియా, భూటాన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇండోనేసియా, ఇటలీ, జపాన్, మలేసియా, ఫిలిప్పీన్స్, పోలాండ్, రష్యా, సింగపూర్, దక్షిణ కొరియా, శ్రీలంక, థాయ్‌లాండ్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, బ్రిటన్, అమెరికా తదితర దేశాల ప్రతినిధులు పాల్గొననున్నారు.

వీరితోపాటు దేశీయ కొనుగోలుదారులు, ఎనిమిది ఈశాన్య రాష్ట్రాల పర్యాటక సేవల సంస్థలు, టూర్ ఆపరేటర్లు, వ్యాపారులు పాల్గొననున్నారు. పరస్పర వ్యాపార సంప్రదింపులు, కొత్త భాగస్వామ్యాలకు ఈ కార్యక్రమం వేదిక కానుంది.

ఎనిమిది రాష్ట్రాల ప్రత్యేకతల ప్రదర్శన

అరుణాచల్‌ప్రదేశ్, అసోం, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర రాష్ట్రాలు తమ పర్యాటక ప్రాంతాలు, ప్రత్యేక అనుభవాలు, సేవలను ప్రజెంటేషన్ల ద్వారా పరిచయం చేయనున్నాయి. ఆయా రాష్ట్రాల ప్రత్యేక ఆకర్షణలతోపాటు పలు రాష్ట్రాలను కలిపే పర్యాటక సర్క్యూట్లు, సమగ్ర పర్యాటక ప్యాకేజీలను ప్రదర్శించనున్నాయి.

ఈశాన్య ప్రాంతాన్ని దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా ప్రోత్సహించేందుకు కేంద్ర పర్యాటక శాఖ ఏటా అంతర్జాతీయ టూరిజం మార్ట్ నిర్వహిస్తోంది. ప్రకృతి అందాలు, సాంస్కృతిక వారసత్వం, సాహస పర్యాటక అవకాశాలను విస్తృతంగా పరిచయం చేస్తూ పర్యాటక వ్యాపారులు, ప్రభుత్వ సంస్థలు, మీడియా, ఇతర భాగస్వాములను ఒకే వేదికపైకి తీసుకువస్తోంది.

అక్టోబరు 30న బీటూబీ సమావేశాలు

దేశీయ, అంతర్జాతీయ కొనుగోలుదారులు, ఈశాన్య ప్రాంత పర్యాటక సేవల సంస్థల మధ్య అక్టోబరు 30న బిజినెస్ టు బిజినెస్ (బీటూబీ) సమావేశాలు నిర్వహించనున్నారు. వ్యాపార భాగస్వామ్యాల ఏర్పాటు, కొత్త పర్యాటక ప్యాకేజీల అభివృద్ధి, స్థానిక పర్యాటక వ్యాపారులకు విస్తృత మార్కెట్ అవకాశాలు కల్పించడంపై ఈ సమావేశాలు దృష్టి సారించనున్నాయి.

పర్యాటక అభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలపై సాంకేతిక సదస్సులు కూడా జరగనున్నాయి. ఈశాన్య ప్రాంతంలో ప్రత్యక్ష వినోద కార్యక్రమాలు, సంగీత కచేరీల ఆధారిత ఆర్థిక కార్యకలాపాల అభివృద్ధిపై కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నేతృత్వంలో చర్చించనున్నారు. రక్షిత, నియంత్రిత ప్రాంతాల్లో పర్యాటకుల ప్రవేశాన్ని సులభతరం చేసే అంశంపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో చర్చలు జరగనున్నాయి.

'గమ్యస్థానాలకు అతీతంగా.. ఈశాన్య భారతంలో మమేకమయ్యే పర్యాటక అనుభవాలు' అంశంపై రాయల్ ఎన్‌ఫీల్డ్ ప్రజెంటేషన్ ఇవ్వనుంది. అనుభవాధారిత పర్యాటకాన్ని విస్తరించే అవకాశాలను ఇందులో వివరించనున్నారు.

నార్త్ ఈస్ట్ బజార్‌లో కళలు.. హస్తకళలు

సమ్మేళనంలో ఏర్పాటు చేసే నార్త్ ఈస్ట్ బజార్‌లో ఈశాన్య రాష్ట్రాల సంప్రదాయ కళలు, హస్తకళలు, వస్త్ర ఉత్పత్తులు, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రదర్శించనున్నారు. ఎనిమిది రాష్ట్రాల ప్రత్యేక వంటకాలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రతినిధులకు ఆయా ప్రాంతాల జీవనశైలి, ఆహార వైవిధ్యాన్ని పరిచయం చేయనున్నారు.

తవాంగ్ పర్యాటక ప్రాంతాలకు సందర్శనలు

ప్రతినిధుల కోసం తవాంగ్ పరిసర ప్రాంతాల్లో అధ్యయన సందర్శనలు ఏర్పాటు చేశారు. తవాంగ్ మఠం, జశ్వంత్‌గఢ్ యుద్ధ స్మారకం, జాంగ్ జలపాతం, తవాంగ్ యుద్ధ స్మారకం, ఆరో దలైలామా జన్మస్థలమైన ఉర్గెల్లింగ్ గొంపా, బుద్ధ పార్క్, పాన్‌కాంగ్ టెంగ్ సో (పీటీఎస్ఓ) సరస్సు, షెర్నుప్ గ్రామాలను సందర్శించేలా ప్రణాళిక రూపొందించారు.

ఈ పర్యటనల ద్వారా ప్రాంతీయ ఆధ్యాత్మిక వారసత్వం, ప్రకృతి దృశ్యాలు, స్థానిక సంప్రదాయాలు, గ్రామీణ పర్యాటక అనుభవాలను ప్రతినిధులు ప్రత్యక్షంగా తెలుసుకోనున్నారు. అంతర్జాతీయ ప్రతినిధుల కోసం నవంబరు 1 నుంచి గువాహటి కేంద్రంగా పరిచయ పర్యటనలు ప్రారంభం కానున్నాయి.

ఈశాన్య పర్యాటక మంత్రుల ప్రాంతీయ సమావేశం

టూరిజం మార్ట్ సందర్భంగా అక్టోబరు 30న ఈశాన్య రాష్ట్రాల పర్యాటక మంత్రుల ప్రాంతీయ సమావేశం నిర్వహించనున్నారు. కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ఈశాన్య ప్రాంత పర్యాటక అభివృద్ధి, రాష్ట్రాల మధ్య సహకారాన్ని పెంపొందించే అంశాలపై చర్చించనున్నారు.

అంతర్జాతీయ టూరిజం మార్ట్‌కు తవాంగ్ 13 ఏళ్ల తర్వాత మరోసారి ఆతిథ్యం ఇస్తోంది. గతంలో 2013లో రెండో విడత సమ్మేళనం ఇక్కడ జరిగింది. గత ఏడాది నవంబరులో 13వ అంతర్జాతీయ టూరిజం మార్ట్‌ను సిక్కింలోని గ్యాంగ్‌టక్‌లో నిర్వహించారు.

# పరిశోధనలు ప్రజలకు ఉపయోగపడాలి: ప్రధాని మోదీ

**మూడేళ్లలో కొలవగల, విస్తరించగల సాంకేతిక ఫలితాలు సాధించాలని పిలుపు**

**ఢిల్లీలో ఎస్టిక్--2026 ప్రారంభం.. 5 వేల మందికిపైగా అంతర్జాతీయ ప్రతినిధుల హాజరు**




**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబరు 28:** శాస్త్రీయ పరిశోధనలు ప్రయోగశాలలకే పరిమితం కాకుండా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. శాస్త్రవేత్తలు, పరిశోధకులు, యువ ఆవిష్కర్తలు రానున్న మూడేళ్లలో స్పష్టమైన, కొలవగల, విస్తృత స్థాయిలో అమలు చేయగల సాంకేతిక ఫలితాలను సాధించాలని సూచించారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో అక్టోబరు 27న ఎమర్జింగ్ సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ కాన్‌క్లేవ్--2026 (ఎస్టిక్)ను ఆయన ప్రారంభించారు. శాస్త్రీయ ఆవిష్కరణలు వాస్తవ సమస్యలకు పరిష్కారాలు చూపడంతోపాటు ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని బలోపేతం చేయాలని ప్రధాని పేర్కొన్నారు. మానవ సంక్షేమానికి దోహదపడే సాంకేతికతల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కృత్రిమ మేధ, క్వాంటం సాంకేతికతలు, అధునాతన పదార్థాలు, బయోటెక్నాలజీ వంటి రంగాల్లో భారత్ ప్రపంచ ప్రమాణాలను నిర్దేశించే స్థాయికి చేరుకోవాలన్న సంకల్పాన్ని పునరుద్ఘాటించారు. ఈ సదస్సు తొలి రోజు కార్యక్రమాల్లో ప్రపంచవ్యాప్తంగా 5 వేల మందికిపైగా ప్రతినిధులు పాల్గొన్నారు. శాస్త్రవేత్తలు, విధాన రూపకర్తలు, పారిశ్రామిక ప్రతినిధులు, డీప్‌టెక్ స్టార్టప్‌ల వ్యవస్థాపకులు హాజరయ్యారు. నోబెల్ పురస్కార గ్రహీతల ప్రసంగాలు, మూడు సమాంతర సాంకేతిక సదస్సులు, స్టార్టప్ ప్రదర్శన, పరిశోధనా పోస్టర్ల ప్రదర్శన, సాయంత్రం ప్రత్యేక చర్చ నిర్వహించారు. మౌలిక పరిశోధనలను పారిశ్రామిక ఉత్పత్తి, ప్రజా ప్రయోజనాలతో అనుసంధానించడంపై ప్రధానంగా దృష్టి సారించారు. సాంకేతిక వినియోగదారు నుంచి సహసృష్టికర్తగా భారత్ శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారత్ సాంకేతికతలను వినియోగించుకునే దేశం నుంచి అత్యాధునిక పరిష్కారాల రూపకల్పనలో ప్రపంచంతో కలిసి పనిచేసే సహసృష్టికర్తగా ఎదుగుతోందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక, భూ విజ్ఞాన శాఖల సహాయ మంత్రి (స్వతంత్ర హోదా) డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. దేశంలో 2014లో సుమారు 400గా ఉన్న స్టార్టప్‌ల సంఖ్య ప్రస్తుతం 2.3 లక్షలకు పైగా పెరిగిందని తెలిపారు. వీటిలో దాదాపు 50 నుంచి 60 శాతం ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో ఉన్నాయని పేర్కొన్నారు. సాంకేతిక పారిశ్రామికత దేశవ్యాప్తంగా విస్తరిస్తోందనడానికి ఇది నిదర్శనమన్నారు. భారత్‌లోని జన్యు వైవిధ్యం, జీవుల లక్షణాల్లోని వైవిధ్యం బయోటెక్నాలజీ అభివృద్ధికి విలువైన వనరులని జితేంద్ర సింగ్ వివరించారు. జన్యు సంశ్లేషణ, సిస్టమ్స్ బయాలజీ, న్యూక్లియర్ మెడిసిన్ రంగాల్లో దేశీయ సామర్థ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ రంగాల్లో పరిశోధనలను వేగవంతం చేసే సందర్భంలో 'శాంతి చట్టం' సహా ఇటీవలి శాసన సంస్కరణలను ప్రస్తావించారు. స్వదేశీ పరిశోధనలకు బలం చేకూర్చి, వాటిని ఉపయోగకరమైన అనువర్తనాలుగా మార్చాల్సిన అవసరాన్ని వివరించారు. పరిశోధన--పరిశ్రమ--విధానాల మధ్య సమన్వయంమౌలిక శాస్త్రీయ పరిశోధనలు, పారిశ్రామిక స్థాయి ఉత్పత్తి, నియంత్రణ విధానాల మధ్య మరింత సమన్వయం అవసరమని కేంద్ర ప్రభుత్వ ప్రధాన శాస్త్రీయ సలహాదారు ప్రొఫెసర్ అజయ్ కె. సూద్ అన్నారు. ఎస్టిక్‌లోని 12 ప్రధాన ప్రాధాన్య రంగాలను వివరించారు. క్వాంటం కమ్యూనికేషన్, జనరేటివ్, స్వయంప్రతిపత్తి కృత్రిమ మేధ, సెమీకండక్టర్ తయారీ, అధునాతన తయారీ విధానాలు, డీప్ ఓషన్ మిషన్ వంటి రంగాలను ప్రస్తావించారు. దేశానికి స్వతంత్ర సాంకేతిక సామర్థ్యాలను సమకూర్చేందుకు పరిశోధనా సంస్థలు, పరిశ్రమలు, విధాన వ్యవస్థలు కలిసి పనిచేయాలని సూచించారు. ఔషధ రూపకల్పనలో క్రయో--ఈఎం పాత్రకొలంబియా విశ్వవిద్యాలయానికి చెందిన 2017 రసాయన శాస్త్ర నోబెల్ పురస్కార గ్రహీత ప్రొఫెసర్ జోకిమ్ ఫ్రాంక్ ప్రత్యేక ప్రసంగం చేశారు. ఔషధ పరిశోధనలో జీవసంబంధ లక్ష్యాల గుర్తింపు, ఔషధాల రూపకల్పనకు క్రయో--ఎలక్ట్రాన్ మైక్రోస్కోపీ (క్రయో--ఈఎం) ఎలా ఉపయోగపడుతుందో వివరించారు. అధిక స్పష్టతతో జీవ అణు సముదాయాల త్రిమితీయ నిర్మాణాలను తెలుసుకునేందుకు వినియోగించే గణన, గణిత పద్ధతులను పరిచయం చేశారు. ఈ నిర్మాణ సమాచారం ఆధారంగా ఔషధాల రూపకల్పనను మరింత పద్ధతిగా ముందుకు తీసుకెళ్లవచ్చని వివరించారు. 1993 వైద్యశాస్త్ర నోబెల్ పురస్కార గ్రహీత సర్ రిచర్డ్ జె. రాబర్ట్స్ 'స్ప్లిట్ జీన్స్, జీవశాస్త్రంలో నూతన అవకాశాలు' అంశంపై ప్రసంగించారు. జీన్ స్ప్లైసింగ్ ప్రక్రియ, సూక్ష్మజీవుల జన్యు అధ్యయనం, రిస్ట్రిక్షన్--మాడిఫికేషన్ ఎంజైమ్‌లపై వివరించారు. సుస్థిర వ్యవసాయం, ప్రజారోగ్యం, వ్యాధి నిర్ధారణకు ఉపయోగపడే బయోటెక్నాలజీ పరిశోధనలను ప్రస్తావించారు.

స్టార్టప్ ఆవిష్కరణలకు వేదిక

స్టార్టప్ ప్రదర్శన, పరిశోధనా పోస్టర్ల విభాగాన్ని డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రారంభించారు. డీప్‌టెక్ పరిశోధనలు, అభివృద్ధి నమూనాలు, స్టార్టప్‌లు రూపొందించిన ప్రాథమిక ఉత్పత్తులు ప్రదర్శించారు. పరిశ్రమల ప్రతినిధులు, పెట్టుబడిదారులు, విద్యాసంస్థల పరిశోధకులు, విధాన రూపకర్తలు పరస్పరం చర్చించేందుకు ఈ ప్రదర్శన వేదికగా నిలిచింది.

అధునాతన తయారీపై ప్రత్యేక చర్చ

సీఎస్ఐఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎన్. కలైసెల్వి అధ్యక్షతన అధునాతన తయారీ రంగంపై సదస్సు నిర్వహించారు. డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ డాక్టర్ జి. సతీష్ రెడ్డి కీలకోపన్యాసం చేశారు. రజత్ వర్మ, ఛాయా నంజప్ప, డాక్టర్ ఎన్.సి. ముర్ము, డాక్టర్ సి. ఆనందరామకృష్ణన్, డాక్టర్ నాగహనుమయ్య వక్తలుగా పాల్గొన్నారు.

డిజిటల్ ట్విన్స్, మనుషులతో కలిసి పనిచేసే రోబోలు, అడిటివ్ మాన్యుఫాక్చరింగ్, కొలతల శాస్త్రం వంటి అంశాలపై చర్చించారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల సరఫరా వ్యవస్థలను బలోపేతం చేయడం, పరిశోధనలను పారిశ్రామిక ఉత్పత్తితో అనుసంధానించడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు.

స్వదేశీ ఏఐ నమూనాలు.. సురక్షిత వినియోగం

ఇండియాఏఐ ముఖ్య కార్యనిర్వహణాధికారి సౌరభ్ విజయ్ అధ్యక్షతన జనరేటివ్, స్వయంప్రతిపత్తి కృత్రిమ మేధపై సదస్సు జరిగింది. ఐఐటీ మద్రాస్‌కు చెందిన ప్రొఫెసర్ మితేష్ ఎం. ఖప్రా కీలక ప్రసంగం చేశారు. ప్రొఫెసర్ చేతన్ అరోరా, డాక్టర్ అల్పన్ రావల్, ప్రొఫెసర్ బలరామన్ రవీంద్రన్, కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ కార్యదర్శి ఎస్. కృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

దేశీయ భారీ భాషా నమూనాల అభివృద్ధి, ఇండియాఏఐ ద్వారా అధిక సామర్థ్య కంప్యూటింగ్ వనరుల అందుబాటు, స్వయంగా పనులు నిర్వహించే ఏజెంటిక్ ఏఐ వ్యవస్థలపై చర్చించారు. కృత్రిమ మేధను సురక్షితంగా, బాధ్యతాయుతంగా అమలు చేసేందుకు అవసరమైన విధానాలను పరిశీలించారు.

ఆరోగ్యం, వ్యవసాయం, తయారీకి సింథటిక్ బయాలజీ

సిస్టమ్స్ అండ్ సింథటిక్ బయాలజీ సదస్సులో ఇంజినీరింగ్ పద్ధతులతో జీవ వ్యవస్థల రూపకల్పన, జాతీయ బయోఈ3 వ్యూహంపై చర్చించారు. 'అర్థం చేసుకోవడం--రూపకల్పన--నిర్మాణం--పరీక్షించడం--నేర్చుకోవడం' అనే చక్రాన్ని ప్రధాన విధానంగా వివరించారు.

నిర్దిష్ట లక్ష్యాలతో పనిచేసే జీవాధారిత చికిత్సలు, జీవక్రియ మార్గాల రూపకల్పన, పోషక విలువలు పెంచిన పంటలు, వ్యర్థాలను విలువైన ఉత్పత్తులుగా మార్చే జీవాధారిత తయారీ విధానాలపై దృష్టి సారించారు. ఆరోగ్యం, వ్యవసాయం, తయారీ రంగాల్లో సింథటిక్ బయాలజీ వినియోగ అవకాశాలను పరిశీలించారు.

ఆత్మనిర్భర్ భారత్‌కు శాస్త్ర సాంకేతిక బలం

సాయంత్రం 'ఆత్మనిర్భర్ భారత్ కోసం శాస్త్రం--పరివర్తనాత్మక సాంకేతికతలు' అంశంపై ప్రొఫెసర్ అజయ్ కె. సూద్ అధ్యక్షతన ప్రత్యేక చర్చ నిర్వహించారు. డాక్టర్ టెస్సీ థామస్, జనరల్ ఎన్.ఎస్. రాజా సుబ్రమణి, ప్రొఫెసర్ భాను పి. జెనా, డాక్టర్ సమీర్ శరణ్, ప్రొఫెసర్ వి.కె. సింగ్ ప్యానెల్ సభ్యులుగా పాల్గొన్నారు.

రక్షణ రంగంలో సాంకేతిక స్వావలంబన, మేధోసంపత్తిని వాణిజ్య వినియోగంలోకి తీసుకురావడం, డీప్‌టెక్ రంగానికి నిధులు, పరిశోధనా సంస్థల నుంచి పరిశ్రమలకు సాంకేతిక బదిలీపై చర్చించారు. పరిశోధనా ఫలితాలను వ్యూహాత్మక సామర్థ్యాలుగా, వాణిజ్య ఉత్పత్తులుగా మలిచేందుకు అవసరమైన మార్గాలను పరిశీలించారు.

ఎస్టిక్--2026లోని 12 ప్రాధాన్య రంగాల ద్వారా పరిశోధకులు, ప్రభుత్వం, పరిశ్రమలు, స్టార్టప్‌ల మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రారంభానికి ముందురోజు జరిగిన సమావేశాల్లో రూ.లక్ష కోట్ల పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణల నిధి, అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఏఎన్ఆర్ఎఫ్) వ్యవస్థల ద్వారా డీప్‌టెక్ పరిశోధనలను వివిధ సాంకేతిక సిద్ధత దశల నుంచి వాణిజ్య ఉత్పత్తుల స్థాయికి తీసుకెళ్లే అవకాశాలను చర్చించారు. శాస్త్ర సాంకేతిక పురోగతిని దేశాభివృద్ధి, విస్తృత మానవ సంక్షేమంతో అనుసంధానించడంపై సదస్సు దృష్టి సారించింది.

# పొగాకు రహిత భారతానికి యువత సారథ్యం వహించాలి

**టొబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్ 4.0ను ప్రారంభించిన కేంద్ర మంత్రి ప్రతాప్‌రావు జాధవ్**

**దేశవ్యాప్తంగా 60 రోజుల ప్రచారం.. విశ్వవిద్యాలయాలు, కళాశాలలపై ప్రత్యేక దృష్టి**

**గత మూడు విడతల్లో 5.8 లక్షలకు పైగా విద్యాసంస్థలు, 73 వేలకుపైగా గ్రామాలు పొగాకు రహితంగా ప్రకటన**



**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబరు 28:** పొగాకు వినియోగం, నికోటిన్ వ్యసనం నుంచి యువతను కాపాడేందుకు దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమం రావాలని కేంద్ర ఆయుష్ శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర హోదా), ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావు జాధవ్ పిలుపునిచ్చారు. ఆరోగ్యవంతమైన, బలమైన, అభివృద్ధి చెందిన భారత్ నిర్మాణానికి యువతను వ్యసనాలకు దూరంగా ఉంచడం అత్యవసరమని పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని అటల్ బిహారీ వాజ్‌పేయీ వైద్య విజ్ఞాన సంస్థ, డాక్టర్ రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రిలో బుధవారం 'టొబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్--4.0'ను ఆయన ప్రారంభించారు.

కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ చేపట్టిన ఈ ప్రచారం దేశవ్యాప్తంగా 60 రోజులపాటు కొనసాగనుంది. యువత పొగాకు వినియోగాన్ని ప్రారంభించకుండా నిరోధించడం, ఇప్పటికే వినియోగిస్తున్నవారు మానుకునేలా ప్రోత్సహించడం, పొగాకు నియంత్రణ చట్టాల అమలును బలోపేతం చేయడం, పొగాకు రహిత పరిసరాలను ప్రోత్సహించడం ప్రధాన లక్ష్యాలుగా నిర్ణయించారు. నాలుగో విడతలో విశ్వవిద్యాలయాలు, కళాశాలలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు.

యువత ఆరోగ్యమే దేశ భవిష్యత్తుకు పునాది

దేశ నిర్మాణంలో యువత పాత్ర కీలకమని ప్రతాప్‌రావు జాధవ్ అన్నారు. వారి శక్తి, ప్రతిభ, సృజనాత్మకత, పట్టుదల దేశ భవిష్యత్తును తీర్చిదిద్దుతాయని పేర్కొన్నారు. యువత పొగాకు, ఇతర వ్యసనకారక పదార్థాలను దృఢంగా తిరస్కరించి ఆరోగ్యకరమైన జీవితాన్ని ఎంచుకోవాలని సూచించారు.

యువతను వ్యసనాల నుంచి రక్షించడం ప్రజారోగ్య అవసరంతోపాటు జాతీయ బాధ్యత అని మంత్రి స్పష్టం చేశారు. విద్యాసంస్థలు, కుటుంబాలు, సమాజం, ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేసి యువత తమ సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకునే వాతావరణాన్ని కల్పించాలని కోరారు.

పొగాకు ప్రమాదాలపై అవగాహన పెరగాలి

పొగాకు వినియోగం వల్ల కలిగే తీవ్ర ఆరోగ్య పరిణామాలను మంత్రి వివరించారు. పొగాకు పొగలో 7 వేలకు పైగా రసాయనాలు ఉంటాయని, వాటిలో అనేక విషపూరిత, క్యాన్సర్ కారక పదార్థాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇవి శరీరంలోని వివిధ అవయవాలకు తీవ్ర హాని కలిగించగలవని హెచ్చరించారు. పొగతాగే వారితోపాటు పరోక్షంగా ఆ పొగను పీల్చే కుటుంబ సభ్యులు, పిల్లలు, ఇతరుల ఆరోగ్యానికీ ప్రమాదం ఏర్పడుతుందని తెలిపారు.

కౌమార దశలో నికోటిన్ వినియోగంపై ప్రత్యేక ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న వయసులో నికోటిన్‌కు గురికావడం మెదడు అభివృద్ధి, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, నేర్చుకునే సామర్థ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని వివరించారు. ఈ దశలో వ్యసనానికి లోనయ్యే అవకాశం ఎక్కువగా ఉన్నందున తొలినాళ్లలోనే నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.

ప్రభుత్వ కార్యక్రమం నుంచి ప్రజా ఉద్యమంగా

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం, కేంద్ర ఆరోగ్య మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా మార్గదర్శకత్వంలో పొగాకు దుష్ప్రభావాల నుంచి ప్రజలను, ముఖ్యంగా పిల్లలు, కౌమారదశలో ఉన్నవారిని రక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలను బలోపేతం చేస్తోందని జాధవ్ తెలిపారు. 2023 నుంచి ఏటా 60 రోజులపాటు పొగాకు రహిత యువత ప్రచారాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థలు, చట్టాల అమలు సంస్థలు, వైద్య నిపుణులు, స్థానిక సమాజాల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా విస్తరించిందన్నారు. ఇది ప్రభుత్వ కార్యక్రమం పరిధిని దాటి యువత నాయకత్వంలో ప్రజా ఉద్యమంగా మారాలని ఆకాంక్షించారు.

జాతీయ వయోజన పొగాకు సర్వే, ప్రపంచ యువత పొగాకు సర్వే ఫలితాలను ప్రస్తావిస్తూ, ముఖ్యంగా 13 నుంచి 15 ఏళ్ల వయసు వారిలో నిరంతర నివారణ చర్యలు అవసరమని పేర్కొన్నారు.

మూడు విడతల్లో విస్తరించిన ప్రచారం

ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని 2023 మే 31న తొలి విడత ప్రచారాన్ని ప్రారంభించారు. ఆ విడతలో 1,42,184కు పైగా విద్యాసంస్థలు, 12 వేల గ్రామాలను పొగాకు రహితంగా ప్రకటించారు. పొగాకు నియంత్రణ చట్టాల అమలులో భాగంగా రూ.కోటికి పైగా జరిమానాలు విధించారు.

2024 సెప్టెంబరులో ప్రారంభించిన రెండో విడతలో 1,67,762 విద్యాసంస్థలు, 27,534 గ్రామాలు పొగాకు రహిత హోదా సాధించాయి. అవగాహన కార్యక్రమాలు, తనిఖీలు, ప్రజల భాగస్వామ్యాన్ని విస్తరించడంతోపాటు రూ.1.1 కోట్లకు పైగా జరిమానాలు విధించారు.

2025 అక్టోబరులో ప్రారంభమైన మూడో విడతలో 2,57,807 విద్యాసంస్థలు, 33,850 గ్రామాలను పొగాకు రహితంగా ప్రకటించారు. ఈ విడతలో 58 వేలకు పైగా చట్ట అమలు తనిఖీ కార్యక్రమాలు నిర్వహించారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానాన్ని నిషేధించే సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తుల చట్టం--2003 (కోట్పా) సెక్షన్ 4 కింద 1,45,477 చలానాలు జారీ చేశారు. చట్టాల అమలు సిబ్బంది, పొగాకు మాన్పించే కౌన్సెలర్లకు కలిపి 60 వేల మందికిపైగా శిక్షణ ఇచ్చారు.

మొత్తంగా గత మూడు విడతల్లో 5.8 లక్షలకు పైగా విద్యాసంస్థలు, 73 వేలకుపైగా గ్రామాలను పొగాకు రహితంగా ప్రకటించినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో విద్యాసంస్థలు, స్థానిక యంత్రాంగం, ప్రజల భాగస్వామ్యం పెరుగుతోందనడానికి ఈ ఫలితాలు నిదర్శనమని పేర్కొన్నారు.

విశ్వవిద్యాలయాలు, కళాశాలలే ప్రధాన వేదికలు

నాలుగో విడత ప్రచారంలో ఉన్నత విద్యాసంస్థలను పొగాకు నివారణకు ప్రధాన కేంద్రాలుగా తీర్చిదిద్దనున్నారు. పొగాకు రహిత క్యాంపస్‌లను బలోపేతం చేయడం, పొగాకు, నికోటిన్ దుష్ప్రభావాలపై అవగాహన పెంచడం, విద్యార్థులు ఆరోగ్యపరంగా సరైన నిర్ణయాలు తీసుకునేలా ప్రోత్సహించడంపై దృష్టి సారించనున్నారు.

విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు, పొగాకు రహిత విద్యాసంస్థల మార్గదర్శకాల అమలు, సహచర విద్యార్థుల మధ్య చైతన్య కార్యక్రమాలను ప్రోత్సహించనున్నారు. విద్యార్థులు, అధ్యాపకులను పొగాకు నివారణ చర్యల్లో భాగస్వాములను చేయనున్నారు. విద్యార్థులు తమ క్యాంపస్‌లతోపాటు కుటుంబాలు, సమాజంలోనూ ఆరోగ్యకరమైన జీవనశైలికి ప్రచారకర్తలుగా నిలవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

'పొగాకుకు నో' అంటూ ప్రతిజ్ఞ

2026 ఆగస్టు 30న 'మన్ కీ బాత్'లో వ్యసన విముక్తిపై ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన సందేశాన్ని జాధవ్ గుర్తుచేశారు. యువతను వ్యసనాలకు దూరంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. పాఠశాలలు, కళాశాలలు, కుటుంబాలు, సమాజంలో యువత మార్పునకు సారథులుగా నిలవాలని పిలుపునిచ్చారు.

'పొగాకుకు నో' అనే సందేశాన్ని దేశంలోని ప్రతి ప్రాంతానికి తీసుకెళ్లాలని మంత్రి సూచించారు. కార్యక్రమం ముగింపులో పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేయించారు. పొగాకుకు దూరంగా ఉండటం, ఇతరులు మానుకునేలా ప్రోత్సహించడం, ఆరోగ్యకరమైన పొగాకు రహిత

# తూత్తుకుడి మెగా షిప్‌యార్డ్‌కు ముందడుగు

**సియోల్‌లో హెచ్‌డీ హ్యుందాయ్ చైర్మన్‌తో కేంద్ర మంత్రి సోనోవాల్ భేటీ**

**4 బిలియన్ డాలర్ల ప్రతిపాదిత పెట్టుబడి.. ఆరు నెలల్లో డీపీఆర్‌కు కసరత్తు**

**సాంకేతిక బదిలీ, స్థానిక తయారీ, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం**



న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబరు 28: తమిళనాడులోని తూత్తుకుడిలో ప్రతిపాదిత మెగా నౌకా నిర్మాణ కేంద్రం ఏర్పాటుకు కార్యాచరణ వేగం పుంజుకుంది. దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో హెచ్‌డీ హ్యుందాయ్ చైర్మన్ చుంగ్ కి-సున్‌తో కేంద్ర నౌకాశ్రయాలు, షిప్పింగ్, జలమార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ బుధవారం సమావేశమయ్యారు. సుమారు 4 బిలియన్ అమెరికన్ డాలర్ల పెట్టుబడితో ప్రతిపాదించిన ఈ గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్‌ను ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన చర్యలపై చర్చించారు.

ప్రాజెక్టు అభివృద్ధిని పర్యవేక్షించేందుకు ఉమ్మడి కార్యాచరణ బృందం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. జాయింట్ వెంచర్ నిర్మాణంపై ఇరుపక్షాలు కసరత్తు చేయనున్నాయి. సమగ్ర ప్రాజెక్టు నివేదికను (డీపీఆర్) ఆరు నెలల్లో ఖరారు చేయాలని భావిస్తున్నాయి. భారత్--దక్షిణ కొరియా మధ్య నౌకా నిర్మాణం, సముద్ర సంబంధ పరిశ్రమల్లో సహకారాన్ని విస్తరించే లక్ష్యంతో సోనోవాల్ చేపట్టిన నాలుగు రోజుల పర్యటనలో ఈ భేటీ జరిగింది.

ప్రధాన వ్యూహాత్మక పెట్టుబడిదారుగా హెచ్‌డీ కేఎస్ఓఈ ఆసక్తి

హెచ్‌డీ హ్యుందాయ్ నౌకా నిర్మాణ విభాగమైన హెచ్‌డీ కొరియా షిప్‌బిల్డింగ్ అండ్ ఆఫ్‌షోర్ ఇంజినీరింగ్ (హెచ్‌డీ కేఎస్ఓఈ) ఈ ప్రాజెక్టులో ప్రధాన వ్యూహాత్మక పెట్టుబడిదారుగా భాగస్వామ్యం కావాలన్న ఆసక్తిని పునరుద్ఘాటించింది. నేషనల్ షిప్‌బిల్డింగ్ అండ్ హెవీ ఇండస్ట్రీస్ పార్క్, తమిళనాడు లిమిటెడ్ (ఎన్‌షిప్--టీఎన్), హెచ్‌డీ కేఎస్ఓఈ సంస్థలు ప్రతిపాదిత షిప్‌యార్డ్‌ను ముందుకు తీసుకెళ్లేందుకు తమ ఉమ్మడి సంసిద్ధతను వ్యక్తం చేశాయి.

నౌకా నిర్మాణ కేంద్రం రూపకల్పన, నిర్మాణం, అధునాతన తయారీ, నిర్వహణలో తన అంతర్జాతీయ అనుభవాన్ని అందించేందుకు హెచ్‌డీ కేఎస్ఓఈ ఆసక్తి చూపింది. పెట్టుబడి నిర్మాణం, ఈక్విటీ వాటాలు, అమలు విధానాలను తదుపరి చర్చల్లో ఖరారు చేయనున్నారు. ఇవి సమగ్ర పరిశీలన, అవసరమైన అనుమతులకు లోబడి ఉంటాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సమన్వయం సహా ప్రాజెక్టు ఏర్పాటుకు అవసరమైన సహకారం అందిస్తామని ఎన్‌షిప్--టీఎన్ తెలిపింది.

ఏప్రిల్ ఒప్పందం ఆధారంగా కార్యాచరణ

దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యుంగ్ ఈ ఏడాది భారత్‌లో పర్యటించిన సందర్భంగా ఏప్రిల్‌లో ఆమోదించిన నౌకా నిర్మాణం, షిప్పింగ్, సముద్ర రవాణా లాజిస్టిక్స్ సమగ్ర భాగస్వామ్య కార్యాచరణకు అనుగుణంగా తాజా చర్చలు జరిగాయి. ఏప్రిల్ 20న హెచ్‌డీ కేఎస్ఓఈ, ఎన్‌షిప్--టీఎన్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం ఈ ప్రాజెక్టుకు పునాదిగా నిలుస్తోందని సోనోవాల్ పేర్కొన్నారు.

హెచ్‌డీ హ్యుందాయ్ ప్రపంచ భవిష్యత్ ప్రణాళికల్లో భారత్ కీలక స్తంభమని ప్రధాని నరేంద్ర మోదీ ముందు చుంగ్ కి-సున్ వ్యక్తం చేసిన దృక్పథాన్ని త్వరగా కార్యరూపంలోకి తీసుకురావడమే తన పర్యటన ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు. స్థల పరిశీలనతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ బృందాలతో సంస్థ ప్రతినిధులు నిరంతరం సమన్వయం చేస్తున్నారని ప్రశంసించారు. ప్రాజెక్టు అమలుకు భారత ప్రభుత్వం కల్పిస్తున్న అనుకూల పరిస్థితులపై హెచ్‌డీ కేఎస్ఓఈ సంతృప్తి వ్యక్తం చేసింది.

దేశంలోనే అతిపెద్ద వాణిజ్య షిప్‌యార్డ్‌గా అవకాశం

కేంద్ర ప్రభుత్వ నౌకా నిర్మాణ అభివృద్ధి పథకం కింద ప్రతిపాదించిన ఈ షిప్‌యార్డ్‌లో ఏటా సుమారు 25 లక్షల గ్రాస్ టన్నేజ్ (జీటీ) నౌకా నిర్మాణ సామర్థ్యాన్ని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ అంచనాను డీపీఆర్ ద్వారా నిర్ధారించాల్సి ఉంది. కార్యకలాపాలు ప్రారంభమైన తర్వాత ఇది దేశంలోనే అతిపెద్ద వాణిజ్య నౌకా నిర్మాణ కేంద్రంగా నిలిచే అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఈ ప్రాజెక్టు ద్వారా దేశీయ నౌకా నిర్మాణ సామర్థ్యం పెరగడంతోపాటు అంతర్జాతీయ సముద్ర పరిశ్రమలో భారత్ పోటీతత్వం బలోపేతం కానుంది. నౌకల రకాలు, ఉత్పత్తి సామర్థ్యం, మౌలిక వసతుల అవసరాలు, ప్రాజెక్టు వ్యయం, అమలు కాలపట్టిక వంటి అంశాలను డీపీఆర్‌లో పొందుపరచనున్నారు.

దేశీయంగా 400కు పైగా నౌకల అవసరం

భారత్‌లో దేశీయ నౌకల మార్కెట్ వేగంగా విస్తరిస్తోందని సోనోవాల్ తెలిపారు. రానున్న సంవత్సరాల్లో ప్రభుత్వ రంగ సంస్థలు, ఏజెన్సీలు 400కు పైగా నౌకలను సమకూర్చుకోవాలని చూస్తున్నాయని చెప్పారు. ఎగుమతి ఆర్డర్లతోపాటు ఈ దేశీయ అవసరాల్లో అనేక నౌకల నిర్మాణానికి తూత్తుకుడి షిప్‌యార్డ్ కీలకంగా మారగలదని అభిప్రాయపడ్డారు.

వ్యూహాత్మక భాగస్వామ్యాలు, సాంకేతిక సహకారం, స్థానిక తయారీ ద్వారా హెచ్‌డీ కేఎస్ఓఈ భారత్‌లో తన కార్యకలాపాలను విస్తరించాలని మంత్రి ఆకాంక్షించారు. ప్రపంచ నౌకా నిర్మాణ కేంద్రంగా భారత్ ఎదగడానికి ఈ భాగస్వామ్యం దోహదపడుతుందని పేర్కొన్నారు.

భూమి, మౌలిక వసతులపై సమన్వయం

ప్రాజెక్టుకు అనువైన సముద్రతీర భూమి అందుబాటు, మౌలిక వసతులు, విద్యుత్, నీరు వంటి అవసరాల కల్పనకు ఎన్‌షిప్--టీఎన్ సహకరించనుంది. వర్తించే చట్టాలు, నిబంధనల ప్రకారం అవసరమైన అనుమతులు సకాలంలో లభించేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేయనుంది.

ఇదే సమయంలో స్థల పరిశీలనలు, మౌలిక వసతుల ప్రణాళిక, ప్రాథమిక డ్రెడ్జింగ్, భూభాగ అభివృద్ధికి సంబంధించిన అధ్యయనాలను ముందుకు తీసుకెళ్లనున్నారు. ఇరుపక్షాల అధికారులతో కూడిన ఉమ్మడి కార్యాచరణ బృందం ఈ పనులను సమన్వయం చేస్తూ ప్రాజెక్టు పురోగతిని పర్యవేక్షించనుంది.

సాంకేతిక బదిలీతో నైపుణ్య ఉద్యోగాలు

మౌలిక వసతుల నిర్మాణంతోపాటు అంతర్జాతీయ స్థాయిలో పోటీపడగల నౌకా నిర్మాణ అనుబంధ వ్యవస్థను భారత్‌లో అభివృద్ధి చేయడంపై ఈ భాగస్వామ్యం దృష్టి సారిస్తోంది. సాంకేతిక బదిలీ, కార్మికుల నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

సాంకేతిక శిక్షణ, పరిజ్ఞాన మార్పిడి, భారతీయ పరిశ్రమలు, విద్యాసంస్థలతో సహకార అవకాశాలను పరిశీలించనున్నారు. తద్వారా స్వదేశీ నౌకా నిర్మాణ సామర్థ్యాలను పెంచడంతోపాటు నైపుణ్యంతో కూడిన ఉపాధి అవకాశాలను సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

దక్షిణ కొరియా అధునాతన సాంకేతిక నైపుణ్యానికి భారత్ ఆర్థిక శక్తి, విస్తృత మార్కెట్ తోడైతే ప్రపంచ సముద్ర పరిశ్రమలో గణనీయమైన మార్పులకు దారితీయగలదని సోనోవాల్ అన్నారు. తూత్తుకుడి షిప్‌యార్డ్‌ను కార్యరూపంలోకి తీసుకువచ్చేందుకు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. భారత్--దక్షిణ కొరియా ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యంలో ఈ ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మక కార్యక్రమంగా తీర్చిదిద్దాలని ఇరుపక్షాలు భావిస్తున్నాయి.

# భారత్--మెక్సికో ప్రాధాన్య వాణిజ్య ఒప్పందానికి చర్చలు ప్రారంభం

**చర్చల విధివిధానాల పత్రంపై ఇరుదేశాల సంతకాలు**
**ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడుల విస్తరణపై దృష్టి**
**2027 తొలి త్రైమాసికంలో భారత్‌కు మెక్సికో వ్యాపార బృందం పర్యటనపై పరిశీలన**

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబరు 28:**



ఆర్థిక, వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే దిశగా భారత్, మెక్సికో కీలక ముందడుగు వేశాయి. ప్రాధాన్య వాణిజ్య ఒప్పందం (పీటీఏ) కోసం చర్చలను ప్రారంభిస్తూ, వాటికి సంబంధించిన విధివిధానాల పత్రం 'టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్'పై ఇరుదేశాలు సంతకాలు చేశాయి. చర్చల పరిధి, విధానం, కార్యాచరణ ప్రణాళికను ఈ పత్రం నిర్దేశిస్తుంది.పరస్పర ప్రయోజనాలు, సమతుల్యతకు ప్రాధాన్యమిస్తూ ప్రతిపాదిత ఒప్పందంపై చర్చలు జరపనున్నారు. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని విస్తరించడం, వ్యాపార అవకాశాలు సృష్టించడం, పెట్టుబడుల ప్రవాహాన్ని పెంచడం, విభిన్నమైన, అంతరాయాలను తట్టుకోగల సరఫరా వ్యవస్థలను అభివృద్ధి చేయడం ఈ చర్చల లక్ష్యాలు.మోదీ--షెయిన్‌బామ్ అవగాహనకు కొనసాగింపుగా2025 జూన్‌లో కెనడాలో జరిగిన జీ--7 సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, మెక్సికో అధ్యక్షురాలు డాక్టర్ క్లాడియా షెయిన్‌బామ్ మధ్య జరిగిన సమావేశంలో ఇరుదేశాల భాగస్వామ్యాన్ని మరింత విస్తరించాలని అంగీకరించారు. ఆ అవగాహనకు కొనసాగింపుగా తాజా చర్చల ప్రక్రియ ప్రారంభమైంది.భారత వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ మెక్సికో పర్యటన సందర్భంగా ఇరుదేశాల ప్రతినిధి బృందాలు ద్వైపాక్షిక సంబంధాలు, వాణిజ్యం, పెట్టుబడులను విస్తరించే అవకాశాలపై చర్చించాయి. మెక్సికో ఆర్థిక శాఖ కార్యదర్శి మార్సెలో ఎబ్రార్డ్ కాసౌబోన్ తరపున ఆ దేశ విదేశీ వాణిజ్య ఉప కార్యదర్శి లూయిస్ రోసెండో గుటియెరెజ్ రొమానో చర్చల్లో పాల్గొన్నారు.మార్కెట్ ప్రవేశం నుంచి వివాద పరిష్కారం వరకుప్రాధాన్య వాణిజ్య ఒప్పంద చర్చల్లో వస్తువులకు మార్కెట్ ప్రవేశం, వస్తువుల మూలదేశ నిర్ధారణ నిబంధనలు, కస్టమ్స్ ప్రక్రియలు, వాణిజ్య సులభతరం వంటి అంశాలను చేర్చారు. వివాద పరిష్కారం, మానవ, జంతు, వృక్ష ఆరోగ్య రక్షణ చర్యలు, వాణిజ్యంలో సాంకేతిక అవరోధాలు, అన్యాయ వాణిజ్య పద్ధతుల నుంచి దేశీయ పరిశ్రమలను రక్షించే చర్యలపైనా చర్చించనున్నారు.ఇరుదేశాల ఆర్థిక వ్యవస్థల్లో పరస్పరం అనుకూలంగా ఉన్న రంగాలను ఉపయోగించుకుని వాణిజ్య అవకాశాలను విస్తరించాలని భావిస్తున్నారు. భారత మార్కెట్‌లో మెక్సికో ఉత్పత్తులు, వ్యాపార సంస్థలకు అవకాశాలు పెంచడంతోపాటు భారత ఎగుమతిదారులు, పెట్టుబడిదారులకు మెక్సికోలో అవకాశాలను విస్తరించడంపై దృష్టి సారించారు. ప్రపంచ విలువ గొలుసులతో బలమైన అనుసంధానం కలిగిన మెక్సికోను భారత వ్యాపారాలకు ముఖ్యమైన మార్కెట్‌గా గుర్తించారు.వాహనాలు, ఔషధాలు, కీలక ఖనిజాల్లో అవకాశాలువాహన పరిశ్రమ, రసాయనాలు, ఎలక్ట్రానిక్స్, ఔషధాలు, వ్యవసాయ--ఆహార ఉత్పత్తులు, ఇంధనం, కీలక ఖనిజాలు, వైద్య పరికరాలు, అధునాతన తయారీ తదితర రంగాల్లో సహకారానికి విస్తృత అవకాశాలు ఉన్నట్లు ఇరుపక్షాలు గుర్తించాయి.ద్వైపాక్షిక ఆర్థిక కార్యాచరణలోని వివిధ అంశాలను కూడా ప్రతినిధి బృందాలు సమీక్షించాయి. వాణిజ్యం, పెట్టుబడి సంబంధాలను మరింత విస్తరించడం, సహకారాన్ని బలోపేతం చేయడం, ఇరుదేశాల ఉత్పాదక రంగాల మధ్య సన్నిహిత సంబంధాలను పెంపొందించడంపై చర్చించాయి.భారత్‌కు మెక్సికో వ్యాపార బృందం పర్యటనపై చర్చ2027 తొలి త్రైమాసికంలో మెక్సికో వ్యాపార ప్రతినిధి బృందం భారత్‌లో పర్యటించే అవకాశాన్ని ఇరుపక్షాలు పరిశీలించాయి. ఈ పర్యటన ద్వారా వ్యాపార సంస్థల మధ్య బీటూబీ సమావేశాలు నిర్వహించడం, వాణిజ్య అవకాశాలను గుర్తించడం, ఇరుదేశాల ఉత్పాదక రంగాల మధ్య వ్యాపార సంబంధాలను బలోపేతం చేయాలని ప్రతిపాదించారు.

# భారత్‌లో పెట్టుబడులకు విస్తృత అవకాశాలు: పీయూష్ గోయల్

**లిక్టెన్‌స్టెయిన్ యువరాజు అలోయిస్‌తో కేంద్ర మంత్రి భేటీ**
**భారత్--ఈఎఫ్‌టీఏ ఒప్పందం కింద ఆర్థిక సహకారం విస్తరణపై చర్చ**
**అధునాతన తయారీ, సాంకేతికత, పరిశోధన రంగాల్లో భాగస్వామ్యాలకు ఆహ్వానం**

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబరు 28:**

భారత్‌లో పెట్టుబడులు, పారిశ్రామిక భాగస్వామ్యాలకు విస్తృత అవకాశాలు ఉన్నాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. భారత పర్యటనలో ఉన్న లిక్టెన్‌స్టెయిన్ వారసత్వ యువరాజు అలోయిస్‌తో బుధవారం ఆయన మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. భారత్--యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్ (ఈఎఫ్‌టీఏ) వాణిజ్య, ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (టెపా) కింద ఆర్థిక సంబంధాలను బలోపేతం చేయడం, పెట్టుబడి అవకాశాలను ముందుకు తీసుకెళ్లడంపై చర్చించారు.

భారత్ బలమైన ఆర్థిక పునాదులు, నిరంతర సంస్కరణలు, విస్తరిస్తున్న తయారీ సామర్థ్యాలు అంతర్జాతీయ పెట్టుబడిదారులకు అనుకూల అవకాశాలను కల్పిస్తున్నాయని గోయల్ తెలిపారు. వ్యాపార నిర్వహణను సులభతరం చేయడం, నియంత్రణ ప్రక్రియలను సరళీకరించడం, డిజిటల్ పాలనను బలోపేతం చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. పారదర్శకమైన, స్థిరమైన, పోటీతత్వంతో కూడిన వ్యాపార వాతావరణాన్ని నిర్మించేందుకు చర్యలు కొనసాగిస్తున్నట్లు వివరించారు.

2025--26లో రికార్డు స్థాయిలో విదేశీ పెట్టుబడులు

భారత ఆర్థిక అవకాశాలపై అంతర్జాతీయ విశ్వాసం పెరుగుతోందని పెట్టుబడుల గణాంకాలు సూచిస్తున్నాయి. 2014--15 నుంచి 2025--26 ఆర్థిక సంవత్సరాల మధ్య దేశంలోకి మొత్తం 843 బిలియన్ అమెరికన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చినట్లు తెలిపారు. ఒక్క 2025--26 ఆర్థిక సంవత్సరంలోనే రికార్డు స్థాయిలో 94.53 బిలియన్ డాలర్ల పెట్టుబడులు సమకూరినట్లు పేర్కొన్నారు.

దేశంలో 2.50 లక్షల స్టార్టప్‌లు 770కిపైగా జిల్లాల్లో, 56 పరిశ్రమల పరిధిలో 25.42 లక్షలకు పైగా ఉద్యోగాలకు తోడ్పడుతున్నాయని వివరించారు. వీటిలో 52 శాతం స్టార్టప్‌లు మెట్రో నగరాల వెలుపల ఉండటం పారిశ్రామిక అవకాశాల విస్తరణను ప్రతిబింబిస్తోందన్నారు.

15 ఏళ్లలో 100 బిలియన్ డాలర్ల పెట్టుబడుల లక్ష్యం

2025 అక్టోబరు 1 నుంచి అమల్లోకి వచ్చిన భారత్--ఈఎఫ్‌టీఏ టెపా కల్పిస్తున్న అవకాశాలను గోయల్ ప్రస్తావించారు. ఈ ఒప్పందం ప్రకారం ఈఎఫ్‌టీఏ దేశాలు 15 ఏళ్లలో భారత్‌లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను 100 బిలియన్ డాలర్ల మేర పెంచే లక్ష్యంతో పనిచేయడంతోపాటు 10 లక్షల ప్రత్యక్ష ఉద్యోగాల సృష్టికి తోడ్పడనున్నాయని తెలిపారు.

బలోపేతమవుతున్న ఆర్థిక సంబంధాలను దీర్ఘకాలిక పెట్టుబడులు, ఉత్పాదక సామర్థ్యం, సాంకేతిక భాగస్వామ్యాలు, ఉపాధి కల్పనగా మార్చేందుకు ఈ ఒప్పందం అవకాశం కల్పిస్తోందని పేర్కొన్నారు.

భారత పరిశ్రమలతో భాగస్వామ్యాలకు పిలుపు

విస్తృతమైన దేశీయ మార్కెట్, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, పోటీతత్వ తయారీ వ్యవస్థ, ప్రపంచ విలువ గొలుసులతో అనుసంధాన అవకాశాలు భారత్ ప్రత్యేకతలని గోయల్ అన్నారు. లిక్టెన్‌స్టెయిన్ కంపెనీలు భారత్‌లో తయారీ భాగస్వామ్యాలు, సాంకేతిక సహకారం, పరిశోధన--అభివృద్ధి రంగాల్లో అవకాశాలను పరిశీలించాలని ఆహ్వానించారు. భారత సరఫరాదారులు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలతో సంబంధాలను మరింత విస్తరించాలని సూచించారు.

అత్యంత కచ్చితత్వంతో కూడిన ఇంజినీరింగ్, అధునాతన తయారీ, పారిశ్రామిక సాంకేతికతలు, ఆవిష్కరణల రంగాల్లో సహకార అవకాశాలపైనా చర్చించారు. ఈ రంగాల్లో భాగస్వామ్యాలు సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని పెంచడంతోపాటు ఇరుదేశాల పరిశ్రమల మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేయగలవని అభిప్రాయపడ్డారు.

పెట్టుబడులు, నాణ్యమైన ఉపాధిపై దృష్టి

భారత్--ఈఎఫ్‌టీఏ టెపా అమలుకు ఏడాది పూర్తయిన సందర్భంగా అక్టోబరు 7న న్యూఢిల్లీలో నిర్వహించిన 'ఇండియా--ఈఎఫ్‌టీఏ ప్రాస్పెరిటీ సమ్మిట్'లో లిక్టెన్‌స్టెయిన్ హోం, ఆర్థిక, క్రీడల శాఖ మంత్రి హ్యూబర్ట్ బ్యూచెల్‌తోపాటు ఆ దేశ వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

టెపా ద్వారా పెట్టుబడుల ప్రవాహాన్ని పెంచడం, వాణిజ్య సంబంధాలను విస్తరించుకోవడంపై తాజా సమావేశంలో ఇరుపక్షాలు ఆసక్తిని పునరుద్ఘాటించాయి. ఒప్పందం కల్పిస్తున్న అవకాశాలను మరిన్ని పెట్టుబడులు, మెరుగైన తయారీ సామర్థ్యాలు, సాంకేతిక సహకారం, నాణ్యమైన ఉపాధి రూపంలో కార్యరూపంలోకి తీసుకురావడంపై భారత్ దృష్టి సారించింది.

# స్క్రాప్ విక్రయంతో ఎస్ఈసీఎల్‌కు రూ.26.17 కోట్ల ఆదాయం

**ప్రత్యేక ప్రచారం--6లో కీలక లక్ష్యాలను అధిగమించిన సంస్థ**
**226 ప్రదేశాల్లో 47 లక్షల చదరపు అడుగులకు పైగా విస్తీర్ణంలో పరిశుభ్రత పనులు**

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబరు 28:**

ప్రత్యేక ప్రచారం--6లో భాగంగా సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (ఎస్ఈసీఎల్) పలు కీలక లక్ష్యాలను అధిగమించింది. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లలోని తన కార్యాలయాలు, ఇతర ప్రాంగణాల్లో పరిశుభ్రత, స్క్రాప్ తొలగింపు, స్థల వినియోగం, రికార్డుల నిర్వహణలో పురోగతి సాధించింది. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ పరిధిలోని కోల్ ఇండియా లిమిటెడ్‌కు ఎస్ఈసీఎల్ అనుబంధ సంస్థగా ఉంది. ఈ ప్రచారంలో 225 ప్రదేశాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని లక్ష్యంగా నిర్ణయించగా, 226 ప్రదేశాల్లో పనులు నిర్వహించింది. మొత్తం 40 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణాన్ని శుభ్రపరచాలన్న లక్ష్యాన్ని అధిగమించి, 47 లక్షల చదరపు అడుగులకు పైగా విస్తీర్ణంలో పరిశుభ్రత పనులు పూర్తి చేసింది.

**4,602 మెట్రిక్ టన్నుల స్క్రాప్ తొలగింపు**

స్క్రాప్ తొలగింపులోనూ సంస్థ నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమించింది. 3,300 మెట్రిక్ టన్నుల లక్ష్యానికి గాను 4,602 మెట్రిక్ టన్నుల స్క్రాప్‌ను విక్రయించి సుమారు రూ.26.17 కోట్ల ఆదాయం సమకూర్చుకుంది.

వనరులను సమర్థంగా వినియోగించుకోవడం, క్రమబద్ధంగా స్క్రాప్‌ను తొలగించడం, పని ప్రదేశాల నిర్వహణను మెరుగుపరచడంపై సంస్థ దృష్టి సారించింది. భౌతిక, ఎలక్ట్రానిక్ ఫైళ్ల నిర్వహణలోనూ లక్ష్యాలను అధిగమించింది. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లలో పరిశుభ్రతతోపాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది.

# వ్యసనాలకు 'నో' చెప్పాలి.. ఆరోగ్యకరమైన జీవితానికి పునాది వేసుకోవాలి

**సామాజిక ఒత్తిళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలి**
**చదువుతో పాటు క్రీడలు, పౌష్టికాహారానికి ప్రాధాన్యం ఇవ్వాలి**
**జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**





విద్యార్థులు సామాజిక ఒత్తిళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ చెడు వ్యసనాలకు స్పష్టంగా 'నో' చెప్పాలని ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సూచించారు. పాఠశాల దశ నుంచే మంచి అలవాట్లను అలవర్చుకుని, క్రీడలు, పౌష్టికాహారంతో శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అవగాహన కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా వర్చువల్ విధానంలో అందించిన సందేశాన్ని విద్యార్థులతో కలిసి వీక్షించారు. అనంతరం నషా ముక్త్ భారత్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ మత్తుపదార్థాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యతని, మత్తురహిత సమాజ నిర్మాణాన్ని ప్రజా ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. యువత వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు.

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల, కళాశాల దశల్లో స్నేహితుల ప్రభావంతో సరదాగా ఒక్కసారి ప్రయత్నిద్దామనే ఆలోచనతో మత్తుపదార్థాలు, ఇతర హానికరమైన వ్యసనాల బారిన పడవద్దని విద్యార్థులకు హితవు పలికారు. ప్రారంభ దశలోనే వాటికి దూరంగా ఉంటే భవిష్యత్తులోనూ వ్యసనరహిత జీవితాన్ని కొనసాగించవచ్చని తెలిపారు.

'ఒక్కసారి ప్రయత్నిస్తే ఏమీ కాదు.. మేమూ చేస్తున్నాం.. మాకు ఎలాంటి ఇబ్బంది లేదు' అంటూ స్నేహితులు ప్రోత్సహించినా ప్రభావితం కావద్దని సూచించారు. తోటి విద్యార్థులు అలాంటి అలవాట్లకు లోనైనా, వారితో కలవాలనే ఒత్తిడితో వాటిని అనుసరించకూడదన్నారు. స్నేహం పేరుతో ఎవరైనా బలవంతం చేసినా తమ నిర్ణయంపై దృఢంగా నిలబడి, చెడు అలవాట్లను స్పష్టంగా తిరస్కరించాలని పేర్కొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలతో సన్మార్గంలో పయనించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. చదువుకు ప్రాధాన్యం ఇస్తూనే ప్రతిరోజూ క్రీడలు, శారీరక శ్రమకు సమయం కేటాయించాలని సూచించారు. క్రికెట్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ వంటి క్రీడల్లో పాల్గొనడంతో పాటు నడక, పరుగు వంటి వ్యాయామాలను అలవాటు చేసుకోవాలన్నారు.

క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల శరీరం చురుగ్గా ఉండటంతో పాటు మానసిక ఉల్లాసం పెరుగుతుందని, చదువుపై ఏకాగ్రత మెరుగుపడుతుందని వివరించారు. మార్కులు, భవిష్యత్తు గురించి అనవసర ఆందోళనకు గురికాకుండా రోజువారీ పనులు, చదువుపై దృష్టి సారించాలని సూచించారు.

పౌష్టికాహారం తీసుకోవడం, నిత్యం వ్యాయామం చేయడం, తగినంత నిద్రపోవడం వంటి అలవాట్లను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని తెలిపారు. పాఠశాల, కళాశాల దశల్లో మాత్రమే కాకుండా ఉన్నత విద్య, ఉద్యోగ జీవితంలోనూ ఈ అలవాట్లను కొనసాగించాలని పేర్కొన్నారు. విద్యార్థులు చెప్పిన విషయాలను శ్రద్ధగా విని, ఆలోచించి ఆచరణలో పెట్టేందుకు ప్రయత్నిస్తారని, అందుకే వారితో సంభాషించడం తనకు ఇష్టమని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో తెలియజేసిన అంశాల ప్రయోజనాలను గుర్తించి, మంచి అలవాట్లను జీవితంలో భాగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ అల్లం అప్పయ్య, వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీనివాస్, సెక్రటరీ రాజిరెడ్డి, కోశాధికారి శిరుప సతీష్‌కుమార్, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు, విద్యార్థినీ విద్యార్థులు, సంబంధిత అధికారులు తదితరులు

# భూగర్భ జలాల పునర్భరణకు 'పునః భరణ్' యాప్

**ఆవిష్కరించిన కేంద్ర జల్‌శక్తి మంత్రి**
**మూడు కిలోమీటర్ల పరిధిలో అనువైన పునర్భరణ ప్రాంతాల గుర్తింపు**



**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబరు 28:**

భూగర్భ జలాల పునర్భరణకు శాస్త్రీయ ప్రణాళికలు రూపొందించేందుకు ఉపయోగపడే 'పునః భరణ్' మొబైల్ అప్లికేషన్‌ను కేంద్ర జల్‌శక్తి మంత్రి ఆవిష్కరించారు. కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వ శాఖలోని జలవనరులు, నదుల అభివృద్ధి, గంగా పునరుజ్జీవన విభాగానికి చెందిన జాతీయ జల మిషన్ సహకారంతో బీఐఎస్ఏజీ--ఎన్ ఈ యాప్‌ను అభివృద్ధి చేసింది.ఈ యాప్ ద్వారా వినియోగదారులు తమ ప్రాంతం నుంచి గరిష్ఠంగా మూడు కిలోమీటర్ల వ్యాసార్థంలో భూగర్భ జలాల కృత్రిమ పునర్భరణకు అనువైన ప్రదేశాలను గుర్తించవచ్చు. స్థానిక పరిస్థితులకు తగిన పునర్భరణ నిర్మాణాల ఎంపికకు అవసరమైన సమాచారాన్ని కూడా తెలుసుకోవచ్చు.

**గ్రామస్థాయి మ్యాప్‌లు అందుబాటులోకి**

ఈ వేదికకు సంబంధించిన వెబ్ పోర్టల్‌లో గ్రామస్థాయిలో కృత్రిమ పునర్భరణ నిర్మాణాలకు అనువైన ప్రాంతాలను చూపే జోనేషన్ మ్యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. భౌగోళిక సమాచార వ్యవస్థ (జీఐఎస్) సాధనాలు, వివిధ అంశాలకు సంబంధించిన మ్యాప్ పొరల సాయంతో భూగర్భ జలాల సుస్థిర నిర్వహణకు ప్రణాళికలు రూపొందించవచ్చు.

వర్షపాతం, భూగర్భ జలమట్టాలు, భూగర్భ జలాల లభ్యత, భూమి వాలు, నీటి ప్రవాహ మార్గాలు వంటి భౌగోళిక సమాచారాన్ని ఈ వేదిక ఉపయోగించుకుంటుంది. వీటి ఆధారంగా నీటిని భూమిలోకి ఇంకించేందుకు అనువైన ప్రాంతాలను గుర్తించి, తగిన చర్యలను ప్రణాళికాబద్ధంగా చేపట్టేందుకు తోడ్పడుతుంది.

భౌగోళిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి భూగర్భ జలాల పునర్భరణ ప్రణాళికలను మరింత శాస్త్రీయంగా రూపొందించేందుకు 'పునః భరణ్' ఉపయోగపడనుంది.

# కునో చీతా మృతిపై కేంద్రం తీవ్ర ఆగ్రహం

**తుపాకీ పెల్లెట్ గాయాలతో 19 నెలల మగ చీతా మృతి**
**క్షేత్రస్థాయి దర్యాప్తునకు ఉన్నతస్థాయి కేంద్ర బృందం**
**ఇప్పటికే ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసిన మధ్యప్రదేశ్ ప్రభుత్వం**

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబరు 28:**

మధ్యప్రదేశ్‌లోని కునో జాతీయ ఉద్యానవనానికి చెందిన 19 నెలల మగ చీతా తుపాకీ పెల్లెట్ గాయాలతో మృతిచెందిన ఘటనను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. కేఎన్‌జీ22గా గుర్తించిన ఈ చీతా మృతికి దారితీసిన పరిస్థితులపై క్షేత్రస్థాయి దర్యాప్తు కోసం ఉన్నతస్థాయి బృందాన్ని నియమించింది. ప్రాజెక్ట్ చీతా ప్రాధాన్యం, పునఃప్రవేశపెట్టిన చీతాల రక్షణ అవసరాల నేపథ్యంలో సమగ్ర విచారణకు ఆదేశించింది.కేంద్ర బృందంలో జాతీయ పులుల సంరక్షణ ప్రాధికార సంస్థ (ఎన్‌టీసీఏ) ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్స్, వన్యప్రాణి నేర నియంత్రణ బ్యూరో (డబ్ల్యూసీసీబీ) అదనపు డైరెక్టర్, ప్రాంతీయ డిప్యూటీ డైరెక్టర్ ఉన్నారు. అందుబాటులోని అన్ని ఆధారాలను పరిశీలించి, మధ్యప్రదేశ్ అటవీ శాఖతో సమన్వయంతో దర్యాప్తు చేపట్టనున్నారు. ఘటనపై కఠినమైన, వేగవంతమైన చర్యలు తీసుకునేందుకు అవసరమైన అంశాలను పరిశీలించనున్నారు.శస్త్రచికిత్సలో ఐదు పెల్లెట్ల గుర్తింపు'నిర్వా' చీతాకు జన్మించిన ఈ మగ చీతా అక్టోబరు 25న కునో జాతీయ ఉద్యానవన రక్షిత ప్రాంతం వెలుపల మొరెనా ప్రాదేశిక అటవీ ప్రాంతంలో గాయాలతో కనిపించింది. మధ్యప్రదేశ్ అటవీ శాఖ నివేదిక ప్రకారం, అదే రోజు షియోపూర్ ప్రాదేశిక అటవీ డివిజన్ పరిధి నుంచి దానిని రక్షించారు.అనంతరం జబల్‌పూర్‌లోని పశువైద్య కేంద్రంలో అత్యవసర శస్త్రచికిత్సతోపాటు ప్రత్యేక వైద్య చికిత్స అందించారు. శస్త్రచికిత్స సమయంలో చీతా శరీరం నుంచి ఐదు తుపాకీ పెల్లెట్లను తొలగించారు. వైద్యుల ప్రయత్నాలు ఫలించకపోవడంతో అక్టోబరు 27న చీతా మృతిచెందింది. పెల్లెట్ల కారణంగా శరీర అంతర్భాగాల్లో పలుచోట్ల గాయాలైనట్లు వైద్య పరీక్షలు నిర్ధారించాయి.రాష్ట్ర ఎస్‌టీఎఫ్‌తో కలిసి విచారణఈ ఘటనపై దర్యాప్తు కోసం అటవీ, పోలీసు అధికారులతో కూడిన ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను (ఎస్‌టీఎఫ్) మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే ఏర్పాటు చేసింది. కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ నియమించిన బృందం రాష్ట్ర అధికార యంత్రాంగంతో కలిసి పనిచేయనుంది.చీతాల భద్రతా విధానాల అమలు, పర్యవేక్షణ, రక్షణ చర్యలను కూడా కేంద్ర బృందం పరిశీలించనుంది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించనుంది. దర్యాప్తు వివరాలు, సిఫార్సులతో కూడిన నివేదికను కేంద్ర మంత్రిత్వ శాఖకు సమర్పించనుంది. ఆ నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వానికి, క్షేత్రస్థాయి అధికారులకు తదుపరి ఆదేశాలు జారీ చేయనున్నారు.

# తిరుచ్చి విమానాశ్రయంలో వన్యప్రాణుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట

**ఆహార ప్యాకెట్లలో దాచిన 45 సజీవ సరీసృపాలు స్వాధీనం**
**బ్యాంకాక్ నుంచి కొలంబో మీదుగా వచ్చిన ఇద్దరు ప్రయాణికుల అరెస్టు**

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబరు 28:**



తిరుచ్చి అంతర్జాతీయ విమానాశ్రయం ద్వారా దేశంలోకి వన్యప్రాణులను అక్రమంగా తరలించే ప్రయత్నాన్ని రెవెన్యూ ఇంటెలిజెన్స్ డైరెక్టరేట్ (డీఆర్ఐ) అధికారులు అడ్డుకున్నారు. తిరుచ్చి ఎయిర్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఏఐయూ)తో కలిసి చేపట్టిన సంయుక్త ఆపరేషన్‌లో 45 సజీవ సరీసృపాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరు భారతీయ ప్రయాణికులను అరెస్టు చేశారు.నిర్దిష్ట నిఘా సమాచారం ఆధారంగా అక్టోబరు 26న బ్యాంకాక్ నుంచి కొలంబో మీదుగా తిరుచ్చి చేరుకున్న ఇద్దరు ప్రయాణికులను డీఆర్ఐ అధికారులు అడ్డుకుని తనిఖీ చేశారు. వారి సామానును క్షుణ్ణంగా పరిశీలించగా 27 ఆహార ప్యాకెట్లలో సజీవ సరీసృపాలను దాచినట్లు గుర్తించారు. తనిఖీల సమయంలో అవి మత్తులో ఉన్నట్లు అధికారులు తెలిపారు.

పాములు, టెగూలు, ఇగ్వానా గుర్తింపు

స్వాధీనం చేసుకున్న సరీసృపాల్లో 23 కార్న్ స్నేక్‌లు, 16 బాల్ పైథాన్‌లు, ఐదు అర్జెంటీనా బ్లాక్ అండ్ వైట్ టెగూలు, ఒక స్నో వైట్ ఇగ్వానా ఉన్నాయి. ప్రయాణికుల సామానులో బయటపడిన ఈ వన్యప్రాణులను తదుపరి చర్యల కోసం తిరుచ్చి ఏఐయూకు అప్పగించారు.

కస్టమ్స్ చట్టం--1962 నిబంధనల కింద సరీసృపాలను స్వాధీనం చేసుకుని, ఇద్దరు ప్రయాణికులను తిరుచ్చి ఏఐయూ అధికారులు అరెస్టు చేశారు.

నిఘా ఆధారిత తనిఖీలు, కస్టమ్స్ అధికారులతో సమన్వయం ద్వారా వన్యప్రాణుల అక్రమ రవాణాను అరికట్టేందుకు కృషి చేస్తున్నట్లు డీఆర్ఐ పేర్కొంది. దేశంలోకి వన్యప్రాణులను అక్రమంగా తరలించే ప్రయత్నాలను నిరోధించడంలో ఈ సంయుక్త చర్య ప్రాధాన్యాన్ని చాటిందని తెలిపింది.

# తాగునీటి దుర్వినియోగంపై కఠిన చర్యలు



**హైదరాబాద్ అక్టోబర్ 28 జన తెలంగాణ**

ప్రజల ఫిర్యాదుతో జూబ్లీహిల్స్‌లో రూ.5 వేల జరిమానాలి
వాట్సాప్ ఫిర్యాదు అందిన వెంటనే క్షేత్రస్థాయి తనిఖీ
ఉల్లంఘన నిర్ధారణతో జరిమానా విధించిన అధికారులు
నీటి వృథాపై ఆధారాలతో ఫిర్యాదు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి

తాగునీటి దుర్వినియోగాన్ని అరికట్టేందుకు జలమండలి చర్యలు చేపడుతోంది. ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులను పరిశీలించి, క్షేత్రస్థాయిలో ఉల్లంఘనలు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా జూబ్లీహిల్స్ పరిధిలో తాగునీటిని వృథా చేసిన ఓ నివాసానికి రూ.5 వేల జరిమానా విధించింది.

జూబ్లీహిల్స్ సర్కిల్, జూబ్లీహిల్స్ వార్డు పరిధిలోని రోడ్ నంబర్ 57, ప్లాట్ నంబర్ 1152లో తాగునీటిని ఇంటి ప్రాంగణం శుభ్రపరిచేందుకు వినియోగిస్తున్నట్లు స్థానికులు జలమండలి వాట్సాప్ నంబర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందిన నేపథ్యంలో జలమండలి అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేపట్టారు. అక్కడ తాగునీటి దుర్వినియోగం జరుగుతున్నట్లు నిర్ధారించుకుని, సంబంధిత నివాసానికి రూ.5 వేల జరిమానా విధించారు.

ఫిర్యాదు స్వీకరణ నుంచి క్షేత్రస్థాయి విచారణ, ఉల్లంఘన నిర్ధారణ, జరిమానా విధింపు వరకు చర్యలు చేపట్టడం ద్వారా తాగునీటి దుర్వినియోగాన్ని ఉపేక్షించబోమని జలమండలి స్పష్టం చేసింది. తాగునీటిని తాగడానికి, గృహ అవసరాలకు మాత్రమే పొదుపుగా వినియోగించాలని సూచించింది. ఇంటి ప్రాంగణాలు, రోడ్లు శుభ్రపరచడం వంటి పనులకు తాగునీటిని వృథా చేస్తే నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించింది.

నీటి దుర్వినియోగంపై ప్రజలే నిఘా పెట్టాలి:

తాగునీటి వృథా, దుర్వినియోగం ఘటనలు ఎక్కడైనా ప్రజల దృష్టికి వస్తే సంబంధిత ఫొటోలు, వీడియోలు, వ్యక్తులు లేదా సంస్థల వివరాలు, ఘటన జరిగిన ప్రాంతం, పూర్తి చిరునామాతో జలమండలి వాట్సాప్ నంబర్ 99499 30003 కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేసింది. అదేవిధంగా కస్టమర్ కేర్ నంబర్ 155313 ద్వారా కూడా ఫిర్యాదులు నమోదు చేయవచ్చని తెలిపింది.

ప్రజల నుంచి అందే ప్రతి ఫిర్యాదును పరిశీలించి, అవసరమైన క్షేత్రస్థాయి విచారణ చేపడతామని, ఉల్లంఘనలు నిర్ధారణ అయిన పక్షంలో నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. సమాచారం అందించిన వ్యక్తుల వివరాలను పూర్తి గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చింది.తాగునీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, నీటి వృథాను అరికట్టడంలో ప్రజలు భాగస్వాములు కావాలని జలమండలి కోరింది.

# ఎల్‌నినో సవాళ్లను ఎదుర్కొనేలా గ్రామాలను సిద్ధం చేయాలి

**ఉపాధి హామీ పనులతో జల సంరక్షణకు ప్రాధాన్యం**
**ప్రతి పంచాయతీలో పశువుల నీటి తొట్టెల నిర్మాణం**
**అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు: మంత్రి సీతక్క**






ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో తలెత్తే నీటి ఎద్దడి, కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు గ్రామాలను ముందస్తుగా సిద్ధం చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పనులను జల సంరక్షణతో అనుసంధానించి, గ్రామీణ కూలీలకు స్థానికంగానే ఉపాధి కల్పించాలని సూచించారు.

బుధవారం హైదరాబాద్‌లోని బీఆర్‌కే భవన్ సెర్ప్ కార్యాలయం నుంచి స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్, సెర్ప్ కమిషనర్ దివ్య దేవరాజన్‌తో కలిసి మంత్రి రాష్ట్రవ్యాప్తంగా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, జిల్లా, మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉపాధి హామీ పనులు, నీటి సంరక్షణ, గ్రామాభివృద్ధి పనులు, మహిళా సంఘ భవనాల నిర్మాణ పురోగతిపై సమీక్షించారు. ములుగు జిల్లా సమీకృత కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్‌రావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

జల సంరక్షణ పనులకు ప్రాధాన్యం

ప్రతి గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పనులు చేపట్టి, పని కోరిన కూలీలకు ఉపాధి కల్పించాలని మంత్రి సీతక్క ఆదేశించారు. రాష్ట్రంలోని 12,516 గ్రామ పంచాయతీల్లో పనులు ప్రారంభమయ్యాయని, మిగిలిన 244 పంచాయతీల్లోనూ వెంటనే పనులు ప్రారంభించాలని సూచించారు. అక్టోబర్ 27న రాష్ట్రవ్యాప్తంగా 3,97,788 మంది కూలీలు ఉపాధి పనులకు హాజరయ్యారని, కూలీల భాగస్వామ్యాన్ని మరింత పెంచాలని తెలిపారు. ప్రతి 40 మంది కూలీలకు ఒక మేట్‌ను నియమించి పనులను సమర్థవంతంగా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఫామ్ పాండ్లు, ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీచార్జ్ పనులు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, చెరువుల పునరుద్ధరణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించే పనులను విస్తృతంగా చేపట్టాలని సూచించారు. నీటి వృథాను అరికట్టడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సర్పంచులను కోరారు. ఈ సందర్భంగా నీటి సంరక్షణపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ రూపొందించిన 'జలసిరి' వీడియోను ఆవిష్కరించారు.

ప్రతి పంచాయతీలో పశువుల నీటి తొట్టెలు

వేసవిలో పశువులకు మేత, తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. వీబీగ్రామ్ జి కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీలో పశువుల నీటి తొట్టెల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ఒక్కో తొట్టె నిర్మాణానికి సుమారు రూ.24 వేల అంచనా వ్యయం ఉంటుందని తెలిపారు.

పశువులు తిరిగే ప్రాంతాల్లో, గ్రామ ప్రజలందరికీ అందుబాటులో ఉండే సామూహిక స్థలాలను గుర్తించాలని సూచించారు. ట్యాప్ కనెక్షన్‌కు సమీపంలో అనువైన స్థలాలను గుర్తించి, వాటి వివరాలను పంచాయతీ కార్యదర్శులు సంబంధిత ఇంజినీరింగ్ అధికారులకు అందజేయాలని ఆదేశించారు.

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అవసరమైన నిధులను అందుబాటులో ఉంచుతోందని మంత్రి తెలిపారు. ఉపాధి హామీ నిధులను సద్వినియోగం చేసుకొని వర్క్‌షెడ్లు, పశువుల షెడ్లు, కమ్యూనిటీ హాళ్లు తదితర నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ఒక్కో గ్రామానికి సుమారు రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు నిధులు సమకూరే అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఉపాధి పనుల బిల్లులు 15 రోజుల్లో వస్తాయని తెలిపారు.

ప్రతి గ్రామ పంచాయతీని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దే లక్ష్యంతో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మండలస్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని, విధుల నిర్వహణలో అలసత్వం ప్రదర్శించే సర్పంచులు, అధికారులకు నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు.

ఏజెన్సీ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంచాలి

ఏజెన్సీ ప్రాంతాల్లో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కూలీలకు ఉపాధి కల్పించాలని మంత్రి సూచించారు. ఆయా ప్రాంతాల భౌగోళిక పరిస్థితులు, ప్రజల జీవన విధానానికి అనుగుణంగా పనులను ఎంపిక చేయాలన్నారు. నీటి సంరక్షణ పనులు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలను పెంచి వలసలను నివారించాలని ఆదేశించారు.

నవంబర్ 19న గ్రామ మహిళా సంఘ భవనాలను ప్రారంభించుకునేలా నిర్మాణ పనులను పూర్తి చేయాలని సూచించారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

జీపీఎస్‌ఏపీలో గ్రామాభివృద్ధి వివరాలు

గ్రామాల అభివృద్ధి పనుల వివరాలను జీపీఎస్‌ఏపీ సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేస్తున్నామని, ఇప్పటికే కోటి 12 లక్షల రికార్డులను పొందుపరిచామని మంత్రి తెలిపారు. గ్రామ పంచాయతీల సమగ్ర సమాచారాన్ని ఉపయోగించి పనుల ప్రణాళిక, అమలు, పర్యవేక్షణను మెరుగుపరచాలని సూచించారు. మౌలిక వసతులు, నీటి సంరక్షణ, ఉపాధి కల్పన, పారిశుద్ధ్యానికి ప్రాధాన్యతనిస్తూ గ్రామాలను అభివృద్ధి చేస్తే జాతీయస్థాయి అవార్డులు సాధించవచ్చన్నారు. అవార్డుల ద్వారా లభించే అదనపు నిధులను గ్రామాభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పలు జిల్లాల సర్పంచులతో మంత్రి నేరుగా మాట్లాడి గ్రామాల్లో ఉపాధి, అభివృద్ధి పనుల పురోగతిని తెలుసుకున్నారు. ఉపాధి హామీ పథకాన్ని సమర్థవంతంగా వినియోగించి అభివృద్ధి సాధించిన సర్పంచులను అభినందించారు. ఇతర సర్పంచులు కూడా వారిని ఆదర్శంగా తీసుకొని పనులను వేగవంతం చేయాలని సూచించారు. గవర్నర్ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా తిరిగి నియమితులైన దాన కిషోర్‌ను మంత్రి అభినందించి సత్కరించారు.

ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ రవీందర్, డీపీఓ వెంకయ్య, డీఐఓ అప్పలనాయుడు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సంజీవరావు, మిషన్ భగీరథ డీఈ సునీత, జిల్లా వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కొమురయ్య, పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖల ఈఈలు తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రులు ఓటరుగా నమోదు కావాలి: మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

**నాగులపల్లిలో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమం**
**బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలి**





హైదరాబాద్--మహబూబ్‌నగర్--రంగారెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకుని ఫరూఖ్‌నగర్ మండలం నాగులపల్లి గ్రామంలో నిర్వహించిన పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమం జోరుగా సాగింది. ఈ కార్యక్రమానికి షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్, పట్టభద్రుల ఎన్నికల ఇన్‌చార్జ్ బైకని శ్రీనివాస్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

?ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ... అర్హులైన ప్రతి పట్టభద్రుడు నిర్లక్ష్యం చేయకుండా విధిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో విద్యావంతుల పాత్ర కీలకమని, విజ్ఞులైన పట్టభద్రులు గతాన్ని, వర్తమానాన్ని బేరీజు వేసుకుని విజ్ఞతతో సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. గత బీఆర్ఎస్ హయాంలో యువతకు ఉపాధి, నాణ్యమైన విద్యతో పాటు అన్ని రంగాల్లోనూ సముచిత స్థానం దక్కిందని గుర్తుచేశారు. పట్టభద్రుల సమస్యలపై నిరంతరం పోరాడేందుకు, యువత భవిష్యత్తుకు భరోసా కల్పించేందుకు బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిని గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

?ఎన్నికల ఇన్‌చార్జ్ బైకని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. ఓటరు నమోదు ప్రక్రియను ప్రతి కార్యకర్త బాధ్యతగా తీసుకుని అర్హులందరి పేర్లు జాబితాలో చేరేలా కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు లక్ష్మణ్ నాయక్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నటరాజన్, స్థానిక సర్పంచ్ రాధిక అశోక్ రెడ్డి, మాజీ సర్పంచులు శ్రవణ్ పట్వారీ, శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎంపీటీసీలు బిశ్వ రామకృష్ణ, రాధాకృష్ణ, నాయకులు యాదయ్య, పోచయ్య గౌడ్, వెంకటయ్య గౌడ్, నరసింహా, జనార్దన్ గౌడ్, మల్లారెడ్డి, శేఖర్ రెడ్డి, రఘురాం రెడ్డి, దొడ్డి శ్రీనివాస్, కాటి మల్లేష్ యాదవ్ నాగభూషణం, భరత్, రాజశేఖర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## 42వ వార్డులో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థి పైల భవాని జోరుగా ఇంటింటి ప్రచారం





పట్టణంలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం మమ్మురంగా సాగుతోంది. ఇందులో భాగంగా పట్టణంలోని 42వ వార్డులో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభ్యర్థులు ఇంటింటికి వెళ్లి ప్రజలను కలుసుకుంటూ పార్టీ అభ్యర్థుల మద్దతు కోరారు. 42వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి పైల భవానిమాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రజల్లో అసంతృప్తి ఉందని అన్నారు. నిత్యవసర వస్తువులు ధరలు పెరగడం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, పెన్షన్లు, రేషన్ కార్డులు మంజూరు వంటి అంశాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను, అమలను ఓటర్లు నిశతంగా గమనిస్తున్నారని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో ప్రజల నుంచి లభిస్తున్న స్పందన తమకు ప్రోత్సహిస్తుందని అన్నారు. కూటమి నాయకులు ఎన్ని రాజకీయాల ప్రయత్నాలు చేసిన, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తుందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 42వ డివిజన్ అభ్యర్థిగా పైల భవాని కు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, మేయర్ అభ్యర్థిగా కోలగట్ల శ్రావణి కు ఫ్యాను గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు ఈ యొక్క కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## నూతనంగా ఎన్నికైన మండల పార్టీ ప్రెసిడెంట్ ని సన్మానించిన సర్పంచ్లు




చేగుంట మండల నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కసబోయిన భాస్కర్ ని ఈ రోజు పంచామృత రెస్టారెంట్ లో పలువురు సర్పంచ్ లు అనంతసాగర్ సర్పంచ్ వెంకటేశం గారి శ్రీధర్ ఉల్లి తిమ్మాయపల్లి సర్పంచ్ కుమ్మరి సత్యనారాయణ చందాయి పేట్ సర్పంచ్ తాలుక మహేశ్వరి సాయిబాబా  పెద్ద శివనూర్ సర్పంచ్ నర్సింలు అనంతసాగర్ ఉపసర్పంచ్ చిక్కుడు స్వామి ఆర్టీఐ జిల్లా కార్యదర్శి చిక్కుడు మహేష్ గుండబోయిన అజయ్ కుమార్   మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి తధానంతరం వారి గ్రామాల్లోని పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చించి పార్టీ తరపున వారి గ్రామానికి నిధులు వచ్చేలా సహకరించాలని మండల పార్టీ అధ్యక్షులతో చర్చించారు ఈ కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచులు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం మాజీ కార్పొరేటర్ కంది శైలజ




మాజీ డిప్యూటీ స్పీకర్ సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుళ్ళ పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు మాజీ కార్పొరేటర్ కంది శైలజ ఆధ్వర్యంలో బుధవారం బౌద్ధనగర్ డివిజన్ వార్డు కార్యాలయంలోని రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా హెల్ప్ డెస్క్ ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కంది శైలజ మాట్లాడుతూ..అర్హులైన పట్టభద్రులు ఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకాల ప్రకారం దరఖాస్తు చేసుకోవాలని, తమ పేరు ఓటరు జాబితాలో నమోదైందో లేదో సరిచూసుకోవాలని సూచించారు.

ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావడం ద్వారా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కంది నారాయణ, ఉద్యమకారుడు బిఆర్ఎస్ నాయకులు మాజీ వార్డు మెంబర్ మంద జగన్, చింతకింది మల్లేష్, పాకసాయి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

త్రినేత్ర తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
బిజినెస్
తెలుగు దిన పత్రిక

గురువారం అక్టోబర్ 29, 2026

www.trinetnews.com

## ఎమ్మెల్సీ ఓటర్ నమోదు ప్రక్రియను విజయవంతం చేయాలి -- గోలి శ్రీనివాస్ రెడ్డి గారు...

**• కల్వకుర్తిలో ముఖ్య నాయకుల సమావేశం..పట్టభద్రుల ఓటర్ నమోదు కార్యక్రమంపై దిశానిర్దేశం**





కల్వకుర్తి: ఎమ్మెల్సీ ఓటర్ నమోదు ప్రక్రియను విజయవంతంగా నిర్వహించేందుకు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పట్టభద్రులు సమన్వయంతో పనిచేయాలని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కల్వకుర్తి పట్టణంలోని ఎస్ కన్వెన్షన్ హాల్‌లో ఆయన ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఎమ్మెల్సీ ఓటర్ నమోదు ప్రక్రియపై నాయకులకు దిశానిర్దేశం చేశారు.

ఓటర్ నమోదు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి

ఎమ్మెల్సీ ఓటర్ నమోదు ప్రక్రియలో అర్హులైన ప్రతి పట్టభద్రుడికి అవగాహన కల్పించి, వారు ఓటరుగా నమోదు చేసుకునేలా నాయకులు కృషి చేయాలని గోలి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. కల్వకుర్తి పట్టణం, కల్వకుర్తి మండలం, వెల్దండ మండలాల్లోని గ్రామాలు, వార్డుల వారీగా నాయకులు బాధ్యతలు తీసుకొని నమోదు కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని పేర్కొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

ఓటర్ నమోదు కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రతి నాయకుడు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని, పట్టభద్రులను కలిసి నమోదు ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. అర్హులైన వారు ఎవరూ నమోదు ప్రక్రియకు దూరం కాకుండా నాయకులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని పిలుపునిచ్చారు.

ప్రతి గ్రామం, ప్రతి వార్డులో అవగాహన కల్పించాలి

పట్టణం నుంచి గ్రామీణ ప్రాంతాల వరకు ఓటర్ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పరస్పర సహకారంతో పనిచేస్తూ నమోదు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కీలకంగా నిలవాలి

పట్టభద్రుల ఓటర్ నమోదు ప్రక్రియకు ప్రాధాన్యతనిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా కృషి చేయడం అందరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో పట్టభద్రుల భాగస్వామ్యాన్ని పెంచేందుకు నాయకులందరూ ఐక్యంగా ముందుకు సాగాలని కోరారు.

ఈ సమావేశానికి కల్వకుర్తి ఎమ్మెల్సీ ఇన్‌చార్జి రజిని సాయి చందు ముఖ్య అతిథి గా హాజరయ్యారు.

వారితో పాటు కల్వకుర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యం గారు..

కార్యక్రమంలో కల్వకుర్తి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సింగం విజయ్ గౌడ్,మాజీ జడ్పీటీసీలు దశరథ్ నాయక్,విజిత రెడ్డి,వెల్దండ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు,మాజీ ఎంపీపీ పుట్ట రాంరెడ్డి,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సాహెద్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బాలయ్య,కాటన్ మిల్ అధ్యక్షుడు సూర్య ప్రకాష్,మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్,కౌన్సిలర్ రాములు,మాజీ సర్పంచ్ సుశీల ఈశ్వర్,మాజీ సర్పంచులు జంగయ్య,అంజి నాయక్, మాజీ ఉప సర్పంచ్ నిరంజన్,జిల్లా నాయకులు నాగులు నాయక్,మాజీ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జోగయ్య,కొమ్ము శ్రీనివాస్,మాజీ ఎంపీటీసీ హన్మంత్ నాయక్,ఏలికల్ సర్పంచ్ కృష్ణయ్య,తోటపల్లి సర్పంచ్ సత్యనారాయణ,వెంకటాపూర్ సర్పంచ్ రాజు,వేపూర్ సర్పంచ్ నాగరాజు,అజిలాపూర్ సర్పంచ్ రమేష్ గౌడ్,మాజీ ఎంపీటీసీలు శోభ శేఖర్ రెడ్డి,జ్యోతినిరంజన్,మాజీ కౌన్సిలర్ తాహిర్ అలీ,మాజీ సర్పంచ్ శంకర్ నాయక్,మాజీ కో-ఆప్షన్ సభ్యుడు రుక్నుదిన్,వార్డు సభ్యులు ముత్యాల నరేష్, కిషోర్,సునీత ఆనంద్‌తో పాటు మాజీ ప్రజాప్రతినిధులు,బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, పట్టభద్రులు,కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్ నమోదు ప్రక్రియను

## చింతకుంట చెరువు పరిరక్షణకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలి

**• మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనులు, ప్రభుత్వ స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్ బి. సత్యప్రసాద్**



జగిత్యాల మున్సిపల్ పరిధిలోని చింతకుంట చెరువు పరిరక్షణకు సమగ్ర ప్రణాళిక రూపొందించి, తక్షణమే అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

బుధవారం జిల్లా కలెక్టర్ మున్సిపల్, నీటిపారుదల శాఖల అధికారులతో కలిసి చింతకుంట చెరువును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువు ప్రస్తుత పరిస్థితి, పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, ఇతర సంబంధిత అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. చెరువు స్థలాన్ని పరిరక్షించేందుకు సమగ్ర ప్రణాళిక సిద్ధం చేసి, అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

అనంతరం నూతనంగా నిర్మించనున్న కోర్టు భవనాల సముదాయానికి కేటాయించిన స్థలాన్ని, రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయ భవన నిర్మాణానికి కేటాయించిన భూమిని కలెక్టర్ పరిశీలించారు. ఆయా స్థలాలకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకొని, నిర్మాణ పనులకు అవసరమైన ఏర్పాట్లపై సమీక్షించారు.

తదుపరి మున్సిపల్ పరిధిలోని నీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించి, అక్కడ జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించారు. ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనులు పూర్తి చేయాలని సూచించారు.

ప్రభుత్వ స్థలాల పరిరక్షణతో పాటు ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులకు ప్రాధాన్యతనివ్వాలని, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో జగిత్యాల రెవెన్యూ డివిజనల్ అధికారి మధుసూదన్‌తో పాటు మున్సిపల్, నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## నిన్న గజ్వేల్ లో జరిగిన డీలర్ల రాష్ట్రసదస్సులో మాట్లాడిన హరీష్ రావుగారిమాటల్లో నిజంలేదు





నిన్న గజ్వేల్ లో జరిగిన డీలర్ల రాష్ట్ర సదస్సులో మాట్లాడిన హరీష్ రావుగారి మాటల్లో నిజం లేదు 10 సంవత్సరాలు రేషన్ డీలర్ల సమస్యలు పట్టించుకోకుండా కనీసం వారి కమిషన్ పెంచటానికి కూడా అ ఇష్టంగా ప్రవర్తించిన హరీష్ రావు గారు రాష్ట్ర సివిల్ సప్లై శాఖ మాత్యులు శ్రీ ఉత్తంకుమార్ రెడ్డి గారిని డీలర్లను కలవలేదు టైం కూడా ఇవ్వలేదని విమర్శించటం తగదు,,,రాష్ట్ర ఐఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి ఎరగాని నాగన్న గౌడ్, ఈరోజు హుజూర్నగర్ పట్టణంలో వారి నివాసం ఐ ఎన్ టి యు సి ఆఫీసులో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడినారు రాష్ట్ర డీలర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఇటీవల జిల్లాల బాధ్యులు ఉత్తంకుమార్ రెడ్డి గారి ఇంటి (హైదరాబాదు )వద్దకు రాగా వారిని కలిసి వారితో మాట్లాడి వినతిపత్రం తీసుకొని వారు డీలర్ల సమస్యల పట్ల మా ప్రభుత్వం సాధ్యమైనంత వరకు తీర్చడానికి సుముఖంగా ఉన్నదని తెలిపి గౌరవ ముఖ్యమంత్రి గారికి మరియు గౌరవ డిప్యూటీ ముఖ్యమంత్రి గారికి డీలర్ల సమస్యను లెటర్ ద్వారా తెలియజేసి త్వరలో డీలర్ల బాధ్యులతో చర్చిస్తామని తెలిపినారు ఈ విషయం తెలియకుండా గౌరవ, దీతీం డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు గారు రాష్ట్ర ప్రభుత్వంపై మరియు, ఉత్తంకుమార్ రెడ్డి గారి టైం కూడా ఇవ్వట్లేదని మాట్లాడటం ను ఖండిస్తున్నాము, గత బి ఆర్ ఎస్ హయాంలో వారి ప్రభుత్వం పై అనేక సంవత్సరాలు పోరాటం చేస్తున్న కనీసం డీలర్లను గుర్తించకుండా ఎంతో అవమానాలకు గురి చేసిందని ఆరోజు ప్రతిపక్ష నాయకునిగా ఉన్న ఉత్తంకుమార్ రెడ్డి గారు టిఆర్ఎస్ నాయకత్వాన్ని ప్రశ్నించగా ఆ వెంటనే 300 రూపాయలు కమిషన్ అడిగితే కేవలం 70 రూపాయలు పెంచి చేతులు దులుపుకున్నారని వారు విమర్శించారు,, ఇట్టి సమావేశంలో రాష్ట్ర డీలర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు ఎస్ డి అజ్మతుల్లా,,ప్రధాన కార్యదర్శి గుండు గురవయ్య,యూనియన్ నాయకులు రాగం లింగయ్య,మామిడి కాశయ్య, పేరబోయిన వెంకటేశ్వర్లు,అర్వపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు,

## భూదాన్ భూములు, రీసర్వే, భూ భారతి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయాలి,

**• రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్ లోకేష్ కుమార్,**



భూదాన్ భూములు, రీ సర్వే, భూభారతి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ లోకేష్ కుమార్ అన్నారు. బుధవారం హైదరాబాద్ లోని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు (రెవెన్యూ), కలెక్టరేట్ పరిపాలన అధికారులతో భూధాన్ భూములు, రీ సర్వే ప్రక్రియ, కోర్టు కేసులు, భూ సేకరణ, జి.ఓ. 59, 76, 118 ల సంబంధిత పెండింగ్ దరఖాస్తులు, భూభారతి పెండింగ్ దరఖాస్తులు, విజిలెన్స్, ఇంటెలిజెన్స్ కేసులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్ లోకేష్ కుమార్, మాట్లాడుతూ భూదాన్ భూములకు సంబంధించిన నివేదిక, భూముల రీసర్వే ప్రక్రియ పురోగతి, న్యాయస్థానాలలో పెండింగ్‌లో ఉన్న భూ సంబంధిత కేసులు, భూసేకరణ అంశాలపై జిల్లాల వారీగా సమీక్షించారు. యు ఎల్ సి భూములు, జి.ఓ. 59, 76, 118 కింద పెండింగ్‌లో ఉన్న క్రమబద్ధీకరణ దరఖాస్తుల స్థితిగతులను సమీక్షించి సంబంధిత దరఖాస్తులను పరిష్కరించేందుకు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని తెలిపారు. భూ భారతి కార్యక్రమంలో భాగంగా పాత, కొత్త పెండింగ్ దరఖాస్తులకు సంబంధించి క్షేత్రస్థాయిలో విచారణ చేసి, రికార్డులను అనుసరించి వేగవంతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. విజిలెన్స్, ఇంటెలిజెన్స్ విభాగాలకు సంబంధించిన కేసుల పురోగతి వేగవంతం చేయాలని, భూ పరిపాలనకు సంబంధించిన పెండింగ్ అంశాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, సంబంధిత రికార్డులను సక్రమంగా నిర్వహించి, నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు.

జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాలలో రీ సర్వే పనులు సమర్థవంతంగా కొనసాగుతున్నాయని, భూభారతి పెండింగ్ దరఖాస్తులు నిబంధనల ప్రకారం నిర్ణీత గడువులోగా అధికారుల సమన్వయంతో పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎ.డి. శ్రీనివాస్, కలెక్టరేట్ పరిపాలనాధికారి శ్రీనివాసరావు దేశ్‌పాండే, బి, డి సెక్షన్ల సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన డ్యాన్స్ మాస్టర్ శేఖర్‌కు పరామర్శ.. రూ.5 వేల ఆర్థిక సాయం





కల్వకుర్తి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందిన డ్యాన్స్ మాస్టర్ శేఖర్‌ను తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, కల్వకుర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యం పరామర్శించారు. శేఖర్ నివాసానికి వెళ్లిన వారు ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో తలకు తీవ్ర గాయం కావడంతో పాటు కాలు ఫ్రాక్చర్ అయిన నేపథ్యంలో ఆయన త్వరగా కోలుకుని, సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి సాధారణ జీవితం కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా డ్యాన్స్ మాస్టర్ శేఖర్‌కు రూ.5,000 ఆర్థిక సాయం అందజేశారు.

ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మండల పార్టీ అధ్యక్షుడు సింగం విజయ్ గౌడ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సాహెద్, మాజీ ఉపసర్పంచ్ నిరంజన్, కౌన్సిలర్ రాములు, జిల్లా నాయకులు నాగులు నాయక్, మాజీ సర్పంచ్ అంజి నాయక్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు జోగయ్య, వార్డు సభ్యులు నరేష్, కిషోర్, ప్రవీణ్, బుచ్చిబాబు, జంగిర్, నగేష్, రామకృష్ణ, బర్కం గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ వారోత్సవాల్లో సెయింట్ థామస్ ఆల్టిట్యూడ్ హైస్కూల్‌లో వ్యాసరచన పోటీలు

**• పోలీసుల సేవలపై విద్యార్థులకు అవగాహన**



హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి పోలీస్ వారోత్సవాలను పురస్కరించుకుని ఎల్కతుర్తి పోలీసుల ఆధ్వర్యంలో సెయింట్ థామస్ ఆల్టిట్యూడ్ హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించారు. పోలీసుల సేవలు, విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లు, ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో వారి పాత్ర తదితర అంశాలపై విద్యార్థులు వ్యాసాలు రాశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పోలీసుల సేవలు, త్యాగాలు, బాధ్యతల గురించి తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ప్రజల రక్షణ కోసం పోలీసులు నిరంతరం కృషి చేస్తూ, ఆపద సమయంలో అండగా నిలుస్తారని తెలుసుకున్నారు. ప్రజలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ సమాజంలో భద్రతా భావాన్ని పెంపొందించేందుకు పోలీసులు చేస్తున్న కృషిపై అవగాహన పొందారు. ఎల్కతుర్తి ఎస్ఐ నరసింహారావు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణ, బాధ్యత, సేవాభావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు నిరంతరం కృషి చేయాలని, చదువుతో పాటు సామాజిక బాధ్యతను గుర్తించి మంచి పౌరులుగా ఎదగాలని అన్నారు. సమాజ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో పోలీసుల విధులు, సేవలపై అవగాహన పెంచడంతో పాటు సమాజం పట్ల బాధ్యతాయుతమైన ఆలోచనా విధానాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ అశోక్, వైస్ ప్రిన్సిపల్ లింగ మొగిలి, వ్యాయామ ఉపాధ్యాయుడు కర్రే తిరుపతి, సురేష్, ఉపాధ్యాయ బృందం, ఎల్కతుర్తి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వేయి స్తంభాల రుద్రేశ్వర స్వామి ఆలయ హుండీల లెక్కింపు పూర్తి

**• స్వామి వారి హుండీ ఆదాయం రూ.13.87 లక్షలు**

**• నందనం కవిత పర్యవేక్షణలో హుండీల లెక్కింపు**



హనుమకొండలోని చారిత్రక రుద్రేశ్వర స్వామి వేయి స్తంభాల దేవాలయంలో వినాయక చవితి, దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన హుండీలను బుధవారం లెక్కించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ హనుమకొండ జిల్లా పరిశీలకులు నందనం కవిత పర్యవేక్షణలో ఆలయ నాట్య మండపంలో ఈ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఉదయం స్వామివారికి నిత్యాహ్నిక కార్యక్రమాలు, రుద్రాభిషేకం నిర్వహించిన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం హుండీల లెక్కింపు చేపట్టారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ.4,99,742, సేవా రుసుముల ద్వారా రూ.8,87,500 ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి డి.అనిల్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయానికి మొత్తం రూ.13,87,242 ఆదాయం సమకూరింది. ఈ మొత్తాన్ని జాతీయ బ్యాంకు అయిన సెంట్రల్ బ్యాంక్‌లో జమ చేసినట్లు పేర్కొన్నారు. ప్రాచీనమైన ఈ దేవాలయంలో నిర్వహించే వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు లక్షలాది మంది భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకోవడం, మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో రాజరాజేశ్వర మహిళా సమైక్య సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేందర్ శర్మ, ఆలయ సిబ్బంది నరిగె మధుకర్, లింగబత్తిని రామకృష్ణ, హనుమకొండ పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత



చిన్న శంకరంపేట మండలం గజగట్లపల్లి గ్రామానికి చెందిన సుధ బాలయ్య మరణించిన విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ నాయకులు కంటరెడ్డి తిరుపతిరెడ్డి గారు వారి కుటుంబానికి 5000 రూపాయలు ఆర్థిక సాహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాగభూషణం, ఉప సర్పంచ్ రాజు, వార్డ్ మెంబర్స్ శమయ్య, గణేష్, రమేష్, మహేష్, ప్రసాద్, శ్రీకాంత్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## రాష్ట్ర సమాచార కమిషనర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,



ఉమ్మడి జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సింగరేణి అతిథి గృహానికి విచ్చేసిన రాష్ట్ర సమాచార కమిషనర్ డా. జి. చంద్రశేఖర్ రెడ్డి నీ, మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి. ఎ.భాస్కర్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, సింగరేణి సంస్థ శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ లతో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

# నవ్విస్తూనే ఆలోచించేలా.....!



"కార్మికులు ఎంతో కాలం పోరాడి సాధించుకున్న 44చట్టాల్ని.. కేంద్ర ప్రభుత్వం 'ఫోర్ లేబర్ కోడ్స్' ద్వారా నిర్వీర్యం చేస్తోంద"ని అన్నారు నటుడు, దర్శక నిర్మాత ఆర్.నారాయణమూర్తి. రాజ్యాంగం కల్పించిన పని హక్కు నేడు కాలరాస్తున్నారని.. రిజర్వేషన్లని కోల్పోతున్నామని.. ప్రభుత్వ సంస్థలన్నీ మూతపడుతున్నాయని.. ప్రైవేట్, విదేశీ కంపెనీల ఆధిపత్యం పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్, ఐటీ కంపెనీలు నిర్దిష్ట సమయపాలన లేకుండా యువతతో వెట్టి చాకిరీ చేయించుకుంటున్నాయని విమర్శించారు. ఆయన మంగళవారం హైదరాబాద్‌లో 'హుషారు 2' చిత్ర టీజర్ రిలీజ్ వేడుకలో పాల్గొన్నారు. విజయవంతమైన 'హుషారు' చిత్రానికి కొనసాగింపుగా శ్రీహర్ష కొనుగంటి తెరకెక్కించిన చిత్రమిది. అశోక్ గల్లా, రాహుల్ రామకృష్ణ, రవి ఆంటోని, దినేశ్ తేజ్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. రాహుల్ వర్మ నిర్మించారు. ఈ సినిమాలో ఆర్.నారాయణమూర్తి ఓ ప్రత్యేక పాత్ర పోషించారు. ఈ చిత్రం త్వరలో థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే తాజాగా టీజర్ విడుదల చేశారు. అనంతరం ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ.. "ఈ చిత్రంలో దర్శకుడు శ్రీహర్ష నాకు ఓ గొప్ప వేషం ఇచ్చారు. టీజర్ చూస్తుంటేనే మహదానందంగా అనిపించింది. 'హుషారు'లో శ్రీహర్ష ఎంతగా నవ్వించారో.. ఈ 'హుషారు 2'తో అంతగా నవ్విస్తూనే అందర్నీ ఆలోచింపజేస్తారు. నేటి సమాజంలోని నిరుద్యోగ సమస్యని దీంట్లో టచ్ చేశారు. సమాజానికి ఉపయోగపడేలా ఓ మంచి పని చేసే నలుగురి కుర్రాళ్లకు అండగా నిలిచే పాత్రలో నేను నటించా" అన్నారు. "నా నిజ జీవితంలోని కొన్ని వాస్తవ సంఘటనల్ని స్ఫూర్తిగా తీసుకుని చేసిన చిత్రమిది. స్నేహం కీలకంగా ఉంటుంది" అన్నారు దర్శకుడు శ్రీహర్ష. హీరో అశోక్ గల్లా మాట్లాడుతూ.. "హుషారు'తో పోల్చితే రెండింతల వినోదం, క్రేజీనెస్ ఉన్న చిత్రమిది" అన్నారు. ఈ కార్యక్రమంలో రాహుల్ రామకృష్ణ, రాహుల్ వర్మ, విధి యాదవ్, దినేశ్ తదితరులు పాల్గొన్నారు.



# పడమటవీధి జానకి

'మిరాయ్', 'కొరియన్ కనకరాజు' సినిమాలతో వరుస విజయాల్ని సొంతం చేసుకున్న రితికానాయక్ పడమటవీధి జానకి పాత్రలో సందడి చేయనున్నారు. ఆమె 'పవర్ పేట'లో కథానాయికగా నటిస్తున్నారు. సందీప్‌కిషన్ కథానాయకుడిగా... కృష్ణచైతన్య దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మిస్తున్నారు. రితికానాయక్ పుట్టినరోజును పురస్కరించుకుని మంగళవారం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని విడుదల చేశారు. ఇందులో ఆమె పడమట వీధి జానకిగా సంప్రదాయం ఉట్టిపడే అందమైన పాత్రలో నటిస్తున్నట్టు తెలిపింది చిత్రబృందం. ప్రేమ, గౌరవం, రాజకీయాలతో ముడిపడిన ఈ చిత్రంలో కథానాయకుడు సందీప్‌కిషన్... సేనాపతి రవి పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, ఛాయాగ్రహణం: మది, కూర్పు: శ్రీకర్‌ప్రసాద్, ప్రొడక్షన్ డిజైన్: రామకృష్ణ, మోనికా.



## తెరపై 'ఈరా' మ్యాజిక్‌కు వేళాయే!

ప్రసవానంతరం కూడా కాలికి గజ్జెకట్టి ప్రదర్శన ఇచ్చి ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించిన.. ప్రముఖ జానపద కళాకారిణి విఠాబాయి జీవిత ప్రయాణాన్ని తెరపై కళ్లకు కట్టినట్టు చూపించబోతున్నట్టు 'ఈరా' చిత్ర టీజర్‌తో ఇటీవలే స్పష్టం చేసింది ఆ సినీబృందం. ఇందులో ప్రధాన పాత్రధారిగా బాలీవుడ్ అందాల తార శ్రద్ధా కపూర్ నటిస్తున్నారు. ఆగస్టులోనే విడుదల కావాల్సిన ఈ సినిమా వాయిదా పడి డిసెంబరు 4న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ బయోపిక్ ట్రైలర్ విడుదల తేదీని తాజాగా ఇన్‌స్టాలో అధికారికంగా ప్రకటించారు శ్రద్ధ. 'ఈ శుక్రవారం అసలు సిసలైన మ్యాజిక్ చూడబోతున్నారు. అద్భుతమైన దృశ్యం ఆవిష్కృతం కానుంది' అనే క్యాప్షన్‌ని పేర్కొన్నారు. ఈ మేరకు చీకటిలో కిక్కిరిసిన భారీ జనసమూహం లాంతర్లను పట్టుకుని ఆసక్తిగా నృత్యం కోసం ఎదురుచూస్తున్న వీడియోను పంచుకున్నారు.

# అందుకే రామాయణలో 'బ్రహ్మ' ఏఐ వాడాం: నితేశ్ తివారీ




భారతీయ సినీ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోన్న చిత్రం 'రామాయణం: రైజ్ ఆఫ్ ఏ లెజెండ్' . దీని డబ్బింగ్‌కు ఏఐ ఉపయోగించారని వార్తలు వస్తున్నాయి. దీనిపై చిత్ర దర్శకుడు నితేశ్ తివారీ స్పందించారు.లాస్ ఏంజెలెస్‌లోని అకాడమీ మ్యూజియం ఆఫ్ మోషన్ పిక్చర్స్‌లో ఈ చిత్ర ప్రపంచ ప్రీమియర్ సందర్భంగా దర్శకుడు ఈ విషయంపై క్లారిటీ ఇచ్చారు. "సినిమాను ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు తమకు నచ్చిన భాషలో చూసేందుకు ఏఐ సాయపడుతుంది. అయితే, డబ్బింగ్ వాయిస్‌లను మాత్రం నిజమైన డబ్బింగ్ ఆర్టిస్టులే అందించారు. పెదవుల కదలికలు సంభాషణలకు సరిపోయేలా చేయడానికే 'బ్రహ్మ' ఏఐని ఉపయోగించాం. డబ్బింగ్ కోసం ఏఐని వాడలేదు" అని నితేశ్ స్పష్టం చేశారు.ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయిపల్లవి సీతాదేవిగా, యశ్ రావణుడిగా నటిస్తున్నారు. సన్నీ దేవోల్ హనుమంతుడి పాత్రలో కనిపించనున్నారు. హన్స్ జిమ్మర్, ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. నవంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.



## సాక్షాత్తు హనుమంతుడే.. స్నేహితుడైతే!

ఎలాంటి అంచనాలు ల్లకుండా ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చి సరికొత్త రికార్డులు సృష్టించింది హిందీ సినిమా 'హనుమాన్ అంశ్'. తాజాగా మరో భక్తిరస చిత్రాన్ని తీసుకురాబోతున్నట్టు ఇన్‌స్టాలో ఓ పోస్టర్‌తో అధికారికంగా ప్రకటించింది ప్రముఖ బాలీవుడ్ నిర్మాణ సంస్థ మహావీర్ జైన్ ఫిల్మ్స్. 'మేరా యార్ బజరంగీ' అనే టైటిల్‌తో రాబోతున్న ఈ సినిమాలో నటుడు రవికిషన్ ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. అమిత్ ఆర్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. "ఈ చిత్రం పౌరాణికంలా కాకుండా ఒక సామాన్యుడికి, దేవుడికి మధ్య ఉన్న స్నేహం నేపథ్యంలో రూపొందుతోంది. ఒక వ్యక్తి స్వచ్ఛమైన స్నేహం కోసం ఎదురుచూస్తున్న తరుణంలో సాక్షాత్తు హనుమంతుడే అతనికి స్నేహితుడైతే ఎలా ఉంటుందనే కథాంశంతో తీర్చిదిద్దుతున్నార"ని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమా వచ్చే ఏడాది దీపావళికి థియేటర్లలో విడుదల కానుంది.

# 'ఆదర్శ కుటుంబం'తో సిక్సర్లు.. సెంచరీలు కొడతాం: వెంకటేశ్

"వినోదం.. సూపర్ థ్రిల్.. సస్పెన్స్.. ఎమోషన్స్ అన్నీ ఉన్న అద్భుతమైన స్క్రిప్ట్ 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం:47" అన్నారు కథానాయకుడు వెంకటేశ్. ఇది తనకి ఎంతో ప్రత్యేకమైన చిత్రమని.. దీనితో తాము స్టేడియం బయటకు సిక్సర్లు కొడతామని ధీమా వ్యక్తం చేశారు. ఆయన.. శ్రీనిధి శెట్టి జంటగా నటించిన ఈ చిత్రాన్ని త్రివిక్రమ్ తెరకెక్కించిన సంగతి తెలిసిందే. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ నిర్మించారు. నారా రోహిత్, నివేదా పేతురాజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ నెల 30న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు.ఈ సందర్భంగా కథానాయకుడు వెంకటేశ్ మాట్లాడుతూ. "దాదాపు 25ఏళ్ల తర్వాత నేను.. త్రివిక్రమ్ కలిసి చేసిన చిత్రమిది. 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' లాంటి చిత్రాల తర్వాత మేమిద్దరం కలిసి చేస్తున్నామంటే ఎలాంటి కథతో రావాలన్నది మాకే ఓ సవాల్. కానీ, దర్శకుడు త్రివిక్రమ్ అన్ని రకాల కమర్షియల్ హంగులతో.. కామెడీతో పాటు సూపర్ థ్రిల్, సస్పెన్స్, ఎమోషన్స్ అన్నీ ఉండేలా ఇంత అద్భుతమైన స్క్రిప్ట్ తీసుకొచ్చినప్పుడు చాలా ఆనందంగా అనిపించింది. ఇది కచ్చితంగా అందరికీ నచ్చుతుంది. అందరూ దీన్ని చాలా ఎంజాయ్ చేస్తారు. నేను 'రాజా', 'సూర్యవంశం', 'ప్రేమించుకుందాం రా', 'కలిసుందాం రా'.. ఇలా ఫ్యామిలీ సినిమాలు చేశా. కానీ, ఇది మాత్రం నాకు చాలా ప్రత్యేకం. ఏం జరిగినా సరే నా వాళ్లని కాపాడుకోవాలి.. కాపాడుకుంటాను అన్నదే ఈ 'ఆదర్శ కుటుంబం'. అక్కడ మన ఇండియన్ టీమ్ తరఫున అభిషేక్, వైభవ్, తిలక్, నితీశ్, శాంసన్ సిక్సర్లు కొట్టడం కాదు.. ఈ సినిమాతో మేము స్టేడియం బయటకి సిక్సర్లు కొడతాం. సెంచరీలు కొడతాం" అన్నారు."ఇది పాటల సినిమా కాదు.. మాటల సినిమా. ప్రేక్షకులతో చాలా మాట్లాడుతుంది. ఇది కచ్చితంగా బ్లాక్‌బస్టర్ అవుతుంది" అన్నారు సంగీత దర్శకుడు తమన్. దర్శకుడు త్రివిక్రమ్ మాట్లాడుతూ.. "రచయితగా నా సినీ ప్రయాణం వెంకటేశ్ 'పవిత్ర బంధం' చిత్రంతోనే ప్రారంభమైంది. ఒకరకంగా నాతో ఓనమాలు దిద్దించింది ఆయనే. 'నువ్వు నాకు నచ్చావ్'తో నా కెరీర్‌ని మలుపు తిప్పారు. అందుకు ఆయనకి కృతజ్ఞతలు. కుటుంబ కథా చిత్రాలతో సూపర్ స్టార్ అవ్వొచ్చని నిరూపించింది వెంకటేశే. ఫ్యామిలీనే ఆయన మాస్. ఆయన బలం. ఇప్పుడున్న పరిస్థితుల్లో కుటుంబమే ఓ పద్మవ్యూహం. అందులోకి అభిమన్యుడిలా వెళ్లి తిరిగి రావడం తెలియక చనిపోతారా? అర్జునుడిలా వెళ్లి.. గెలిచి విజయగర్వంతో బయటకొస్తారా? అనేది ఈ చిత్రం మనకి చెప్తుంది.తమ కుటుంబాన్ని కాపాడుకోవడానికి చిట్టిబాబు, స్వర్ణ, సంపూర్ణ, సర్వ అనే ఓ నలుగురు మనుషులు ఎంత కష్టపడ్డారు.. ఎంత దూరం వెళ్లారు.. ఓ సామాన్యుడు తెగిస్తే ఎంత దూరం ట్రావెల్ చేయగలడు అనేదే ఈ చిత్ర కథ. ఈ చిత్రం ఇంత గొప్పగా నిలబడటానికి తమన్ తన సంగీతంతో ఓ గోడలా నిలబడ్డాడు. ఇంటర్వెల్‌లో ఫైట్ మాస్టర్ కెవిన్ విశ్వరూపాన్ని చూస్తారు" అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్. రాధాకృష్ణ, శ్రీనిధి, నివేద, బ్రహ్మాజీ, మాస్టర్ ప్రజ్వల్, యువీనా, కెవిన్, భాను తదితరులు పాల్గొన్నారు.



శ్రీనిధి శెట్టి, వెంకటేశ్, త్రివిక్రమ్, ఎస్. రాధాకృష్ణ, తమన్, నివేదా పేతురాజ్

తెలంగాణ ట్రైనెట్ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
సాంస్కృతికం


# ప్రభుత్వ ఉద్యోగులు ఏఐ పై అవగాహన పెంపొందించుకోవాలి

**ప్రభుత్వ ఉద్యోగులు ఆధునిక సాంకేతికతలో అప్‌డేట్ కావాలి**
**ఏఐతో ప్రజలకు వేగవంతమైన, మెరుగైన సేవలు అందించాలి**
**కార్యాలయాల్లో ఆదా అయ్యే సమయం ప్రజలకు తిరిగి అందాలి**
**'ఏఐ సాక్షమ్' ప్రారంభోత్సవంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**




**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 28:**
మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరూ కృత్రిమ మేధస్సు (ఏఐ)పై అవగాహన పెంపొందించుకుని, తమ రోజువారీ విధుల్లో సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ప్రణాళికా శాఖ, టీజీ మ్యాథ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు అందిస్తున్న ఏఐ శిక్షణను సద్వినియోగం చేసుకుని, ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఏఐ వినియోగం వల్ల ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు వేగవంతం కావడంతోపాటు, సామాన్య ప్రజల సమస్యలు సకాలంలో పరిష్కారం కావాలి. కార్యాలయాల్లో ఆదా అయ్యే సమయం ప్రజలకు మెరుగైన సేవల రూపంలో తిరిగి అందాలి. ప్రజల జీవితాల్లో కనిపించే సానుకూల మార్పే ఏఐ వినియోగానికి అసలైన గీటురాయి అని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో ప్రణాళికా శాఖ సహకారంతో టీజీ మ్యాథ్ చేపట్టిన 'ఏఐ సాక్షమ్' కార్యక్రమాన్ని ఉప ముఖ్యమంత్రి ప్రారంభించి ప్రసంగించారు. ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాలను పెంపొందించి, పరిపాలనా వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమ ఉద్దేశమని తెలిపారు. సాంకేతికతలో వస్తున్న మార్పులను ఉద్యోగులు ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలని, శిక్షణ ద్వారా నేర్చుకున్న నైపుణ్యాలను ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు ఉపయోగించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో రోజువారీగా నిర్వహించే పనులను మరింత వేగంగా, సమర్థంగా పూర్తి చేసేందుకు ఏఐ సాధనాలు ఉపయోగపడతాయని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులను గుర్తించడం, నివేదికలను రూపొందించడం, సమాచారాన్ని విశ్లేషించడం, ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో వివరాలు అందించడం వంటి పనుల్లో ఏఐ ద్వారా సమయం ఆదా చేయవచ్చన్నారు. శిక్షణలో ఉద్యోగులు చురుగ్గా పాల్గొని, తమ విధులకు అనుగుణంగా ఏఐ సాధనాలను ఉపయోగించే పద్ధతులను నేర్చుకోవాలని కోరారు.

?ఒక రైతు దరఖాస్తు త్వరగా పరిష్కారం కావడం, పింఛనుదారుడికి తనకు అందాల్సిన ప్రయోజనాలపై స్పష్టమైన సమాచారం లభించడం, ఒక పౌరుడు తన పని కోసం పదేపదే ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం తగ్గడం వంటి మార్పులు సాంకేతికత వినియోగం ద్వారా సాధ్యపడాలని పేర్కొన్నారు. ఉద్యోగులు ఆదా చేసిన సమయాన్ని ప్రజల సమస్యలను మరింత శ్రద్ధగా పరిశీలించేందుకు, సేవల నాణ్యతను పెంచేందుకు వినియోగించాలని సూచించారు.

**ఆర్థిక, ప్రణాళికా రంగాల్లో మెరుగైన ఫలితాలు**
ప్రజాధనం వినియోగాన్ని విశ్లేషించడం, ప్రాజెక్టుల వ్యయాలను పోల్చడం, పనుల అమలులో జాప్యాలకు కారణాలను గుర్తించడం వంటి అంశాల్లో ఏఐ ఆధారిత సాధనాలు అధికారులకు సహాయపడగలవని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ప్రభుత్వ వనరులను సమర్థంగా వినియోగించుకోవడానికి, అభివృద్ధి కార్యక్రమాల అమలును మెరుగ్గా పర్యవేక్షించడానికి ఈ సాంకేతికతను ఉపయోగించుకోవచ్చన్నారు. ప్రణాళికా రంగంలో వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ సేవలు ఎలా అందుతున్నాయో విశ్లేషించడం, సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన వారందరికీ చేరుతున్నాయా అనే అంశాలను పరిశీలించడం ద్వారా మెరుగైన ప్రణాళికలు రూపొందించవచ్చని తెలిపారు. గణాంకాలతోపాటు క్షేత్రస్థాయి పరిస్థితులు, ప్రజల అనుభవాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

**విద్యుత్ రంగంలోనూ ఏఐతో ప్రయోజనాలు**
విద్యుత్ డిమాండ్‌ను ముందుగానే అంచనా వేయడం, పరికరాల్లో తలెత్తే లోపాలను గుర్తించడం, నిర్వహణ చర్యలను మెరుగుపరచడం వంటి అంశాల్లో ఏఐ ఉపయోగపడుతుందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించడం ద్వారా విద్యుత్ నిర్వహణను మెరుగుపరిచి, రైతులు, పరిశ్రమలు, ఆసుపత్రులకు నాణ్యమైన సేవలు అందించేందుకు అవకాశాలు పెరుగుతాయని తెలిపారు.

ఏఐ సాధనాలను ఉపయోగించే సమయంలో సమాచార భద్రత, కచ్చితత్వం, బాధ్యతకు ప్రాధాన్యమివ్వాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అనుమతి లేని సాధనాల్లో అధికారిక లేదా వ్యక్తిగత సమాచారాన్ని నమోదు చేయరాదన్నారు. ఏఐ రూపొందించిన సమాచారాన్ని అధికారిక రికార్డుల్లో చేర్చే ముందు, నిర్ణయాలకు ఆధారంగా ఉపయోగించే ముందు అధికారులు ధ్రువీకరించాలని సూచించారు. సాంకేతికత సహాయంతో పనులు నిర్వహించినప్పటికీ తుది నిర్ణయాలు, వాటికి సంబంధించిన బాధ్యత అధికారులదేనని పేర్కొన్నారు.ప్రతి శాఖలో ఏఐ వినియోగానికి అనువైన పనులను గుర్తించి, ముందుగా ప్రయోగాత్మకంగా అమలు చేయాలని సూచించారు. ఫలితాలను పరిశీలించి, ప్రజలకు కలిగే ప్రయోజనం, పనితీరు, కచ్చితత్వం ఆధారంగా విస్తరణ చేపట్టాలని తెలిపారు.ప్రణాళికా శాఖ, టీజీ మ్యాథ్ ఆధ్వర్యంలో అందిస్తున్న ఈ శిక్షణను ప్రభుత్వ ఉద్యోగులందరూ ఒక అవకాశంగా భావించి సద్వినియోగం చేసుకోవాలని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై నిరంతరం అవగాహన పెంపొందించుకుంటూ, నేర్చుకున్న నైపుణ్యాలను విధుల్లో ఆచరణాత్మకంగా వినియోగించాలని కోరారు. మరింత సమర్థులైన ఉద్యోగులు, వేగవంతమైన ప్రభుత్వ సేవలు, ప్రజలకు మెరుగైన ఫలితాలు---ఇదే 'ఏఐ సాక్షమ్' కార్యక్రమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్లానింగ్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్, డిప్యూటీ సీఎం సెక్రటరీ, ట్రాన్స్కో సీఎండీ కృష్ణ భాస్కర్, టీజీ మ్యాథ్ ఎండీ పూజ, ఎంసీఆర్ హెచ్‌ఆర్డీ డైరెక్టర్ జనరల్ శాంతి కుమారి తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో కరువు పరిస్థితుల నేపథ్యంలో పుట్టినరోజు వేడుకలకు దూరంగా ఉండాలని మంత్రి పొంగులేటి నిర్ణయం

**బొకేలు, శాలువాలు, స్వీట్స్‌తో వచ్చి శుభాకాంక్షలు తెలపవద్దు**
**భిమానులు, శ్రేయోభిలాషులు ఎక్కడా ఆర్భాటాలకు తావివ్వవద్దు**
**ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా నిరాడంబరంగా పుట్టినరోజు**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 28:**



రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో నెలకొన్న కరువు పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన పుట్టినరోజు వేడుకలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు.
రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో తన అభిమానులు, శ్రేయోభిలాషులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎవరూ బొకేలు, శాలువాలు, స్వీట్స్‌తో వచ్చి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేయవద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు. అలాగే తన పుట్టినరోజు సందర్భంగా ఎక్కడా ఎలాంటి ఆర్భాటాలు, వేడుకలు నిర్వహించవద్దని, అనవసర ఖర్చులకు దూరంగా ఉండాలని కోరారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సంయమనం పాటించాలని, తన పుట్టినరోజును నిరాడంబరంగా గడపాలని నిర్ణయించుకున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. తనపై అభిమానంతో శుభాకాంక్షలు తెలియజేయాలనుకునే వారంతా ఈ నిర్ణయాన్ని గౌరవించి సహకరించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు.

# ఉపాధి హామీ నిధులతో గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం: మంత్రి సీతక్క




**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 28:**
గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు, ఉపాధి హామీ పథకం ద్వారా కల్పిస్తున్న ఉపాధి అవకాశాలపై మంత్రి సీతక్క పలు జిల్లాల సర్పంచులతో అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఉపాధి హామీ నిధులను సమర్థవంతంగా వినియోగించి అభివృద్ధి పనులను పూర్తి చేసిన సర్పంచులను అభినందించారు. వారిని ఆదర్శంగా తీసుకుని ఇతర సర్పంచులు కూడా గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఉపాధి హామీ బిల్లులు 15 రోజుల్లో వస్తాయని, ఈ నిధులను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి ఆదేశించారు. గ్రామాల్లో వర్క్‌షెడ్లు, పశువుల షెడ్లు, కమ్యూనిటీ హాళ్ల వంటి నిర్మాణాలు చేపట్టవచ్చని తెలిపారు. ఒక్కో గ్రామానికి రూ.50 లక్షల నుంచి కోటి రూపాయల వరకు నిధులు వచ్చే అవకాశం ఉన్నందున వాటిని ప్రణాళికాబద్ధంగా వినియోగించి గ్రామాలను అభివృద్ధి చేయాలని సూచించారు. అలాగే నీటి వృథాను అరికట్టేందుకు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని సర్పంచులకు మంత్రి సీతక్క సూచించారు.

# మోడల్ పోలీసింగ్‌లో ఏఐ టెక్నాలజీ వినియోగం

**పైలెట్ ప్రాజెక్టుగా పంజాగుట్ట మోడల్ పోలీస్ స్టేషన్ ఎంపిక**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్,**
అక్టోబర్ 28: మోడల్ పోలీసింగ్‌లో భాగంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతిక పరిజ్ఞానాన్ని పోలీసు సేవల్లో వినియోగించేందుకు పంజాగుట్ట మోడల్ పోలీస్ స్టేషన్‌ను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఇందులో భాగంగా ఫిర్యాదుదారులకు మరింత సులభంగా, సౌకర్యవంతంగా పోలీసు సేవలు అందించేందుకు రూపొందించిన 'సేతు' యాప్ పనితీరును ఖైరతాబాద్ జోన్ డీసీపీ శిల్పవల్లి పరిశీలించారు. యాప్ నిర్వహణ బాధ్యతలు చేపట్టిన నిర్వాహకులను అడిగి దాని పనివిధానం, ఉపయోగాల గురించి వివరాలు తెలుసుకున్నారు. చదువురాని వారు సైతం ఎలాంటి సంకోచం లేకుండా తమ సమస్యలను పోలీసులకు తెలియజేసి ఫిర్యాదు నమోదు చేసుకునేలా ఈ అధునాతన సాంకేతిక విధానాన్ని రూపొందించారు. ఈ విధానంలో ఫిర్యాదుదారులు కాగితాలు ఉపయోగించాల్సిన అవసరం లేకుండా, ఫిర్యాదు నమోదు చేసే యంత్రం ముందు నిలబడి తమ వివరాలను నమోదు చేయాలి. అనంతరం యంత్రం టోకెన్‌ను జనరేట్ చేస్తుంది. ఆ తర్వాత సుమారు 30 సెకన్ల వ్యవధిలో ఫిర్యాదుదారులు తమ ఫిర్యాదు వివరాలను వీడియో రికార్డింగ్ రూపంలో నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తుంది. ఈ రికార్డింగ్ ఆధారంగా ఫిర్యాదు సంబంధిత అడ్మిన్ ఆఫీసర్‌తో పాటు సంబంధిత సెక్టార్ సబ్‌ఇన్‌స్పెక్టర్ (ఎస్‌ఐ)కు చేరుతుంది. కాగితాల అవసరం లేకుండా, సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో ఫిర్యాదులను నమోదు చేసి సంబంధిత అధికారులకు చేరవేసేలా ఈ వ్యవస్థ పనిచేస్తుందని పోలీసులు తెలిపారు. పోలీసు సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు, ఫిర్యాదుల నమోదు ప్రక్రియను సరళతరం చేయడం ఈ పైలెట్ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

# ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించటమే లక్ష్యంగా పనిచేశాం

**అధికార యంత్రాంగం, సిబ్బంది వేగంగా స్పందించారు**
**బాధితులకు తక్షణ ఆర్థిక సహాయం అందిస్తాం**
**తుఫాన్ నష్టంపై కేంద్రానికి రేపు ప్రాథమిక నివేదిక**
**సహాయక చర్యల్లో సాంకేతికతతో సత్ఫలితాలు**
**-ఆర్టీజీఎస్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబు**



**అమరావతి, ట్రైనెట్ న్యూస్,**
అక్టోబరు 28: అర్నబ్ తుఫాను ప్రభావాన్ని ముందుగానే అంచనా వేస్తూ, మూడు రోజుల్లో ఏడు సమీక్షలు నిర్వహించి, అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాన్ని గణనీయంగా తగ్గించ గలిగామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. రియల్ టైమ్ గవర్నెన్స్ సెంటర్ ద్వారా తుఫాను గమనాన్ని నిరంతరం పర్యవేక్షించడంతో పాటు, జిల్లా కలెక్టర్లు, క్షేత్రస్థాయి అధికారులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించామని చెప్పారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు ప్రభుత్వం విశ్రాంతి తీసుకోదని స్పష్టం చేశారు. రియల్ టైమ్ గవర్నెన్స్ సెంటర్ నుంచి నిర్వహించిన మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. తుఫాను కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలకు అత్యంత ప్రాధాన్యమిచ్చామని తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల వరకు అధికారులు, సిబ్బంది రాత్రింబవళ్లు పనిచేశారని పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు, షెల్టర్ క్యాంపులకు తరలించడంతో పాటు, వారికి అవసరమైన సదుపాయాలు కల్పించామని చెప్పారు. రెస్క్యూ, రిలీఫ్ కార్యక్రమాలు పూర్తిస్థాయిలో కొనసాగుతున్నాయని సీఎం తెలిపారు. పంట నష్టాన్ని మినహాయించి, ఇతర నష్టాలకు సంబంధించి అర్హులైన బాధితులకు గురువారం నుంచే ఆర్థిక సాయం అందించేలా చర్యలు చేపడతామని చెప్పారు. ఈ అంశంపై గురువారం వర్చువల్ కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. తుఫాను వల్ల జరిగిన నష్టంపై ప్రాథమిక అంచనాలను కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు. ఈ మేరకు కేంద్రానికి లేఖ రాయడంతో పాటు కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో ఫోన్‌లో మాట్లాడి తుఫాను తీవ్రత, రాష్ట్రంపై దాని ప్రభావాన్ని వివరించినట్లు చెప్పారు. కొబ్బరి, ఇతర ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లిందని, సమగ్ర నష్ట నివేదికను కూడా త్వరలోనే కేంద్రానికి పంపిస్తామని వెల్లడించారు.

**సాంకేతికతతో కచ్చితమైన అంచనాలు**
తుఫాను ప్రభావంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేల కూలాయని, పలు ప్రాంతాల్లో ఆస్తి నష్టం జరిగిందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 15 వేల విద్యుత్ స్తంభాలు కూలిపోయినట్లు తెలిపారు. కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలు మినహా మిగతా జిల్లాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించామని పేర్కొన్నారు. ఈ రెండు జిల్లాల్లోనూ ఎల్లుండి సాయంత్రానికి విద్యుత్ సరఫరాను పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తామని వెల్లడించారు. రాష్ట్ర రహదారులు, రహదారుల పై రాకపోకలను బుధవారం రాత్రికే పునరుద్ధరణకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రభావిత ప్రాంతాల్లో తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో ఆహారం, ఔషధాలు అందించేందుకు డ్రోన్లను కూడా సిద్ధం చేశామని వివరించారు. గతంలో తుఫాను హెచ్చరికలు వచ్చినప్పుడు శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాల్సి వచ్చేదని సీఎం గుర్తుచేశారు. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో తుఫాను ప్రభావం ఏయే ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటుందో ముందుగానే గుర్తించి, అక్కడే అధికార యంత్రాంగాన్ని మోహరిస్తున్నామని వివరించారు. ప్రిడిక్షన్, యాక్యురెసీ, క్షేత్రస్థాయిలో అప్రమత్తత అనే విధానాలతో విపత్తును ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఐఎండీ సమాచారం, ఉపగ్రహ ఛాయాచిత్రాలను ఎప్పటికప్పుడు విశ్లేషిస్తూ తుఫాను గమనాన్ని అంచనా వేశామని చెప్పారు. సముద్రంలో నెలకొన్న వివిధ వాతావరణ పరిస్థితుల కారణంగా తుఫాను ఏపీ తీరంపై సుమారు 10 గంటలపాటు నిలిచిపోయిందని, తీరం దాటే సమయంలో గరిష్ఠంగా గంటకు 150 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయని వెల్లడించారు. సుమారు 30 వేల మంది క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందితో టెలి కాన్ఫరెన్సుల ద్వారా నిరంతరం సమన్వయం చేసుకున్నామని తెలిపారు.

**మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం**
తుఫాను ప్రభావంతో విశాఖపట్నంలో విద్యుత్‌పై చెట్టు కూలిన ఘటనలో ఇద్దరు, అనకాపల్లిలో ఒకరు, కోనసీమలో ఒకరు, భీమవరంలో మరొకరు ప్రాణాలు కోల్పోయారని ముఖ్యమంత్రి తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం అందిస్తామని ప్రకటించారు. తుఫాను కారణంగా ఇళ్లు, పంటలు, దుకాణాలు, ఇతర ఆస్తులు నష్టపోయిన వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ముఖ్యమంత్రి తెలిపారు. ముంపు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరిన బాధితులకు 25 కిలోల బియ్యం అందించాలని ఆదేశించినట్లు చెప్పారు. చేనేత కార్మికులు, మత్స్యకారులకు 50 కిలోల బియ్యంతో పాటు కిలో చొప్పున ఉల్లి, వంటనూనె, కందిపప్పు అందిస్తామని ప్రకటించారు. షెల్టర్ క్యాంపుల్లో ఆశ్రయం పొందిన వారికి రూ.1,000 చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. ఉద్యాన పంటలకు సంబంధించి అరటి పంటకు హెక్టారుకు రూ.35,000, టమాటాకు రూ.25,000 చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. పత్తి, చెరకు తదితర పంటలకు హెక్టారుకు రూ.25,000 చొప్పున సాయం అందించే అంశాన్ని వెల్లడించారు. ఇతర పంటలకు నష్టం కేటగిరీల వారీగా పరిహారం అందిస్తామని చెప్పారు. వ్యవసాయ, ఉద్యాన పంటల నష్టాన్ని ఎన్యుమరేషన్ ద్వారా అంచనా వేసి రైతులను ఆదుకుంటామని తెలిపారు.

**ప్రభావిత ప్రాంతంలో క్షేత్రస్థాయి పర్యటన**
అర్నబ్ తుఫాను కారణంగా రాష్ట్రంలో వర్షపాతం పెరిగిందని సీఎం తెలిపారు. రాష్ట్ర సగటు లోటు వర్షపాతం 39 శాతం నుంచి 27 శాతానికి తగ్గిందని చెప్పారు. విశాఖపట్నంలో 21 సెంటీమీటర్లు, విజయనగరంలో 18 సెంటీమీటర్లు, శ్రీకాకుళం జిల్లాలో 14 సెంటీమీటర్లు, కృష్ణా జిల్లాలో 9 సెంటీమీటర్ల మేర వర్షపాతం నమోదైందని వివరించారు. శ్రీకాకుళం నుంచి కృష్ణా జిల్లా వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయని పేర్కొన్నారు. వర్షపు నీటిని సమర్థంగా వినియోగించుకు నేందుకు ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేశామని, ఏ చెరువును నింపాలి, ఏ రిజర్వాయర్‌లోకి నీటిని మళ్లించాలన్న అంశాలపై కార్యాచరణ రూపొందించామని తెలిపారు. ముందస్తు చర్యలు, కాలువల్లో అడ్డంకులను తొలగించడం వల్ల రాష్ట్రవ్యాప్తంగా ఒక్క చెరువుకు కూడా గండి పడలేదని చెప్పారు. శ్రీకాకుళం, మన్యం జిల్లాల్లో మరికొంత వర్షం కురిసే అవకాశం ఉన్నందున అక్కడి ప్రజలను అప్రమత్తం చేశామని వెల్లడించారు. గత మూడు రోజులుగా నిరంతరం పనిచేసిన అధికారులు, జిల్లా కలెక్టర్లు, క్షేత్రస్థాయి సిబ్బందిని ముఖ్యమంత్రి అభినందించారు. తాను, అధికారులు, సిబ్బంది రాత్రంతా నిద్ర లేకుండా ప్రజలకు సేవలందించామని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన సూచనలను పాటిస్తూ ప్రజలు కూడా పూర్తిస్థాయిలో సహకరించారని పేర్కొన్నారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు అధికారులు క్షేత్రస్థాయిలోనే ఉండి సహాయక చర్యలను కొనసాగించాలని సూచించారు. గురువారం స్వయంగా ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి నష్టాన్ని పరిశీలిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. బాధితులకు వేగంగా సహాయం అందించి, ప్రజల్లో భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

ట్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
సాంస్కృతికం
మన సంస్కృతి.. మన గర్వం..



# ఉజ్వల ఆధ్వర్యంలో ఢిల్లీలో ప్లాటినం ఐకాన్ అవార్డ్స్--2026













**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్ ,అక్టోబర్ 28:**
బతుకమ్మ, దేవీ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని తెలంగాణ భాష సాంస్కృతి శాఖ సౌజన్యంతో ఉజ్వల కల్చరల్ ఆర్గనైజేషన్, శిఖరం ఆర్ట్స్ థియేటర్ సంయుక్త ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆడిటోరియంలో ఆధ్యాత్మిక రంగాలలో సేవలందించిన గురు స్వాములకు తెలంగాణ భవన్‌లో ప్లాటినం ఐకాన్ అవార్డ్స్--2026 ను అవార్డులను అందజేసి సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యాదగిరిగుట్ట ఆలయ ప్రధాన అర్చకులు శ్రీమాన్ భట్టార్ సురేంద్రాచార్యులు, ఢిల్లీ ఇన్ కమ్ టాక్స్ అధికారి, సినీ నటుడు డి. నాగేశ్వర రావు, ఎస్ఎస్ఎస్ డివోషనల్ గ్రూప్ చైర్మన్, ప్రముఖ జ్యోతిష్య నిపుణుడు డాక్టర్ శివ నరసింహం స్వామి తంత్రి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక రంగంలో సేవనందించిన వారిని గుర్తించి దేశ రాజధాని ఢిల్లీలో అవార్డులను అందజేయడం అభినందనీయమన్నారు. ప్రతి ఏటా ఢిల్లీలో ప్రముఖులను సన్మానించుకోవడం ఆనవాయితీగా వస్తుందని సంస్థ అధ్యక్షురాలు లక్మి తెలిపారు. శ్వేత నాట్య అకాడమీ అధ్యక్షురాలు డాక్టర్ కె . లక్ష్మీ శ్వేత , రిషిక కూచిపూడి నాట్య నిలయం అధ్యక్షురాలు రాజేశ్వరి గౌడ్ శిష్య బృందాలు ప్రదర్శించిన పలు నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాన్ని ఉజ్వల సంస్థ అధ్యక్షురాలు లక్ష్మీ సమన్వయం చేశారు.

# ట్రీటెడ్ వాటర్ వినియోగం తప్పనిసరి చేయాలి: సీఎం రేవంత్ రెడ్డి

**ఎస్‌టీపీలపై ప్రత్యేక పర్యవేక్షణ.. ఏఐ టెక్నాలజీతో నీటి శుద్ధి ప్లాంట్ల నిర్వహణ**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 28:**
భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా శుద్ధి చేసిన మురుగునీటి (ట్రీటెడ్ వాటర్) వినియోగాన్ని విస్తృతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నీటి నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని, భవిష్యత్తులో మంచి నీటి కొరత తలెత్తకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఎంసీఆర్ హెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో ఎస్‌టీపీలు (మురుగునీటి శుద్ధి ప్లాంట్లు), ట్రీటెడ్ వాటర్ వినియోగంపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శుద్ధి చేసిన నీటి వినియోగం, ప్లాంట్ల నిర్వహణ, పర్యవేక్షణ, నీటి సరఫరా వ్యవస్థలను మరింత సమర్థంగా నిర్వహించేందుకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

**ఏఐ సాంకేతికతతో ప్లాంట్ల పర్యవేక్షణ**
ట్రీటెడ్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నిర్వహణలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతను వినియోగించాలని సీఎం సూచించారు. ప్రతి ప్లాంట్ వద్ద ప్రత్యేక అధికారిని నియమించాలని, అన్ని ప్లాంట్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానించాలని ఆదేశించారు. ప్లాంట్ల పనితీరు, నీటి నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు.
అలాగే, ఈ ప్లాంట్ల నిర్వహణ, పర్యవేక్షణలో హైడ్రా భాగస్వామ్యాన్ని కల్పించాలని సూచించారు. ట్రీటెడ్ వాటర్‌ను సరఫరా చేసే ట్యాంకర్లను ట్రాక్ చేసే వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పాటు, ప్రజలకు సులభంగా శుద్ధి చేసిన నీరు అందుబాటులో ఉండేలా టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు



చేయాలని ఆదేశించారు.

**ప్రభుత్వ కార్యాలయాల్లో 100 శాతం ట్రీటెడ్ వాటర్**
ప్రభుత్వ కార్యాలయాల్లో తాగునీరు కాని ఇతర అవసరాల కోసం సాధ్యమైనంత మేరకు కాకుండా, నిర్దేశించిన మేరకు 100 శాతం ట్రీటెడ్ వాటర్‌ను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి తప్పనిసరి నిబంధనలు రూపొందించి ఆదేశాలు జారీ చేయాలని సూచించారు. సచివాలయం, ముఖ్యమంత్రి కార్యాలయ పరిసరాల్లోని ల్యాండ్‌స్కేపింగ్‌తో పాటు పబ్లిక్ పార్కుల్లోనూ శుద్ధి చేసిన నీటినే వినియోగించాలని తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని ల్యాండ్‌స్కేపింగ్, ఇతర ప్రాంతాల్లో రోడ్ల శుభ్రత వంటి పనులకు కూడా ట్రీటెడ్ వాటర్‌ను ఉపయోగించాలని ఆదేశించారు. ఈ విధానాన్ని రైల్వే శాఖ, మెట్రో రైల్ విభాగాలకు కూడా విస్తరించాలని సూచించారు. భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేసే సమయంలోనే ట్రీటెడ్ వాటర్ వినియోగానికి సంబంధించిన నిబంధనలను విధించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు.

**డేటా సెంటర్లకు ట్రీటెడ్ వాటర్ సరఫరా**
పెరుగుతున్న పారిశ్రామిక, పట్టణ అవసరాలను దృష్టిలో ఉంచుకుని డేటా సెంటర్లకు కూడా ట్రీటెడ్ వాటర్ సరఫరా చేసే అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. ప్రైవేట్ ఎస్‌టీపీల ఏర్పాటును ప్రోత్సహించాలని, ట్రీటెడ్ వాటర్ ప్లాంట్లను సౌర విద్యుత్తుతో నిర్వహించే అవకాశాలను అధ్యయనం చేయాలని ఆదేశించారు.
శుద్ధి చేసిన నీటి వినియోగంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, ఈ నీటి లభ్యత, వినియోగ విధానాలపై ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. నిర్ణయించిన గడువులోగా ఆదేశాలు అమలయ్యేలా అధికారులు కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు.

**మంచి నీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ**
రాష్ట్రంలో భవిష్యత్తులో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. మంచి నీటి సరఫరాపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని హెచ్చరించారు. అవసరాలకు అనుగుణంగా నీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవడంతో పాటు, శుద్ధి చేసిన నీటిని ఇతర అవసరాలకు మళ్లించడం ద్వారా మంచి నీటిపై ఒత్తిడిని తగ్గించాలని సూచించారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, టీజీఎస్‌పీడీసీఎల్ ఎండీ జితేష్ వి. పాటిల్, కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి రవి, సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

**షెడ్యూల్ ప్రకారం పనులు పూర్తి చేయాలి.. అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలు**



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్,**
అక్టోబర్ 28: గోషామహల్‌లో నూతనంగా నిర్మితమవుతున్న ఉస్మానియా జనరల్ ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన, పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. షెడ్యూల్ ప్రకారం పూర్తికావాల్సిన పనుల్లో జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.
ఈ పర్యటనలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ మీర్జా రియాజ్ ఉల్ హుసేన్, జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలా, మెట్టు సాయి కుమార్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి మోడల్ డిజైన్లను పరిశీలించిన మంత్రి, నిర్మాణ ప్రాంతంలోని పలు బ్లాక్‌లను సందర్శించి పనుల తీరును సమీక్షించారు.

**పనుల పురోగతిపై సమీక్ష**
నిర్మాణ పనులకు సంబంధించి నిర్ణయించిన షెడ్యూల్, ఇప్పటివరకు పూర్తయిన పనుల వివరాలను మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొన్ని పనులు నిర్దేశిత షెడ్యూల్‌తో పోలిస్తే వెనుకబడి ఉన్న నేపథ్యంలో, ఇకపై ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని స్పష్టం చేశారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు పలు సూచనలు చేశారు. ఆసుపత్రి నిర్మాణానికి సంబంధించి వివిధ బ్లాక్‌ల పురోగతిని పరిశీలించిన మంత్రి, పనుల నిర్వహణలో సమన్వయం పెంచుకోవాలని, నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ముందుకు సాగాలని సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను సకాలంలో సిద్ధం చేయడంపై దృష్టి సారించాలని అధికారులకు తెలిపారు.

**రూ.2,700 కోట్లతో 2,000 పడకల ఆసుపత్రి**
ఉస్మానియా జనరల్ ఆసుపత్రి నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. దాదాపు రూ.2,700 కోట్ల వ్యయంతో, 2,000 పడకల సామర్థ్యంతో నిర్మితమవుతున్న ఈ ఆసుపత్రి భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా, చరిత్రలో నిలిచిపోయే స్థాయిలో రూపుదిద్దుకుంటోందని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఈ ఆసుపత్రి కీలక పాత్ర పోషించనుందని పేర్కొన్న మంత్రి, నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత సమయంలో పూర్తి చేసేందుకు అధికారులు సమష్టిగా కృషి చేయాలని ఆదేశించారు. ఆసుపత్రి నిర్మాణంలో పురోగతిని నిరంతరం సమీక్షిస్తూ, పనులు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# ప్రత్యేక రైళ్లు నిరాకరించినా ఢిల్లీ ర్యాలీకి వెళ్లి తీరుతాం

**దక్షిణాది నేతలను అడ్డుకునేందుకు కుట్ర.. మోదీ ఫాసిస్టు పాలనకు నూకలు చెల్లాయి: టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 28:**
ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నవంబర్ 1న కాంగ్రెస్ పార్టీ నిర్వహించనున్న మెగా ర్యాలీలో పాల్గొని తీరుతామని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ప్రత్యేక రైళ్లు కేటాయించకపోయినా, ఎన్ని అవాంతరాలు ఎదురైనా ఢిల్లీకి వెళ్లి నిరసన గళాన్ని వినిపిస్తామని ప్రకటించారు. మోదీ ఫాసిస్టు పాలనకు నూకలు చెల్లాయని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని పేర్కొన్నారు.



గత రెండు, మూడు నెలలుగా ఇండియా కూటమి ఆధ్వర్యంలో ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ క్రమంలో నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న మెగా ర్యాలీని విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ శ్రేణులు సిద్ధమవుతున్నాయని చెప్పారు. తెలంగాణ నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ర్యాలీలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

**ప్రత్యేక రైళ్ల కోసం ఎంపీల విజ్ఞప్తి**
ర్యాలీకి వెళ్లేందుకు ప్రత్యేక రైళ్లు కేటాయించాలని కాంగ్రెస్ ఎంపీలు అనిల్ యాదవ్, మల్లు రవి రైల్వే అధికారులను కోరినట్లు మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు. ఇందుకోసం సంబంధిత జనరల్ మేనేజర్‌కు దరఖాస్తు చేసినప్పటికీ, ఆరు రోజుల పాటు కాలయాపన చేసి చివరి నిమిషంలో ప్రత్యేక రైళ్లు కేటాయించడం సాధ్యం కాదని చెప్పారని ఆరోపించారు.
ర్యాలీకి హాజరయ్యే కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ఇబ్బందులు కలిగించే ఉద్దేశంతోనే ప్రత్యేక రైళ్లను నిరాకరించారని ఆయన విమర్శించారు. రైళ్ల కేటాయింపు కోసం వెళ్లిన సమయంలో పోలీసుల ప్రవర్తన కూడా దురుసుగా ఉందని ఆరోపించారు.

**దక్షిణాది నేతలను అడ్డుకునే కుట్ర**
ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సూచనల మేరకే ప్రత్యేక రైళ్ల కేటాయింపును నిరాకరిస్తున్నారని మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాల నాయకులు ఢిల్లీలో జరిగే ర్యాలీకి వెళ్లకుండా అడ్డుకునే కుట్ర జరుగుతోందని విమర్శించారు. అయితే, ఎన్ని అడ్డంకులు సృష్టించినా కాంగ్రెస్ పార్టీ వెనక్కి తగ్గబోదని స్పష్టం చేశారు.

**ర్యాలీకి జన సమీకరణపై కాంగ్రెస్ దృష్టి**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఢిల్లీ ర్యాలీకి జన సమీకరణ చేపట్టేందుకు కాంగ్రెస్ నాయకులు సన్నాహాలు చేస్తున్నారని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. ప్రత్యేక రైళ్లు అందుబాటులో లేకపోయినా ప్రత్యామ్నాయ మార్గాల్లో ఢిల్లీకి చేరుకుని నిరసన కార్యక్రమంలో పాల్గొంటామని చెప్పారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ, కేంద్ర ప్రభుత్వ విధానాలపై నిరసన వ్యక్తం చేయడమే లక్ష్యంగా ఢిల్లీలో జరిగే మెగా ర్యాలీలో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొంటాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఎలాంటి అవాంతరాలు ఎదురైనా ఢిల్లీలో నిరసన గళం వినిపించి తీరుతామని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

# కరువును ఎదుర్కొనేందుకు అఖిలపక్ష సూచనల మేరకు చర్యలు

**ప్రకృతి విపత్తును అధిగమించేందుకు సానుకూల, నిర్మాణాత్మక వైఖరి**
**తెలంగాణ రాష్ట్రం, రైతుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది**
**మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టీకరణ**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 28:**
కరువు పరిస్థితులను అధిగమించేందుకు తెలంగాణ ప్రభుత్వం సానుకూల, నిర్మాణాత్మక దృక్పథంతో ముందుకు సాగుతుందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భరోసా ఇచ్చారు. అంతర్రాష్ట్ర నదీజలాల అంశాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను, రాష్ట్ర రైతుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడారు.
ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి సీతక్క, వాకిటి శ్రీహరి, చీఫ్ సెక్రటరీ సంజయ్ జాజు, ఎల్‌నినో నోడల్ అధికారి రామకృష్ణారావు హాజరయ్యారు. ప్రస్తుతం నెలకొన్న ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం లోటు, కరువు పరిస్థితులు, వాటివల్ల ప్రజలు, రైతులపై పడే ప్రభావాన్ని తగ్గించేందుకు చేపట్టాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. తాగునీటి సరఫరా, నీటి వనరుల పరిరక్షణ, సాగునీటికి విద్యుత్ సరఫరా, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక, కరువు నివారణకు



ముందస్తు చర్యలు వంటి కీలక అంశాలపై అఖిలపక్ష నాయకుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. సమావేశంలో కాంగ్రెస్ నేత అంజన్‌కుమార్ యాదవ్, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు వినోద్‌కుమార్, ఎల్.రమణ, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, బీజేపీ ప్రతిపక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కొమురయ్య, ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ, ఎంఐఎం ప్రతిపక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ, సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి, తెలంగాణ జన సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరాం, సమాజ్‌వాదీ పార్టీ నాయకులు ప్రొఫెసర్ సింహాద్రి, వెంకటేశ్వర్లు, ఆర్జేడీ నాయకురాలు శోభ యాదవ్, బీఎస్పీ రాష్ట్ర నాయకుడు శ్రీరామ్ కృష్ణ, ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షుడు హేమ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.
సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు వ్యక్తం చేసిన ఆందోళనలను ప్రభుత్వం శ్రద్ధగా ఆలకించిందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. తదుపరి కార్యాచరణను నిర్ణయించే సమయంలో వారి అభిప్రాయాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు.
సమావేశానికి హాజరై తమ అభిప్రాయాలను పంచుకున్న నాయకులకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రకృతి విపత్తు కారణంగా ఎదురవుతున్న సవాళ్లను నిర్మాణాత్మక దృక్పథంతో పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు.
“నదీజలాల అంశాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను, తెలంగాణ రైతుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది” అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రం ఎదుర్కొంటున్న సవాళ్లు, ప్రస్తుత పరిస్థితులను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వారు చర్చించారు.

edited, Printed, Published and Owned by:Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA. www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136